# టిసిపార్డ్

# TSIPARD




సంపుటి : 8     సంచిక : 11

డిసెంబర్ 2016



ఎడిటర్

**నీతూకుమారి ప్రసాద్,** ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**బి. నరేంద్రనాథ్ రావు**

**బి. శేషాద్రి**

**పి. వెంకటరామిరెడ్డి**

**కె. మాధురి**

**డా॥ జి. ఆంజనేయులు**

**కె. యాదయ్య**

**ఎ.నాగేశ్వరరావు**

**డా॥కె.ఆసయ్య**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,
టిసిపార్డ్**



ప్రింటింగ్

**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్
లిమిటెడ్, హైదరాబాద్**

ప్రచురణ

**టిసిపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.
ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం .......... 4
పల్లె సన్నిధిలో... ఐటీ పెన్నిధి! .......... 5
డిజిటల్ ధమాకా .......... 6
తెలంగాణ రాష్ట్రాన్ని బహిరంగ మలవిసర్జన లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి .......... 7
గ్రామ పంచాయతీలో సర్పంచులు, కార్యదర్శులు
చట్ట ప్రకారముగా నిర్వర్తించవలసిన విధులు .......... 8
టిసిపార్డు నూతన జాయింట్ డైరెక్టర్‌గా
బి.నరేంద్రనాథ్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరణ .......... 9
సర్కారు బడిలో... డిజిటల్ విద్య .......... 10
కేంద్ర ప్రభుత్వ సరికొత్త పథకం డిజిటల్ ఇండియా .......... 11
భారత్‌లో తయారీ .......... 12
పల్లె సీమలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు .......... 14
స్వచ్ఛతపై అవగాహన, ఆచరణే ముఖ్యం .......... 17
ఇంధన సంరక్షణే దేశాభివృద్ధికి మూలం .......... 18
కేంద్ర ప్రభుత్వ పథకాలు .......... 20
మానవాళిని ప్రేమించే క్రీస్తు .......... 23
జియో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ శిక్షణలకు జాతీయ అవార్డు .......... 27
పంచాయతీరాజ్ శాఖలో 100 శాతం నగదు రహిత లావాదేవీలకు కృషి .......... 27
ప్రజల చెంతకు పాలన .......... 28
టిసిపార్డు నందు జండర్ గవర్నెన్స్‌పై వర్క్‌షాప్ .......... 29
పాడిపరిశ్రమ అభివృద్ధి చెందిన నాడే రాష్ట్రంలో రైతాంగం సుభిక్షంగా ఉంటుంది .. 30
2017 ప్రభుత్వ సెలవులు .......... 31
బాలల హక్కులను కాపాడుదాం .......... 32
బాలికా విద్యా ప్రాముఖ్యత .......... 33
పిల్లల్లో పోషకాహార లోపం-రుగ్మతలు .......... 35
చాట.. బుట్ట ఉపాధి బాట .......... 36
బలమైన విద్యారంగంతోనే బంగారు భవిత .......... 38
సంక్షేమ శ్రేయో రాష్ట్రంగా తెలంగాణ .......... 41
మైనారిటీ, సంక్షేమ పథకాలు .......... 43
స్త్రీలపై హింస పరిస్థితి .......... 45
మహిళ బీడీ కార్మికుల స్థితి .......... 46
తెలుగు సినిమాలో తెలంగాణం .......... 48
సోషల్ ఆడిట్‌పై డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్‌లకు టిసిపార్డులో శిక్షణా కార్యక్రమం .......... 50
సౌరవిద్యుత్‌తో గృహ వినియోగం .......... 51
నగరానికి... టూరిజం శోభ .......... 55
స్వచ్ఛభారత్‌పై టిసిపార్డులో వర్క్‌షాప్ .......... 56
తొలిసారి సాగుకు 'సింగూరు' నీళ్ళు .......... 57
జీవ ఇంధనాలు వాడకంతో పర్యావరణ పరిరక్షణ .......... 58
జెర్బరా పూలు... లాభాలు బాగు...! .......... 60
విశ్వనగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ .......... 61
గ్రామీణులకు వరం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (యన్.ఆర్.హెచ్.ఎమ్.) .......... 63

సంపాదకీయం

# ప్రజల అవసరాల నెరవేర్పు

తెలంగాణ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాల ఫలాలను దారిద్ర రేఖకు దిగువన ఉన్న మారుమూల గ్రామ ప్రజలకు చేరవేయుటలో చాలా చురుకుగా, సమర్థవంతంగా పని చేస్తుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛభారత్' మిషన్‌ను గ్రామాల్లో అమలు చేసి గ్రామాలు శుభ్రంగా ఉంచుటకు, మరుగుదొడ్ల నిర్మాణంను చేపట్టి బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా తయారు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కంకణం కట్టుంది. ఈ కార్యక్రమంను గ్రామాలలో అమలు చేయుటకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద నిధులను ఉపయోగించి పనుల ద్వారా అనేక గ్రామాలు, మండలాలు, జిల్లాస్థాయిలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతుంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లా నియోజకవర్గంలో పలు గ్రామాలు బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా ప్రకటించుకోవడం జరిగింది. అదే విధంగా మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో పలు గ్రామాలలో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించుకొన్నాయి. బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా 100% ఫలితాలను సాధించిన గ్రామాలకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అవార్డులను కూడా ప్రకటించడంతో ఓడిఎఫ్ గ్రామాలుగా నిరూపించుకొనేందుకు పలు పంచాయతీ సర్పంచులు మరుగుదొడ్లు నిర్మాణించేందుకు కృషి చేస్తుంది.

అదే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేసేందుకు, సాధించేందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి అమలుచేయుటకు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకొనుచున్నారు. సెర్ప్ (పేదరిక నిర్మూలన సంస్థ) ద్వారా ప్రతినెలా తప్పకుండా ఆసరా పెన్షన్‌లు వృద్ధులకు, వికలాంగులకు, కళావృత్తి పనుల వారికి 1000 నుండి 1500 ఫించను చెల్లించుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పారదర్శకంగా వ్యవహరిస్తున్నారు. పెద్దనోట్లు రద్దు అనంతరం కూడా ఏ విధమైన ఇబ్బంది లేకుండా వారికి బ్యాంకులు, ఏటిఎం ల ద్వారా పింఛన్లు చెల్లింపులు చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మి/ షాదీముబారక్ వంటి ప్రజాకర్షణ పథకాలను కూడా ఎంతో సమర్థంగా అమలు చేయడం జరుగుతుంది. ఈ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ వర్గాలకు చెందిన ఆడపిల్లలకు వివాహం చేయలేని పేద కుటుంబాలు ఎంతో సంతోషిస్తున్నాయి. అనేక విద్యసౌకర్యాలను కల్పించడంతో పాటు బాలికల చదువుకు ప్రత్యేక ప్రాధాన్యతను ఈ ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది

వైద్య సౌకర్యాలను అందజేయుటకు ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలతో పేదల ఆరోగ్య అవసరాలను తీర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంది.

అన్నింటి కంటే మించి దారిద్ర్య రేఖకు దిగువుగానున్న వారికి పని కల్పించుటకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ను అమలు చేయుటకు వారికి కూలీ పనులు మొత్తం ఇబ్బందులు లేకుండా చెల్లించుటకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఈ విధంగా నగదు రహిత గ్రామాలను ఏర్పాటు చేసి నగదు ఇబ్బందులను తొలగించుటకు అన్ని వర్గాలు పాలుపంచుకోవడం ద్వారా ముఖ్యమంత్రి ఆలోచనలకు మద్దతు కల్పించడం జరుగుతుంది.

(నీతూకుమారి ప్రసాద్)




# పల్లె సన్నిధిలో.. ఐటీ పెన్నిధి!

పంచాయతీరాజ్‌శాఖ ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె సమగ్ర సేవా కేంద్రాల(వన్‌స్టాఫ్ షాప్)కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. వీటి ద్వారా అందుతున్న ఆర్థిక, పౌర సేవలపై గ్రామీణులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 150 వన్‌స్టాప్ షాపులు పనిచేస్తున్నాయి. వాటి సంఖ్యను 200కు పెంచడానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివ ృద్ధి శాఖ చర్యలు తీసుకుంటున్నది. ప్రస్తుతం ప్రభుత్వంలోని ఐదు శాఖలకు చెందిన 16 రకాల సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చారు. మరిన్ని సేవలను అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఆర్థిక, పౌర సేవలను సులభంగా అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. వివిధ రకాల సేవలు ఒకే దగ్గర లభిస్తే ప్రజలకు సొమ్ము ఆదా కావడంతోపాటు సమయం కలిసి వస్తుంది. 2015 అక్టోబర్ 2న రాష్ట్రవాప్తంగా 105 కేంద్రాల్లో సేవలను ప్రారంభించారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన, వివిధ గ్రామపంచాయతీల్లో కల్పిస్తున్న వసతి ఆధారంగా ఈ కేంద్రాల సంఖ్యను 150కి పెంచారు. మరో 50 కేంద్రాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. నిర్వహణ బాధ్యతలను స్త్రీనిధి సంస్థకు అప్పగించారు. గ్రామ స్థాయిలోని స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపికచేసిన గ్రామ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ద్వారా ఇవి పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ కేంద్రాల నిర్వాహకులకు నెలకు రూ.1000 నుంచి రూ.8వేల వరకు ఆదాయం వస్తుంది. వివిధ బ్యాంకుల ఆర్థిక సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తేవడం, సామాజిక పింఛన్లు అందించడం, ఉపాధి వేతనాలను చెల్లించడం, మీసేవలో లభించే పౌరసేవలను అందించడం, ఈపంచాయతీ సేవలను సమకూర్చడం, నగదు బదిలీ, ప్రజా సమస్యలను సంబంధిత శాఖలకు చేరవేసి, వాటిని పరిష్కరించడానికి కృషి చేయడం లాంటి కార్యకలాపాలను నిర్వహిస్తారు. దశలవారీగా వీట సంఖ్యను 500కు పెంచడంతో పాటు అన్ని గ్రామాలకు విస్తరించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఐటీ ఆధారిత సేవలను మెరుగు పర్చడంతోపాటు ప్రజలతో నేరుగా సంబంధం ఉండే శాఖలను ఈ కేంద్రాల పరిధిలోకి తేవడం జరుగుతుందని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొంటున్నారు. కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్, స్కానర్ ఉంటే ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసే వెసులుబాటు కలుగుతుంది. ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవల అనేక గ్రామ పంచాయితీలు ముందుకొస్తున్నాయి. నగరాల్లో మీ సేవ కేంద్రాల్లో అందే అన్ని రకాల సేవలను వన్‌స్టాప్ షాప్‌లో అందించడానికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నారు.

# డిజిటల్ ధమాకా




పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో డిజిటల్ లావాదేవీల వైపు తెలంగాణ వేగంగా అడుగులు వేస్తున్నది. గత నెలరోజుల్లో డిజిటల్ లావాదేవీల విధానాల్ని వినియోగించుకుంటున్న వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. మరోవైపు, ప్రజల్లో నగదు రహిత లావాదేవీలను పెంపొందించటానికి రాష్ట్రప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అనుగుణంగా... నిరక్షరాస్యులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయటం కోసం తగిన ప్రక్రియలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. గో క్యాష్‌లెస్, గో డిజిటల్... మై మొబైల్... మై బ్యాంక్.... మై వ్యాలెట్ వంటి నినాదాలతో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఊపందుకున్నది. స్వైపింగ్ మెషిన్లు, పేటీఎంల వంటి వాటితోపాటు... చదువురాని వారు వేలిముద్రలతో నగదు రహిత లావాదేవీలను నిర్వహించేందుకు వీలుగా ఆధార్ అనుసంధానిత పేమెంట్ సిస్టమ్‌ను రాష్ట్ర సర్కార్ అందుబాటులోకి తీసుకొస్తున్నది. స్మార్ట్ ఫోన్ లేని అనేక మంది కోసం... ఎటువంటి ఫోన్ నుంచైనా, ల్యాండ్ ఫోన్ నుంచైనా నగదును మార్చుకునే యుఎస్ఎస్‌డీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్రఆర్థికశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా చైర్మన్‌గా నోట్లరద్దుపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా కొన్ని రకాల డిజిటల్ చెల్లింపులపై దృష్టి పెట్టింది. అవి... యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డాటా (యుఎస్ఎస్‌డీ), ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్), ఎలక్ట్రానిక్ వ్యాలెట్ (ఈ-వ్యాలెట్), కార్డులు, స్వైపింగ్ మెషిన్లు. ఈ-వ్యాలెట్‌లో ఎస్‌బీఐ బడ్డీ, పేటీఎం వంటి సేవలు వస్తాయి. కార్డులు, పీఓఎస్‌లలో ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డుల వంటివి ఉంటాయి.

**మొబైల్‌తోనైనా యూఎస్ఎస్‌డీ సేవలు**

స్మార్ట్‌ఫోనే కాకుండా ఏ రకమైన మొబైల్ ఫోన్ నుంచైనా, ల్యాండ్ ఫోన్ నుంచి కూడా డిజిటల్ లావాదేవీలను నిర్వహించడానికి ఉపయోగపడే అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డాటా (యూఎస్ఎస్‌డీ)తో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఖాతా ఉన్న బ్యాంకులో మన మొబైల్ ద్వారా రోజుకు గరిష్ఠంగా 5 వేల రూపాయల వరకు లావాదేవీలు జరుపవచ్చు. యూఎస్ఎస్‌డీ వినియోగం ఇటీవల బాగా పెరిగింది. రాష్ట్రంలో నవంబర్ 30 నాటికి మొత్తంగా ఏడు వేల మంది ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోగా డిసెంబర్ తొలివారానికి ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. గత నెల వరకు రోజుకు కేవలం 220 మంది మాత్రమే ఈ సేవలను ఉపయోగించుకున్నారు. కానీ డిసెంబర్ 1 నుంచి రోజుకు వేయి నుంచి 1200 మంది దీనిని ఉపయోగించుకుంటున్నారు.

**ఆధార్‌తో డిజిటల్ లావాదేవీలు**

ఆధార్ కార్డు ఉండి బ్యాంకులలో వేలిముద్రలను నమోదు చేసుకున్న ఖాతాదారులు ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్‌ను ఉపయోగించుకుని చాలా వరకు నగదు రహిత లావాదేవీలను నిర్వహించుకోవచ్చు. దీనికి పిన్ నెంబర్, పాస్‌వర్డ్ కూడా అవసరం లేదు. ఈ విధానాన్ని పల్లె ప్రాంతాలలో ఎక్కువగా ఉపయోగించనున్నారు. నిరక్షరాస్యులకు ఇది చాలా ఉపయోగం. ఈ విధానాన్ని విస్తృతంగా ఉపయోగంలోకి తీసుకురావటానికి రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

**యూపీఐ విధానం**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) విధానాన్ని దేశవ్యాప్తంగా కోట్లాదిమంది వినియోగిస్తున్నారు. మొబైల్‌ఫోన్ల ద్వారా ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు నగదును మార్చుకునే వీలు దీంట్లో ఉంటుంది. దీనికోసం ఖాతాదారులు సంబంధిత బ్యాంకు నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పెద్దనోట్ల రద్దు తర్వాత యూపీఐ వినియోగం విపరీతంగా పెరిగింది. డిసెంబర్ ఒకటో తేదీన దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది దీనిద్వారా లావాదేవీలు జరిపితే 5వ తేదీన ఆ సంఖ్య 12.09 కోట్లకు పెరిగింది. ఈ విధానాన్ని తెలంగాణలో విస్తృతంగా ఉపయోగంలోకి తీసుకురావటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**ఎస్‌బీఐ బడ్డీకి భలే గిరాకీ**

ఎస్‌బీఐ బడ్డీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వారి సంఖ్య తెలంగాణలో నాలుగు రెట్లకు పైగా పెరిగింది. పెద్దనోట్లు రద్దుకాక ముందు కేవలం12వేల మంది ఖాతాదారులు మాత్రమే ఈ యాప్‌ను ఉపయోగించుకునేవారు. నోట్లరద్దు అనంతరం వారిసంఖ్య 50,850కి పెరిగింది. తెలంగాణలో ప్రతీరోజు కొత్తగా 850 మంది దీనిని ఉపయోగిస్తున్నారని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా చూస్తే నోట్లరద్దుకు ముందు 14లక్షల మంది ఈ యాప్‌ను ఉపయోగించగా



# తెలంగాణ రాష్ట్రాన్ని బహిరంగ మలవిసర్జన లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

**- మంత్రి జూపల్లి**

తెలంగాణ రాష్ట్రంను 2018 నాటికి బహిరంగ మలవిసర్జన లేని రాష్ట్రంగా తీర్చిదిద్దవలయునని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. టిసిపార్డు నందు స్వచ్ఛ భారత్ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ టిసిపార్డ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉంచుటకు కూడ వాడు కొనవచ్చునని సూచించారు.

ఈ సమావేశంకు హాజరైన జిల్లా డి.ఆర్.డి.ఏ. అధికారుల తో మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలను సాధించుటకు డి.ఆర్.డి.ఏ. అధికారులు లక్ష్యాలను సాధించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక శ్రీ ఎస్.పి.సింగ్, ఐఏఎస్, కమీషనర్ పి.ఆర్. ఆర్ డి శ్రీమతి నీతూ కుమారి ప్రసాద్ ఐఏఎస్, రిసోర్స్ పర్సన్ శ్రీ.సి నాబా, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ శ్రీ రాములు నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గత కొన్ని రోజులుగా వీరిసంఖ్య దాదాపు 40లక్షలకు పెరిగింది.

**పేటీఎం, పీఓఎస్‌ల జోరు**

డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న క్రమంలో హైదరాబాద్‌తోపాటు చాలా ప్రాంతాలలో పేటీఎం బాక్స్‌లు కనిపిస్తున్నాయి. మొబైల్‌యాప్‌ల ద్వారా పేటీఎంలలో డిజిటల్ లావాదేవీలు నిర్వహించే వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. తెలంగాణలో పేటీఎంను వాడేవారు నోట్లరద్దుకు ముందు 12 లక్షల మంది ఉండగా ఇప్పుడు వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. ఇక స్వైపింగ్ మెషిన్ల వినియోగం రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నది. తెలంగాణలో అక్టోబర్ 30వ తేదీ నాటికి ఉపయోగంలో ఉన్న స్వైపింగ్‌మెషిన్ల సంఖ్య 34,677. ప్రస్తుతం అది 50,951కి పెరిగిందని అధికారులు వెల్లడించారు. మరో 20వేల స్వైపింగ్ మెషిన్లు తక్షణం కావాలంటూ బ్యాంకులు ఇండెంట్ పంపించినట్లు సమాచారం. ఈ విధంగా డిజిటల్ లావాదేవీల దిశగా తెలంగాణ దూసుకెళ్తున్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు**

నగదు రహిత లావాదేవీలవైపు ప్రజలను తీసుకెళ్లేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా




గ్రామీణప్రాంతప్రజల్లో అవగాహన కల్పించటం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అవేర్‌నెస్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఆర్థికశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ డిజిటల్ లావాదేవీల నిర్వహణ తీరుపై కరపత్రాలు, బ్యానర్లు, ప్రదర్శనలు , వీడియో క్లిప్పింగుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టింది. డిజిటల్ లిటరసీ క్యాంప్‌ల ద్వారా నగదు రహిత చెల్లింపులపై ప్రచారం నిర్వహిస్తున్నది.

**– బి.నరేంద్రనాథ్‌రావు, జాయింట్ డైరెక్టర్, టిసిపార్డ్**

# గ్రామపంచాయతీలో సర్పంచులు, కార్యదర్శులు చట్ట ప్రకారముగా నిర్వర్తించవలసిన విధులు

పంచాయతీరాజ్ చట్టము 1994, మే 30, 1994 నుండి అమలులోకి వచ్చినది తెలంగాణ ప్రభుత్వము ఈ చట్టమును అడాప్ట్ చేసుకొని, దానిని ప్రస్తుతం అమలు చేయుచున్నది. ఈ చట్టములో 278 సెక్షనులు (8) భాగములుగా విభజించి స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీ, మండల పంచాయతీ, జిల్లా పంచాయతీల పరిపాలన నియమనిబంధనలు రూపొందించబడినవి.

ఈ చట్టములో సెక్షను 3 నుండి 147 వరకు గ్రామపంచాయతీల పరిపాలన విధివిధానములు రూపొందించబడినవి. వీటికి లోబడి ప్రజల భాగస్వామ్యంతో, సుపరిపాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమములు అమలుపరుచే గురుతర భాధ్యత సర్పంచులు, కార్యదర్శులపై ఉన్నది. నిరంతరం జరుపు సుపరిపాలనలో ఏఏ పనులు, ఏ ఏ మాసములలో చేయాలి అనే విషయములు ఈ క్రింది విధముగా సూచించినారు.

**జనవరి**

1. పన్నుల వసూలు కార్యక్రమము ముమ్మరంగా సాగించుట.
2. సంతలు, రేవులు, బండ్లు, బస్సులు ఆగే స్థలము, చెట్ల ఫలసాయము చేపల పెంపకము, చెరువులు మొదలగు వాటికి సంబంధించిన కౌలు హక్కులను వేలము నోటీసు ప్రకటించిన పిదప వేలము వేయడం, అన్ని రకాల వేలములకు కనిష్ట ధర చట్టప్రకారము పొంది విస్తీర్ణాధికారి/ డివిజన్‌లు పంచాయతీ అధికారి సమక్షంలో జరపాలి.
3. బాకీ చెల్లించని వారిని కౌలు నుండి తొలగించి బాకిపడిన మిగతా డబ్బును పంచాయతీ ద్వారా కొని తిరిగి వేలము వేసి గాని మార్చి 31 వరకు వసూలు చేయడం.
4. కౌలు రుసుములు చెల్లించకుండా బాకి పడిన వారి నుండి పూర్తిగా ఈ మాసములో వసూలు చేయవలయును.
5. జనవరి '2'న జరుగవలసిన గ్రామసభ నిర్వహించుట.
6. రాబోవు సం॥ ప్రత్తి వ్యాపార లైసెన్సులకు జాబితా తయారు చేయటము.

**ఫిబ్రవరి**

1. పన్నులు చెల్లించని వారిపై జప్తు జరుపటానికి ప్రయత్నించుట.
2. జప్తును ఆటంకపరిచే వారిపై ప్రాసిక్యూషన్ దాఖలు చేయుట.
3. బాకి పడిన కౌలుదారులపై, పన్నులు కట్టనివారిపై సివిల్ దావాలు వేయించుట.
4. రాబోవు సంవత్సరము కౌలు హక్కుల వేళము పాటను పంచాయతీచే ఆమోదింపజేసి కౌలుదారుల నుండి నిర్ణయించిన డిపాజిట్టులు వసూలు చేసి అగ్రిమెంట్లు వ్రాయించుకొని, రిజిస్ట్రేషన్ చేయించటము.
5. వసూలు చేయటానికి వీలులేని పన్నులు జాబితా తయారు చేసి వారికి పంచాయతీ పరిధిలో జప్తు చేయడం, చరాస్తులు ఏమి లేవని నిర్ధారణ చేసుకొనుట.
6. అపాయకరమైన వ్యాపారాలు నడిపే వారి నుండి ఫీజు వసూలు చేసి లైసెన్సులు రిన్యూవల్ చేయుట



**మార్చి**

1. అన్ని రకములైన పన్నులు, ఫీజులు పూర్తిగా 100% వసూలు చేసి, వసూలు గాని పన్నులు ఫీజులు, సివిల్/ ప్రాసిక్యూషన్ గాని చేసిన వారి వద్ద నుండి పన్నులు, ఫీజులు వసూలు చేయుట.
2. అభివృద్ధి పనుల నిర్వహణ పూర్తి చేయాలి.
3. ప్రభుత్వం నుండి రావలసిన గ్రాంట్లను పంచాయతీకి జమచేయించుకొనుట.
4. పంచాయతీ చెల్లించవలసిన పద్దులను ఆయా ఖాతాలకు జమ చేయుట.
5. ప్రభుత్వం అందించిన గ్రాంట్లు సంవత్సరాంతములో ఉపయోగించుట.
6. ఏప్రిల్ మాసములో జరుపు గ్రామసభకు ఏర్పాట్లు చేయాలి.
7. సంవత్సరాంతపు ఆదాయ వ్యయములు పూర్తి చేయాలి.

**ఏప్రిల్**

1. గత సం॥ లెక్కలు ముగించి ఈ సం॥ లెక్కలు ప్రారంభించాలి.
2. ఇంటి పన్ను డిమాండు రాబట్టుట/ కరెంట్/ ఏరియర్స్ రిజిష్టరులు వేరువేరుగా తయారుచేయాలి.
3. అక్రమ నిర్మాణముల తనిఖీ చేసి జాబితా తయారుచేయాలి. తగు చర్యలు ప్రతిపాదించాలి.
4. కొత్త నిర్మాణములను పరిశీలించి ఇంటిపన్ను నిర్ధారించుట.
5. పరిపాలన నివేదిక తయారు చేయాలి.
6. గ్రామసభ జరుపవలెను.

**మే**

1. ఇంటిపన్ను డిమాండ్ బాట్లలను యజమానులకు అందజేయుట.

# టిసిపార్డు నూతన జాయింట్ డైరెక్టర్‌గా బి.నరేంద్రనాథ్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శిక్షణాసంస్థ (టిసిపార్డు) జాయింట్ డైరెక్టరుగా 01.12.2016న పదవీ బాధ్యతలు స్వీకరించారు.



శ్రీ బి.నరేంద్రనాథ్‌రావు మొట్టమొదటి సారిగా 1990 సం॥లో గెజిటెడ్ అధికారిగా ప్రభుత్వ సర్వీసులో నియమితులయ్యారు. అనంతరం 1996వ సం॥లో టిసిపార్డుకు శాశ్వత ఉద్యోగిగా బదిలీ అయ్యారు. బి.నరేంద్రనాథ్‌రావు 27 సం॥ల నుండి ప్రభుత్వ సర్వీసులో అనేక సేవలు అందిస్తున్నారు. టిసిపార్డ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఈ-గవర్నెన్స్ మరియు సహజ వనరుల యాజమాన్య కేంద్రం సెంటర్ హెడ్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆయన టిసిపార్డ్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేశారు.

బి.నరేంద్రనాథ్‌రావు బి.ఎస్.సి. కంప్యూటర్స్‌తో మరియు ఎం.సి.ఏ., బి.టెక్ లతో పాటు అనేక డిగ్రీలు పూర్తి చేశారు. టిసిపార్డు కంప్యూటర్స్ ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేయుటలో శ్రీ బి.నరేంద్రనాథ్‌రావు ఎంతో కృషి చేశారు. అంతేకాక టిసిపార్డులో పనిచేసిన కమీషనర్స్‌లతో సఖ్యతగా ఉంటూ పై అధికారులు మన్ననలు పొందారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు ఈ-గవర్నెన్స్ కేంద్రంలో సెంటర్‌హెడ్‌గా పనిచేస్తున్న కాలంలో ఆయన నిర్వహించిన జియో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ శిక్షణా కార్యక్రమాలకు గాను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుండి జాతీయ అవార్డును కూడా అందుకున్నారు.

2. లైసెన్సులు లేకుండా వ్యాపారము సాగిస్తున్న వారిపైన ప్రాసిక్యూషన్స్ దాఖలు చేయుట.
3. పరిపాలన నివేదిక పంచాయతీచే ఆమోదింపజేసి విస్తరణాధికారి గారికి పంపవలెను.
4. గ్రామపంచాయతీ ఆడిట్.

**జూన్**

1. అక్రమ నిర్మాణముల జాబితా వాటిలో అభ్యంతరకరమైన వాటిని తొలగించటానికి మరియు మిగిలిన వాటి నుండి రుసుములు వసూలు చేయటానికి గ్రామపంచాయతీ ఆమోదము పొందాలి.

**జూలై**

- అభివృద్ధి పనులకు పంచాయతీ మంజూరి పొంది అంచనాలు చేయటానికి తీర్మాణముతో ప్రతిపాదనలు పంపుట.
- పంచాయతీ స్థలంలో పంచాయతీకి చెందిన పోరంబోకు భూములలో చెరువు గట్లపై ఫలసాయం ఇచ్చే చెట్లను నాటించాలి.
- చెరువులలో మంచి రకము విత్తనములను వేయించటానికి మత్స్యశాఖ వారిని సంప్రదించాలి.
- జూలై 1న గ్రామ సభ నిర్వహించాలి.

**ఆగస్టు**

- అభివృద్ధి పనుల అంచనాలు స్వీకరించి పంచాయితీచే పరిపాలన మంజూరి చేయించాలి.
- పనుల నిర్వహణకు టెండర్లు పిలవాలి.

**సెప్టెంబర్**

- పనులకు సంబంధించిన టెండర్లను సక్రమంగా పరిశీలించి పంచాయతీ ఆమోదాన్ని పొందాలి.
- పనులు ప్రారంభించునట్లు చేయవలెను.
- అక్టోబర్‌లో జరుపు గ్రామసభకు తగిన ఏర్పాట్లు చేయవలెను.

**అక్టోబర్**

- గ్రామసభ నిర్వహించవలయును.
- అభివృద్ధి పనులకు సంబంధించిన వర్క్ ఆర్డరులు జారీ చేయవలయును.

**నవంబర్**

1. ఈ మాసములో ప్రభుత్వం ఆదేశించిన అన్ని కార్యక్రమములు పూర్తి చేయాలి.
2. బడ్జెట్ అంచనాలు తయారు చేసి గ్రామపంచాయతీ ఆమోదమునకు సమర్పించాలి.

**డిసెంబర్**

- గ్రామపంచాయతీకి కావలసిన రిజిష్టర్లు/ ఫారములు సమకూర్చుకొనవలయును.
- పన్నుల వసూలు కార్యక్రమాలు చేయాలి.
- గ్రా.ప. ఆమోదించిన బడ్జెట్ అంచనాలు 25 డిసెంబర్ లోపల సమస్యలు పంచాయతీ అధికారికి పరిశీలన నిమిత్తము సమర్పించవలెను.
- పైన తెలిపిన సూచనలు పాటించి గ్రామాభివృద్ధికి కృషి చేయగలరని సమస్త సర్పంచులు/ కార్యదర్శులు/ గ్రా.ప.సిబ్బందిని కోరడమైనది.


**– బి.లింబగిరిస్వామి, టిసిపార్డ్**

# సర్కారు బడిలో..డిజిటల్ విద్య

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నుతూ.. సర్కారీ స్కూళ్లు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాయి. నూతన టెక్నాలజీని వాడుకుంటూ డిజిటల్ విద్యాబోధనవైపు అడుగులేశాయి. పాఠ్యపుస్తకాలు, బోధనోపకరణాల అవసరం లేకుండా అర్థవంతమైన బోధనను విద్యార్థులకు అందించేందుకు సిద్ధమయ్యాయి.

ఆకర్షణీయ బోధన పేరిట ఇన్నాళ్లుగా కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన డిజిటల్ క్లాసులు ప్రభుత్వ స్కూళ్లలోనూ ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి డిజిటల్ క్లాస్‌రూంతో పాటు మనటీవీ ద్వారా ఆన్‌లైన్ క్లాస్‌రూం, కే-యాన్ ప్రొజెక్టర్ ద్వారా ఆఫ్‌లైన్ క్లాస్‌రూంలను ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ డిజిటల్ విద్యను ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయంగా భావించరాదని, బోధనలో సహాయకారిగా మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. డిజిటల్ తరగతుల వల్ల విద్యాభ్యాసం మరింత సులువవుతుందన్నారు. 2017 విద్యాసంవత్సరం నాటికి వందశాతం డిజిటల్ విద్యను అందుబాటులోకి తెస్తామన్నారు. పిల్లలతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ జి.కిషన్, కలెక్టర్ రాహుల్ బొజ్జా, సర్వశిక్షా అభియాన్ ఏఎస్‌పీడీ భాస్కర్‌రావు, ఆర్జేడీ కృష్ణారావు, ఎస్‌సీఈఆర్‌టీ సలహాదారు ఉపేందర్‌రెడ్డి, ఆర్‌ఎంఎస్‌ఏ జేడీ రమణకుమార్, డీఈవో జి.రమేష్, కార్పొరేటర్ మన్నె కవితాగోవర్ధన్‌రెడ్డి, మాడ్యుల్స్ రైటర్ సువర్ణ వినాయక్, గతి కన్సల్టెన్సీ ప్రతినిధి ఎంఎస్‌టీ రావు పాల్గొన్నారు.






**శ్రద్ధగా పాఠం విన్న డిప్యూటీ సీఎం..**

డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పాఠశాల విద్యార్థిగా మారిపోయారు. విద్యార్థులతో సహా బెంచీపై కూర్చున్న ఆయన జీర్ణకోశం, దంత వ్యవస్థ పాఠ్యాంశాలను శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థులతో పాటు బోధనను ఆసక్తిగా గమనించిన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. బోధన పూర్తైన తర్వాత పాఠాలు ఎంతవరకు అర్థమయ్యాయని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులందరూ ఫస్ట్‌క్లాస్ మార్కులు సాధించాలని ఉద్బోధించారు.

**182 పాఠశాలల్లోనూ..**

జిల్లాలోని 182 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఒకేరోజు 100శాతం డిజిటల్ విద్య అందుబాటులోకి రావడం గమనార్హం. అమీర్‌పేట ధరమ్ కరమ్ రోడ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, తిరుమలగిరిలో ఎమ్మెల్యే సాయన్న, ఫిలింనగర్‌లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సైదాబాద్‌లో ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే డా. కె.లక్ష్మణ్, యూసుఫ్‌గూడలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లు డిజిటల్ తరగతులను ప్రారంభించారు.

**స్కూళ్లో ఆఫ్‌లైన్.. ఇంట్లో ఆన్‌లైన్..**

పాఠశాలల్లో మనటీవీ ద్వారా ఆన్‌లైన్ చదువులు అందుబాటులోకి రాగా, కే-యాన్ ప్రొజెక్టర్ల ద్వారా ఆఫ్‌లైన్ బోధననందించనున్నారు. ఈ రెండింటిని వినియోగించుకునేలా పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మన టీవీ ప్రసారాల ద్వారా ఆన్‌లైన్‌లో చదువుకునే అవకాశం ఉండగా, కే-యాన్ ప్రొజెక్టర్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో చదువుకోవచ్చు. కేబుల్ టీవీ ప్రసారాల లాగే మనటీవీలోనూ తరగతి గది పాఠ్యాంశాలను ప్రసారం చేస్తున్నారు. ఈ రెండు సౌకర్యాలు ఒకేరోజు అందుబాటులోకి రావడం గమనార్హం.

**కే-యాన్‌తో బహుళ ప్రయోజనాలు..**

కే-యాన్ ప్రొజెక్టర్‌తో బహుళ ప్రయోజనాలున్నాయి. చిన్నపాటి ప్రొజెక్టరే.. చాలా ఎలక్ట్రికల్ డివైస్‌లకు ప్రత్యామ్నాయంగా రూపొందించారు. కే-యాన్‌ను ఇంటరాక్టివ్ వైట్‌బోర్డ్, టీవీ, కంప్యూటర్, ప్రొజెక్టర్, డీవీడీ ప్లేయర్, ఆడియో సిస్టమ్‌లుగా వాడుకోవచ్చు. ఈ ప్రొజెక్టర్‌ను ఐఐటీ ముంబై సహకారంతో రూపొందించారు. విద్యాబోధనలో ఉన్న లోపాలపై అధ్యయనం చేసిన నిపుణులు ఈ పరికరాన్ని రూపొందించారు. ఈ ప్రొజెక్టర్‌ను చాలా రాష్ట్రాల్లో వినియోగిస్తున్నారు. దీని విలువ రూ. 1.40 లక్షలు కాగా, తెలంగాణ ప్రభుత్వం కోరికమేరకు కేవలం రూ. 89వేలకే అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు పాఠాలను అప్‌గ్రేడ్ చేయడం, సరికొత్త నూతన అంశాలను పొందుపరచడం దీని ప్రత్యేకత.

**బ్లాక్ బోర్డ్ అవసరమే లేదు..**

పాఠశాల అంటే నల్లబల్ల ఉండాల్సిందే. నల్లబల్లలేని పాఠశాలలుండవంటే అతిశయోక్తికాదేమో. కానిప్పుడా అవసరం ఉండకపోవచ్చు. కే యాన్ ప్రొజెక్టర్‌లో ఇంటరాక్టివ్ వైట్‌బోర్డ్ ఆప్షన్‌ను ఎంచుకుంటే తెరపై వెట్‌బోర్డ్ డిస్లే అవుతుంది. ఈ వైట్‌బోర్డ్ మీద.. ఏదైనా రాయొచ్చు. తప్పులురాస్తే సరిచేయడం, తప్పుగా పటాలు గీస్తే.. దానికదే సరిచేసుకోవడం ఈ ఒక్క ప్రొజెక్టర్‌తోనే సాధ్యం. ఒకే ఒక్క కేబుల్‌వైర్‌తో ఉన్న ఈ ప్రొజెక్టర్‌ను ఒక గది నుంచి మరో గదికి మార్చుకోవచ్చు.



## కేంద్ర ప్రభుత్వ సరికొత్త పథకం

# డిజిటల్ ఇండియా

Digital India
Power To Empower

కేంద్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం పేరు డిజిటల్ ఇండియా. ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా ఈ 'డిజిటల్ ఇండియా' ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ప్రధాని మోడీ ఈ కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సమీపంలోని రెండు గ్రామ పంచాయతీల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఆర్ఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ, టాటా గ్రూప్ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ, విప్రో ఛైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ తదితరులు హాజరయ్యారు. ఇందులో భాగంగా సీ-డాక్ రూపొందించిన ఈ-హస్తాక్షర్ సేవలను ప్రధాని మోడీ ఢిల్లీలో ప్రారంభిచారు. ఐటీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ-సర్వీస్, ఈ-ప్రొడక్ట్స్, సాఫ్ట్‌వేర్ స్కీంలకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామ, పాఠశాలల స్థాయిలో డిజిటల్ ఇండియా వీక్‌ను ప్రభుత్వం రూపొందించింది. డిజిటల్ ఇండియా అంటే ఏమిటి అనే దానికి సరికొత్త నిర్వచనం ఇచ్చింది. డిజిటల్ ఇండియాలో భాగంగా భారత్ ఓ బలోపేతమైన ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాలన్నది ప్రధాని మోడీ లక్ష్యం. డిజిటల్ లాకర్, ఈ-విద్య, ఈ-వైద్యం, వాణిజ్యం, పరిపాలన వంటి తదితర సేవలన్నీ ఇకపై ఆన్‌లైన్లో అందించేందుకు చర్యలు. మొత్తం లక్షా 13 వేల కోట్ల పెట్టుబడులతో రెండున్నర లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం. అవినీతి తగ్గింపు, సాంకేతిక ఫలాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు డిజిటల్ ఇండియా ప్రాజెక్టు ఉపయోగం. ఈ ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామ పంచాయితీలకు బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ సేవలు, ఈ-పరిపాలన వంటివి అందిస్తారు. డిజిటల్ ఇండియా యాప్స్ డిజిటల్ ఇండియా పోర్టల్, మైగవర్నమెంట్ మొబైల్ యాప్, స్వచ్ఛభారత్ మిషన్ యాప్, ఆధార్ మొబైల్ అప్‌డేట్ యాప్ డిజిటల్ ఇండియా ప్రాముఖ్యం. ప్రతి పౌరుడికి అవసరంగా డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్. గుడ్ గవర్నెన్స్ సేవలు. సిటిజన్స్‌కు డిజిటల్ సాధికారత డిజిటల్ ఇండియాకు పిల్లర్స్. బ్రాడ్‌బ్యాండ్ రహదారులు. ఫోన్లకు యూనివర్సల్ యాక్సెస్. పబ్లిక్ ఇంటర్నెట్ యాక్సెస్ కార్యక్రమం. ఇ-పాలన - టెక్నాలజీ ద్వారా ప్రభుత్వం సంస్కరణలు. ఇ-క్రాంతి - సేవల ఎలక్ట్రానిక్ డెలివరీ . అన్నింటి సమాచారం కోసం. ఎలక్ట్రానిక్స్ తయారీ - టార్గెట్ నెట్ జీరో. ఐటి ఉద్యోగాలు కోసం. ప్రారంభ పంట ప్రోగ్రాములు సుమారు వారం రోజుల పాటు బీఎస్ఎన్ఎల్ డిజిటల్ వీక్ సంబురాల్ని జరుపుకుంది. దీని ద్వారా పాఠశాల విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఆధునిక ఇంటర్నెట్ పోకడలను పరిచయం చేస్తామని బీఎస్ఎన్ఎల్ ఇండోర్ సర్కిల్ జీఎం ఎంఆర్ రావత్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటలైజేషన్ పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. ప్రభుత్వ సేవల్లోడిజిట్ ప్రామాణికాలను పాటించడం జరుగుతుంది. ఇప్పటికే డిజిటల్ తెలంగాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ సేవల్లో పారదర్శకతకు నాంది పలికింది. గ్రామాలకు డిజిట్ సేవలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటుంది. ఆన్ లైన్ సేవలను దశల వారిగా అందుబాటులోకి తేవడం జరుగుతుంది. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రయాసను తగ్గించడం జరుతుంది. అధికార వ్యవస్థకు జవాబుదారితనం కల్పించడం జరుగుతుంది. విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన సర్టిఫికెట్లను డిజిట్ ఇండియా లాకర్ లో భద్రపర్చుకునే సదుపాయం దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే విద్యా, ఉద్యోగ నియామకాలలో కంప్యూటరైజేషన్ ను పూర్తి చేసింది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ విభాగాలను కంప్యూటరీకరించడం జరుగుతుంది. దశలవారిగా ప్రభుత్వ శాఖలను కంప్యూటరీకరించడంతో పౌరులకు డిజిట్ సాధికారత కల్పించే దిశగా ముందుకు సాగుతుంది. ప్రతి పౌరుడుఇంటర్నెట్ వాడే విధంగా చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ సేవలను పౌరులు హక్కుగా పొందే వెసులుబాటు త్వరలోనే అందెబాటులోకి రాబోతుంది.




# భారత్ లో తయారీ

## (మేక్-ఇన్-ఇండియా)

భారత్ ను ప్రపంచ కర్మాగారంగా, తయారీ రంగానికి కేంద్రంగా మార్చే లక్ష్యంతో మేకిన్ ఇండియా పథకాన్ని ప్రారంభించారు. దీంట్లో భాగంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్ డి ఐలను) ఆకర్షించే విధంగా నిబంధనలను సరళీకరించడం, కార్మిక చట్టాల్లో సంస్కరణలు తీసుకురావడం, ప్రభుత్వ యంత్రాంగంలో అలసత్వానికి తావులేకుండా చూడటం వంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 సెప్టెంబర్ 25న మేకిన్ ఇండియా పథకాన్ని ప్రారంభించారు. రైల్వే, బీమా, రక్షణ, వైద్య పరికరాల తయారీ రంగాల్లో సంస్కరణలు చేపట్టి విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలికారు. దీని ఫలితంగా ఎఫ్ డి ఐ లలో గణనీయమైన వృద్ధి నమోదయింది. నరేంద్రమోదీ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిపై కేంద్రం విడుదల చేసిన గణాంకాలలో భారత్ లో తయారీ పథకంలోని పురోగతిని వివరించింది. ఈ పథకాన్ని ప్రారంభించడానికి ముందు 15 మాసాల వ్యవధిలో ( జూలై 2013 – సెప్టెంబర్ 2014 ) వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ( ఎఫ్ డి ఐలు) 2,586 కోట్ల డాలర్లు ( రూ. 1,73,206 కోట్లు). భారత్ లో తయారీ మొదలైన అనంతరం 15 నెలల వ్యవధిలో ( అక్టోబర్ 2014 – డిసెంబర్ 2015) వచ్చిన ఎఫ్ డి ఐ లు 4,352 కోట్ల డాలర్లు ( రూ. 2,91,490 కోట్లు). భారత్ లో తయారీ పథకం ప్రారంభించిన స్వల్ప వ్యవధిలోనే ఎఫ్ డి ఐ ల పెరుగుదల 68.3 శాతంగా నమోదయింది. ప్రగతిదాయకమైన భారత దేశ నిర్మాణంలో ఉత్పాదక రంగం ప్రాధాన్యతను ప్రధాన మంత్రి గుర్తించి మేక్ ఇన్ ఇండియా పిలుపును ఇవ్వడంతో ఎఫ్ డి ఐలు పెరిగాయి. ఈ పెరుగుదల తయారీ, ఉత్పత్తి, ఉపాధి, వాణిజ్య, వ్యాపార రంగాల పై ప్రభావం చూపుతోంది. భారత్ లో తయారు చేయండని ప్రపంచ దేశాలను, పెట్టుబడిదారులను ఆహ్వానించడం పారిశ్రామిక, పెట్టుబడి రంగాల్లో కొత్త మలుపు. పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ సంస్థలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి నాంది పలికారు. దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు ఇదో అనుకూలమైన వాతావరణం. దాదాపు 125 కోట్ల జనాభా కలిగిన బలమైన భారతదేశం ఒక తయారీ కేంద్రంగా, ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి మెరుగైన అవకాశంగా భావించడం జరిగింది. వ్యాపారానికి ఇదో సదవకాశంగా పారిశ్రామిక వర్గాలు భావించడం జరుగుతుంది. రాయితీలు, సదుపాయాలను అందిపుచ్చుకుంటున్నాయి. ఉత్పాదక దిశగా అడుగులు వేస్తున్నాయి. ఔత్సాహిక భారత దేశంలో బలమైన రాజకీయ నాయకత్వం తోడ్పాటు ఉంటుందనే నమ్మకంతో తయారీ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి అసక్తి కనబరుస్తున్నాయి. ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ మాటల్లో, "అతిపెద్ద అవసరాన్ని భారత్ గుర్తించింది. పెట్టుబడులకు విశ్వాసం కలిగిస్తోంది. ప్రతి మలుపులో సందేహించారు. ఈ విషవలయం నుండి సానుకూల ఆలోచన దిశగా మార్చాలి. అపనమ్మకం నుండి బయట పడాలి, విశ్వసనీయత ప్రారంభం కావాలి ". "కొన్ని లోపాలను సరిచేయాలి ఆ దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఈ అద్భుతమ్కెన ప్రకటన 'భారతదేశం లో తయారు చేయండి' అనే నినాదానికి ఊతం ఇచ్చింది. "భారతదేశంలోని పెట్టుబడిదారుల్లో మార్పు సూచిస్తుంది. దేశ, విదేశీ పెట్టుబడులకు భారత్ ఈ కార్యక్రమంతో భరోసా ఇచ్చింది. ప్రాథమిక పెట్టుబడులు మొదలుకొని భారీ పెట్టుబడులకు హామీగా సానుకూల వాతావరణం నెలకొల్పింది. ఫలితంగా ఎఫ్ డి ఐలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ పరిణామం దేశాభివృద్ధిలో సానుకూల పరిణామంగా ఆర్థిక, పారిశ్రామిక వేత్తలు భావిస్తున్నారు. దేశ, విదేశీ దిగ్గజాలు మేక్ ఇండియాలో సగర్వంగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిని

కనబరుస్తున్నాయి. భారత్ నిజమైన వ్యాపార భాగస్వామిగా ప్రపంచ దిగ్గజాలు భావించడం జరుగుతుంది.. దేశంలోని వనరులను, అవకాశాలను అందిపుచ్చుకొని పెట్టుబడులు పెట్టడానికి, దేశంలో తయారీకి ఆసక్తిని కనబరుస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడిదారుల్లో మేక్ ఇన్ ఇండియా పథకం సానుకూల ప్రవర్తనకు, సరైన ఆలోచనకు దారి తీసింది. ఇదో అద్భుతమైన, ఆనందదాయకమైన, పెట్టుబడులకు భరోసాతో కూడిన నిజమైన వ్యాపార భాగస్వామిగా భారత్ ను గౌరవించడం జరుతుంది. మెరుగైన మేధో సంపత్తి, రక్షణ గోడ లాంటి ఎర్రకోట తమకు అండ అనే ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. సమర్థులైన యువత, తయారీకీ అనువైన వాతావరణం, సాంకేతిక నిపుణత, మేథోసంపత్తి ఉత్పాదక రంగానికి ఊతం ఇస్తుందని దేశ, విదేశీ తయారీ సంస్థలు భావించడం వల్లనే మేక్ ఇన్ ఇండియా పెట్టుబడిదారులను ఆకర్శించగలుగుతుంది. భారత్ లో తయారీ చేయండి, ఎక్కడైన విక్రయించండి, మీకు తోడ్పాటును ఇస్తాం అని భారత్ ఇచ్చిన పిలుపు మేరకు తయారీ ప్రపంచ తయారీ సంస్థలు ఇండియాలో తమ ఉత్పత్తుల విభాగాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. నైపుణ్యం, ప్రతిభ, క్రమశిక్షణ కలిగిన భారత్ లో విద్యుత్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, వాహనాల తయారీ, కాగితం, ప్లాస్టిక్, జలాంతర్గామి, ఉపగ్రహం లాంటివి తయారు చేయగల శక్తి భారత్ కు ఉందని గుర్తించి మేక్ ఇన్ ఇండియాకు ఆకర్షితులవుతున్నారు. భారత్‌లోని ప్రతి మూల మేక్ ఇన్ ఇండియాకు స్థావరం కావాలని కేంద్ర ప్రభుత్వం భావించి దేశంలో తయారీకి ఊతమివ్వడం జరుగుతుంది. తయారీ రంగంలో ఏటా 12 నుండి 14 శాతం వృద్ధిని భారత్ ఆశించింది. తయారీ రంగంలో వృద్ధిని దశల వారిగా 16 నుండి 25 శాతం వరకు పెంచడం ద్వారా 2022 నాటికి ఈ రంగంలో 100 మిలియన్ అదనపు ఉద్యోగాలు కల్పించడం కోసం చర్యలు తీసుకుంటుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యం ఏడాదికి 12-14% ఉత్పాదక రంగం వృద్ధి పెరుగుదల. తయారీ వాటా 2022 నాటికి 25% 16% దేశ స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల కనిపిస్తుంది. తయారీ రంగం 2022 నాటికి 100 మిలియన్ అదనపు ఉద్యోగాలు సృష్టించడానికి. తగిన నైపుణ్యం సృష్టి, గ్రామీణ వలసల నివారణ, సమగ్ర వృద్ధిని పేదలకు చేరువ చేయడం. దేశీయ విలువ అదనంగా పెంచడం, తయారీ సాంకేతికతను పెంచడం. భారత తయారీ రంగం ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరుచుకోవడం. జీవనాధారమునకు భరోసా కల్పించడం. భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా తన ఉనికిని గుర్తించారు. ప్రపంచంలోనే మొదటి మూడు పెరుగుదల ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని భావించడం జరిగింది. తదుపరి రెండు మూడు జనాభా వృద్ధిలో సానుకూలత. శ్రామిక నిలకడ భారత్ సొంతం అని నిర్ధారణ జరిగింది. ఉద్యోగుల వ్యయం ఇతర దేశాలతో పోలిస్తే సాపేక్షంగా తక్కువ. బాధ్యతాయుత వ్యాపార సముదాయాలు, విశ్వసనీయత, నైపుణ్యానికి నిలువెత్తు సాక్షాలుగా పెట్టుబడిదారులు భావించడం జరుగుతుంది. దేశీయ మార్కెట్లో బలమైన వినిమయతత్వం వారిని ఆకట్టుకుంటుంది. బలమైన సాంకేతిక, ఇంజనీరింగ్ సామర్థ్యాలు ఆకర్షనీయ పరిణామాలుగా భావించడం జరుగుతుంది. బాగా నియంత్రిత, విదేశీ పెట్టుబడిదారులకు స్థిరమైన ఆర్థిక మార్కెట్లు మరో అనువైన పరిణామంగా పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరళీకరణ విధానాలతో తయారీ రంగానికి ప్రోత్సాహకాలు, పథకాలు, పరపతి కలిగించడం జరుతుంది. ఒక సాంకేతిక సముపార్జన, అభివృద్ధి ఫండ్ ప్రతిపాదించడం, తగిన సాంకేతిక కొనుగోలు, ఒక పేటెంట్ పూల్ సృష్టి, కాలుష్య, శక్తి వినియోగాన్ని తగ్గించేందుకు ఉపయోగించే పరికరాలు దేశీయంగా తయారీ, అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుంది. కేంద్రం కొత్తగా 2000 శిక్షణా కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం కావటం జరిగింది. ప్రభుత్వం మొదటి రెండు సంవత్సరాలలో 2017 చివరి నాటికి సంవత్సరానికి సుమారు 3 లక్షల యువతకు శిక్షణ ప్రతిపాదించింది, ఇది 10 లక్షల గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం వరకు కొనసాగుతుంది..





# పల్లె సీమలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు

పల్లె అభివృద్ధి రాగం పల్లవిస్తోంది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తూ,పథకాలు ప్రవేశపెడుతూ అహర్నిశలు కృషి చేస్తున్నాయి.దేశ గ్రామీణ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి గ్రామీణాభివృద్ధి శాఖ వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. పేదరిక నిర్మూలన,జీవనాధార అవకాశాలు పెంపొందించడం,సామాజిక భద్రత,మౌళిక వసతుల కల్పన,విద్య,ఆరోగ్య సేవలు,అందరికీ ఇళ్ళు వంటి లక్ష్యాలతో గ్రామీణ భారతాన్ని ప్రగతి బాట పట్టించే దిశగా సాగుతోంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు వెళ్దాం అన్న నినాదంతో అధికారులను గ్రామాల బాట పట్టించి గ్రామపంచాయతీలు,గ్రామ ప్రధాన కూడళ్ళు కేంద్రాలుగా అభివృద్ధిపై గ్రామాల్లో ప్రజలతో అధికారులు,ప్రజాప్రతినిధులు చర్చించి గ్రామాల ఆధునీకరణకు బంగారు బాటలు వేస్తున్నారు. వర్ధమాన దేశాల్లో 75 శాతం పేదలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు.2020 నాటికి గ్రామీణ పేదరికం 60 శాతానికి తగ్గుతుందని అంచనా.ప్రపంచంలోనే అత్యధిక గ్రామీణ జనాభా ఉన్న దేశంగా భారత్ కీర్తి గడించింది.ఇలా పెద్ద ఎత్తున గ్రామీణ జనాభాలో 64 శాతం మంది వ్యవసాయం పైననే ఆధారపడి జీవిస్తున్నారు.భారత దేశ ఆత్మ అంతా గ్రామాల్లోనే ముడిపడి ఉన్నది. కేంద్ర ప్రభుత్వము గ్రామీణ ప్రగతికి బాటలు వేస్తూ గ్రామీణ ఉపాధి హామీ పథకము,గ్రామీణ జీవనాధార కార్యక్రమము,దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన,కృషి సించాయి యోజన,సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన,ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన,గ్రామ సమూహాల్లో పట్టణ స్థాయి సదుపాయాల కల్పనకు రూర్బన్ మిషన్ వంటి పథకాలు ప్రారంభించి గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం సైతం గ్రామజ్యోతి పథకము అమలుతో గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణాభివృద్దే ధ్యేయంగా ముందుకుసాగుతున్నది.గ్రామాల్లో మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్దరణ కార్యక్రమము దిగ్విజయముగా ముందుకు సాగుతూ గ్రామాల్లో వ్యవసాయరంగానికి,త్రాగునీటికి మరియు జలసంరక్షణ ద్వారా గ్రామాల్లోనే భూగర్భజలాలను పెంపొందించడము లాంటి పల్లెముఖ చిత్రాన్ని మార్చే బహుళ ప్రయోజనాలు కలిగిన చెరువుల పునరుద్దరణ అప్రతిహతంగా కొనసాగుతున్నది. అంతే కాకుండా వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మంచినీరు అందించాలని గట్టి పట్టుదలతో మిషన్ భగీరథను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకు సాగుతూ లక్ష్యం దిశగా పయనింపచేస్తూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది.

దేశంలో ప్రస్తుతం 2,48,255 గ్రామపంచాయతీలు,6,618 మధ్యస్థ పంచాయతీలు,618 జిల్లాపంచాయతీలు ఉన్నాయి. తాజా నివేదికల ప్రకారం దేశంలో 27,75,858 గ్రామపంచాయతీ సభ్యులు,1,44,491 మధ్యస్థ(మండలాలు,సమితులు)పంచాయతీ సభ్యులు,15,067 జిల్లా పంచాయతీ సభ్యులుఉన్నారు.దేశంలో ఎన్నికైన సుమారు 29.17 లక్షల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యము పరిణతికి అద్దం పడుతున్నాయి.ఇంత విస్తృతమైన జనాభా దేశంలోని అట్టడుగు స్థాయిలో ఉండే స్థానికసంస్థల భాగస్వామ్యముతో ముందుకుసాగుతుండడం దేశ పంచాయతీరాజ్ వ్యవస్థ గొప్పతనానికి నిదర్శనం.దేశంలో సామాజిక న్యాయం నెలకొల్పడానికి,సాధికారతను సాధించడానికి పంచాయతీ రాజ్‌వ్యవస్థలే ప్రాతిపదిక. ఆ దిశగా పంచాయతీరాజ్ వ్యవస్థలు దేశంలో,రాష్ట్రంలో ముందుకుసాగుతూ బలమైన పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్మాణం చేస్తూ

దేశ పల్లెసీమలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు అని భావించి దేశాభివృద్ధికి కృషి చేస్తున్నాయి.దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలన సంస్థలను బలోపేతం చేస్తేనే సామాజిక న్యాయం,సాధికారత దిశగా గ్రామాలు పయనిస్తాయి.గ్రామములో ఉన్నటువంటి గ్రామపంచాయతీలను బలోపేతం చేయాలి.రాజ్యాంగబద్ధంగా సంక్రమించాల్సిన 29 అంశాలను గ్రామపంచాయతీలకు బదలాయించి గ్రామాల అభివృద్ధికి సమగ్రప్రణాళికలు స్వతస్సిద్ధంగా రూపొందించే విధంగా గ్రామపంచాయతీలను సంసిద్ధం చేయాలి.అప్పుడే అట్టడుగున ఉన్న గ్రామ ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి,అమలు పరిచే గ్రామీణాభివృద్ధి ఫలాలు ప్రతీ లబ్దిదారునికి చేరి సామాజిక న్యాయం పెంపొందించబడుతూ గ్రామాలు సాధికరతదిశగా ముందడుగు వేస్తాయి.గ్రామపంచాయతీలు నిధులలేమితో కొట్టుమిట్టాడుతూ స్వయంపాలన దిశగా ప్రకాశించక కుంగుబాటుకు గురిఅవుతున్న విధానాన్నిసమీక్షించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలతో పాటు ఆర్థికతోడ్పాటును అందిస్తున్నాయి.కేంద్రఆర్థిక సంఘము నిధులతో పాటు,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థికసంఘము నిధులు మరియు ఇతర గ్రామీణాభివృద్ధి కేటాయింపులు గ్రామపంచాయతీలకు పెద్ద దిక్కుగా ఆసరా అవుతున్నాయి.గ్రామపంచాయతీలకు 14వ ఆర్థికసంఘము నిధులకు ఇతోధికంగా తోడ్పడుతూ గ్రామపంచాయతీల యందు కీలకమైన మంచినీటి సరఫరా,పారిశుధ్యము,వీధిదీపముల నిర్వహణల యందు మెరుగైన పనితీరును కనబరుచుచూ గ్రామాలు అభివృద్ధి దిశలో పయనింపచేస్తున్నాయి.ఇలా పంచాయతీరాజ్ వ్యవస్థలో అట్టడుగున ఉన్నటువంటి గ్రామసీమలకు ఆర్థికతోడ్పాటును సైతం అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలనందిస్తూ స్వయంపాలన దిశగా కదులుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధికి అధికంగా బడ్జెట్ కేటాయింపులు చేసి గ్రామాల అభ్యున్నతే ధ్యేయంగా చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వము 2016-17 బడ్జెట్‌లో 87,765 కోట్లు కేటాయించి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. దేశంలో 660 జిల్లా ల్లో 2,57,718 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకము అమలవుతున్నది.సుమారు 13.14 కోట్లు జాబ్ కార్డులుండగా 27.63 కోట్ల కూలీలు నమోదయి ఉన్నారు. గ్రామీణుల్లో ఉపాధికి ధీమా కల్పించిన ప్రభుత్వం రోజువారీకూలీని సైతం రూ.174 కు పెంచారు.గ్రామాల్లోని నైపుణ్యంలేని కార్మికులకు పని కల్పించి,వలసలకు అడ్డుకట్ట వేసి గ్రామాల్లోనే పని కల్పించడము ద్వారా గ్రామీణాభివృద్ధికి బంగారుబాటలు వేయాలని ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సైతం అధిక నిధులు కేటాయించింది.ప్రస్తుత బడ్జెట్‌లో 38,500 కోట్లు కేటాయించి,పల్లెల్లో పనికల్పించడం ద్వారా ఆస్తులను సృష్టించి శాశ్వత ఉపాధి మార్గాలు కల్పించి ప్రజలను అభివృద్ధి పథంలో పయనింపచేసేలా సమాయత్తం చేస్తున్నది. పొట్టకూటి కోసం వలస పోతున్న పల్లె జనానికి భరోసానిచ్చేలా ఉపాధిహామీపథకానికి నిధులు కేటాయించిన ప్రభుత్వం సమూహ సౌకర్యాల బృందాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రకృతి, జల సంరక్షణను పెంపొందిస్తారు. జీవనోపాధిని పెంచడంలో భాగంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకంకింద 300సమూహాలను ఎంపిక చేసి మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు మార్కెట్ వసతి కల్పిస్తారు. తద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుకానున్నాయి. గ్రామీణాభివృద్ధికి గాను ప్రధానమంత్రి కృషి సించాయి యోజన ద్వారా కరువు పీడిత ప్రాంతాలకు ప్రాదాన్యతనిచ్చి వ్యవసాయ సాగుకావలసిన సాగునీటి అవసరాలను పెంపొందించి,వ్యవసాయరంగ అభివృద్ధికి తోడ్పడం ద్వారా గ్రామీణ వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయనున్నారు.ఇలా పలు పథకాలు ప్రవేశపెట్టి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామసీమలను సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనింపచేయనున్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు గ్రామస్థాయిలో సమన్వయం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడం, అర్హులైన లబ్దిదారులను గుర్తించి,పథకము సదుద్దేశమును నెరవేర్చడం లాంటి కీలక అమలులో గల స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తేనే పథకాల లక్ష్యము నెరవేరుతుంది.అందుకు గాను గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి 14వ ఆర్థిక సంఘముసిఫార్సులు చేసిన విధంగా 2015-2020 మధ్య కాలములో నేరుగా రూ. 2,00,292.20 కోట్ల నిధులు రానున్నాయి.ఇప్పటికే 14వ ఆర్థికసంఘం నిధులు రాకతో గ్రామపంచాయతీల్లో రక్షితమంచినీటిసరఫరాలాంటి తదితర ప్రజాసౌకర్యాల కల్పనలో గ్రామపంచాయతీల పనితీరు మెరుగునపడుతున్నది.ఒక్కో గ్రామపంచాయతీకి సగటున ఏటా రూ. 17 లక్షల నిధులు చేరడంతో గ్రామపంచాయతీలు మరింత ఆర్థిక స్వావలంబనను చేకూర్చుకుంటుంది.అంతేకాకుండా 14వ ఆర్థిక సంఘం నిదుల యందు తమ పనితీరును మెరుగుపరుచుకున్న గ్రామపంచాయతీలకు ప్రోత్సాహక గ్రాంటును కూడా ఇస్తున్నారు.తద్వారా గ్రామపంచాయతీలు తమ ఆర్థిక వనరులను మెరుగుపరుచుకుని ఆర్థిక సాధికారతను సాధించి మనుగడను కొనసాగించనున్నాయి.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి ప్రత్యక్షంగా నిధులు కేటాయించి తామే అమలుపరుస్తూ,మరో పక్క నిధులు కేటాయించి తమ పనితీరును తామే ప్రజల ఆకాంక్షలు, అవసరాలు మేరకు కొనసాగించి స్థానిక స్వపరిపాలనను మరింతగా పెంపొందింపజేయనున్నాయి.అంతే కాకుండా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి అపరిశుభ్రతను పారద్రోలి స్వచ్ఛభారత్ సాకారం దిశగా దేశాన్ని పయనింపచేయాలని భావించిన ప్రభుత్వం వేలాదిగా మరుగుదొడ్ల నిర్మాణంతోపల్లెలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలను తీర్చిదిద్దుతున్నారు.గడిచిన రెండేళ్ళలో 85 వేల గ్రామాలు,141 నగరాలను బహిరంగ మలవిసర్జన నుండి విముక్తి చేసి పారిశుద్య నిర్వహణను మెరుగుపరచడం జరిగింది. స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించినప్పటినుండి సుమారుగా గ్రామీణ ప్రాంతాల్లో 2 కోట్ల మరుగుదొడ్లు నిర్మించి ఉద్యమ రూపాన్ని సంతరించుకున్నది. దేశంలో సంపూర్ణ పారిశుధ్యం దిశగా పలు పథకాలు ప్రవేశపెట్టినారు.కానీ నేడది ఉద్యమంగా మారి, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ స్వచ్ఛభారత్ సాకారం క్రతువులో భాగస్వాములను చేస్తూ వడివడిగా అడుగులు

పడుతున్నాయి.ప్రజాభాగస్వామ్యం లేనిదే ఏ పథకం కూడా ఖచ్చితమైన ఫలితాలను సాధించలేదు.కానీ స్వచ్ఛభారత్ సాక్షాత్కరింపజేయడానికి విస్తృత ప్రచారం గావించి,లక్ష్యాలవారీ ప్రణాళికలు రూపొందించి ప్రజా సమూహాలను,అధికారులను,అనధికారులను భాగస్వాములను చేసి,గ్రామీణుల్లో పరివర్తనను పెంపొందించి సంపూర్ణ పారిశుధ్యమునకు బంగారు బాటలు పడుతున్నాయి.చత్తీస్‌ఘడ్‌లోని ధమ్‌తరీ జిల్లా కోటభర్రీ గ్రామానికి చెందిన 104 ఏళ్ళ కున్వర్‌బాయి మరుగుదొడ్డి కట్టుకోవడానికి తన మేకలను అమ్ముకుని మరుగుదొడ్డినిర్మించుకుని స్ఫూర్తిని నింపింది.కొలారస్ బ్లాకు గోపాల్‌పురా గ్రామానికి చెందిన ప్రియాంకా అనే ఆదివాసీ మహిళ అత్తగారింట్లో మరుగుదొడ్డి లేకపోవడంతో తల్లిగారింటికి తిరిగి వచ్చి, మరుగుదొడ్డి నిర్మిస్తేనే అత్తగారింటికి వస్తానని భీష్మించుకుని కూర్చున్నది. మహారాష్ట్రలోని వాశిమ్ జిల్లా సాయిఖేడా గ్రామానికి చెందిన సంగీతా అధవలే మరుగుదొడ్డి కోసం తన మంగళ సూత్రాన్ని అమ్మి, నిర్మాణం చేసుకున్నది.ఇలా దేశంలో జరుగుతున్న పలు సంఘటనలు మరుగుదొడ్డి నిర్మాణం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రారద్రోలి తామునిర్మించుకుంటూ మరెందరికో స్ఫూర్తినిస్తూ మహాయజ్ఞానికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు.మరుగుదొడ్డి నిర్మాణం పట్ల తమ అవసరాలు సౌకర్యవంతముగా,సుఖవంతముగా మారడమే కాకుండాభద్రతను పెంపొందించి ఆరోగ్యవంతమైన సమాజం దిశగా గ్రామాలు అభివృద్ధిపథంలో ముందుకుసాగుతున్నాయి.పారిశుద్య ఉద్యమం ప్రజా ఉద్యమ స్థాయిని సంతరించుకుని స్వచ్ఛభారత్ స్వప్నం సాకారం దిశగా చేరే రోజులు సమీపంలోనే ఉన్నాయని,ఆధునిక ఆరోగ్యవంతమైన,సంపూర్ణ పారిశుధ్యవంతమైన గ్రామాలుగా భారత్ దేశం అవతరించి నరేంద్రమోదీ ఆశించిన విధంగా 2019 నాటికి స్వచ్ఛభారత్ సాధించే విధంగా గ్రామాలు వడివడిగా అడుగులు వేస్తూ అచ్చేదిన్ దిశగా అడుగులు పడుతున్నాయి.

పల్లెల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించాలని భావించిన ప్రభుత్వము డిజిటల్ ఇండియా స్థాపనకు అంకురార్పణ చేసింది.దేశంలో 16.8 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో 12 కోట్ల కుటుంబాలకు కంప్యూటర్లు లేవు.డిజిటల్ అక్షరాస్యులు లేరు.డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించేందుకు జాతీయ డిజిటల్ అక్షరాస్యత మిషన్,డిజిటల్ సాక్షరత అభియాన్‌ల పేరిట ప్రభుత్వం రెండు పథకాలను అమలు చేస్తున్నది.గ్రామీణ బారత్ కోసం డిజిటల్ అక్షరాస్యత పథకమును ప్రారంభించి వచ్చే మూడేళ్ళలో 6 కోట్లకుటుంబాలను డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది.డిజిటల్ ఇండియా కార్యక్రమం క్రింద జాతీయ భూమి రికార్డు ఆధునికీకరణ కార్యక్రమాన్ని ప్రక్షాళన చేసి కేంద్రరంగ పథకముగా అమలు చేస్తున్నారు.ఇలా గ్రామీణభారతాన్ని డిజిటల్‌మయంగా చేయాలని భావించిన ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతముగా అమలు చేస్తున్నది.నగదు రహిత సమాజం దిశగా ఓ వైపు అడుగులు పడి డిజిటల్ అక్షరాస్యులుగా తయారుకావాల్సిన తరుణంలో డిజిటల్ అక్షరాస్యత అత్యంత ఆవశ్యకము.దేశంలో గ్రామాలు,పట్టణాలు ఒకటేమిటి వ్యవస్థ అంతా నగదురహిత సమాజం ఆవిష్కరణ దిశగా ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజల మద్దతు ఎంతో అవసరం.ఆధునిక సమాజంలో అంతర్జాలము అనుసంధానము చేసి ప్రపంచీకరణ యవనికపై ఎక్కడి నుండైనా సమాచార మార్పిడి జరిగే అవకాశాలు ఆవిష్కృతమవుతున్న వేళ డిజిటల్ గ్రామాలు ఆవశ్యకము ఎంతైనా కలదు.పౌరుల బాధ్యత ఓటు వేయడంతోనే పూర్తవుతుందని అనుకోవడం అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదు.వారు పరిపాలనలో నిరంతరం పాలుపంచుకొనేలా ప్రోత్సహించాలి.ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యంతోనే జాతి నిర్మాణం, అభివృద్ధి సాధ్యపడతాయి అని ప్రధాని అభిప్రాయపడ్డట్లుగా ప్రజాస్వామ్య దేశంలోని ప్రభుత్వాలు,పరిపాలన,పథకాలు సమర్ధవంతముగా అమలు కావాలంటే ప్రజాభాగస్వామ్యం తప్పనిసరి అప్పుడే ప్రజాస్వామ్య సౌధాలు ప్రజల ఆశలు, ఆశయాలకు, అకాంక్షలకు అద్దంపడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఏ పథకము అయినా ఆయా ప్రాంతాల,గ్రామాల ప్రజల భాగస్వామ్యంపైననే ఆధారపడి సఫలీకృతమవుతాయి.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న వివిధ గ్రామీణ అభివృద్ధి పథకములు గ్రామీణ భారతాన్ని ఆధునిక భారత్ తీర్చిదిద్దేవిధంగా కృషిచేస్తున్నాయి. పేదరికంలేని భారత్ సమాజాన్ని చూసే రోజుల అతి దగ్గరలోనే ఉన్నాయనడంలో ఎలాంటి సంశయము లేదు.దేశ నిర్మాణంలో అట్టడుగు భాగాన ఉన్న పల్లె సీమల అభివృద్ధితోనే దేశ అభివృద్ధిఆధారపడి ఉన్నది.పల్లె సీమలే దేశ అభివృద్ధికి పట్టుగొమ్మలుగా నిలిచి ఆధునికభారత్‌గా అవతరిస్తుంది.

**– జూపల్లి హరిప్రసాద్,**

**బాలసముద్రము, హన్మకొండ, జి.వరంగల్**



# స్వచ్ఛతపై అవగాహన, ఆచరణే ముఖ్యం

**పారిశుధ్య నిర్వహణలో అవగాహన అనేది చాలా ముఖ్యం. అవగాహన ఇంటి నుంచి మొదలు కావాలి. ఇంటిలో నుంచి చెత్తను బయట పడేసే అలవాటును మానిపించేలా చైతన్యం పెంచాలి. గత ఆగస్టులో కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో నాలాలు పూడుకుపోయి, వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇది అవగాహన రాహిత్యంతో జరిగిన పరిణామమే. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో ఏర్పడిన ముప్పే.**

స్వచ్ఛభారత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలలో దేశంలోని 500 నగరాలల్లో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచిందని కేంద్ర పట్టాణాభివృద్ధి శాఖ ప్రకటించింది. మొదటి స్థానాన్ని ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్, రెండో స్థానాన్ని మహారాష్ట్రలోని వసాయ్ విరార్ దక్కించుకున్నాయి. ఏడో స్థానంలో తిరుపతి నిలిచింది. ప్రధాని మోదీ గాంధీ జయంతి సందర్భంగా 2014 అక్టోబర్ 2 స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి 2019 (గాంధీ 150వ జయంతి) నాటికి స్వచ్ఛమైన నగరాలను, గ్రామాలను అభివృద్ధి చేయాలని, అదే మహాత్మునికి మనమిచ్చే నివాళి అని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ ఉద్దేశాలలో బహిరంగ ప్రదేశాలలో మల విసర్జనను నిర్మూలించడం, మాన్యువల్ స్కావెంజర్స్‌ను నిర్మూలించడం, ఘన వ్యర్థ పదార్థాలను శాస్త్రీయంగా డిస్పోజ్ చేయడం లాంటి వి ఉన్నాయి. అంతేగాక స్వచ్ఛతపై ప్రజల లో ప్రవర్తనలో మార్పు తీసుకురావడం ఉన్నది. స్వచ్ఛభారత్ కార్యక్రమాలకు 62,009 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయగా అందులో సుమారు 15 శాతం ప్రజలకు అవగాహన కల్పించడానికి (ఇన్‌ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్)కు కేటాయించారు. దీనికి అన్ని సామాజిక మాధ్యమాలను, రేడియోను ఉపయోగించుకుని మన్‌కీ బాత్ కార్యక్రమంతో ప్రచారం చేస్తున్నారు. చివరికి ఈ మధ్య విడుదలై న కొత్త 2000 రూపాయల నోటుపై కూడా స్వచ్ఛభారత్ చిహ్నాన్ని వేయించకుండా వదలలేదు.

దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 53.1శాతం ప్రజలకు మరు గుదొడ్లు లేవు. పట్టణాలలోని మురికివాడల్లో, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలు బహిరంగ ప్రదేశాలు వాడుతున్నారు. ఇకపోతే సామాజిక, ప్రజా మరుగుదొడ్ల మాట అంతంత మాత్రమే.

పారిశుధ్యానికి, ప్రజారోగ్యానికి, పేదరికానికి అవినాభావ సంబంధం ఉన్నది. నగరాలలో, గ్రామాలలో సరైన పరిసరాల పరిశుభ్రత, పారిశు ధ్యం సరిగా లేక ప్రజలు వివిధ వ్యాధులకు గురవుతున్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు భరించలేక తిరిగి పేదరికంలోకి నెట్టి వేయబడుతున్నారు. ఏటా దేశంలో సుమారు 19 వేల కోట్ల రూపాయలు ప్రజారోగ్యానికి జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఖర్చవుతున్నది. దీంతో దేశ జీడీపీ నుం చి సుమారు ఆరు శాతం నష్టపోవలసి వస్తున్నది. ఈ నష్టాన్ని అవగాహనా మంత్రంతోనే పూరించగలమని మోదీ భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇటువంటి కార్యక్రమాలకు రాజకీయ సంకల్పం ఉన్నప్పుడే సత్ఫాలితాలిస్తాయని రుజువుచేస్తున్నారు. అవగాహన ద్వారా దేశంలో ఎన్నో కార్యక్రమాలలో సత్ఫాలితాలు సాధించాం. పల్స్ పోలియో, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్ నివారణ వంటి వాటిలో అవగాహన ద్వారా చాలావరకు నియంత్రించగలిగాం.



స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల సమావేశంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛతెలంగాణపై అవగాహన కలిగించారు. స్వచ్ఛతపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలతో మంచి ఫలితాలు వస్తునాయనే చెప్పాలి. విద్యార్థులతో స్వచ్ఛతపై తెలంగాణ, పారిశుధ్యం, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే విధంగా గోడలపై చిత్రాలు వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో పారిశుధ్యం చాలా బాగుందని, అక్కడి వారు తమ పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటారని మనం చెప్పుకుంటాం. మనం విదేశాల్లో పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి వారివలె ప్రవర్తిస్తాం. చిన్న చిత్తు కాగితం, చాక్లెట్ల కవర్లను కూడా వీధుల్లో రోడ్డుపై వేయడానికి సాహసించం. తిరిగి ఇండియా రాగానే షరామామూలే. రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండాలంటే ప్రతి ఒక్కరిలో అవగాహన, ప్రవర్తనలో మార్పురావాలి. అప్పుడే సచ్ఛభారత్ ఆవిష్కృతం అవుతుంది.

పారిశుధ్య నిర్వహణలో అవగాహన అనేది చాలా ముఖ్యం. అవగాహన ఇంటి నుంచి మొదలు కావాలి. ఇంటిలో నుంచి చెత్తను బయట పడేసే అలవాటును మానిపించేలా చైతన్యం పెంచాలి. గత ఆగస్టులో కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో నాలాలు పూడుకుపోయి, వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బంది లు పడ్డారు. ఇది అవగాహనా రాహిత్యంతో జరిగిన పరిణామమే. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో ఏర్పడిన ముప్పే. అందరూ మున్సిపాల్టీలు అందించిన డబ్బాలలో మాత్రమే చెత్తను వేయాలి. ప్రజలలో అవగాహన మాత్రమే కాదు ప్రవర్తనలో మార్పు రావాలి. అవగాహనను పెంచడానికి వివిధ రకాల మాధ్యమాలైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను వాడుకోవాలి. ఆధునిక సాంకేతికతను జోడించి ఫేస్‌బుక్, ట్విటర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రతి నగరానికి ఒక సెలబ్రిటీని బ్రాండ్ అం బాసిడర్‌గా నియమించాలి. ప్రచారంలో ప్రజలందరిని మమేకం చేయాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన తరగతులను నిర్వహించాలి. అవగాహనను పెంపొందించేందుకు ఇటు ప్రభుత్వంతో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి కృషి చేయాలి.

ప్రొఫెసర్ వై.పార్థసారథి

# ఇంధన సంరక్షణే దేశాభివృద్ధికి మూలం

నానాటికి తరగిపోతున్న సహజ ప్రకృతి సిద్ధ ఇంధన వనరుల వల్ల ఏర్పడుతున్న కొరతను అధిగమించాలంటే పెద్దఎతుంతర ఇంధన సంరక్షణకు చర్యలు చేపట్టడంతప్ప వేరొకమార్గంలేదు. దేశ ఆర్థికాభివృద్ధిపై ఇంధన వినియోగం అత్యంత ప్రభావం చూపుతుందనటంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. ఇటువంటి సందర్భంలో సమర్థ ఇంధన వినియోగం ఇంధన సంరక్షణపై అందరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక్క యూనిట్ ఇంధన వినియోగాన్ని తగ్గించగలిగితే రెండున్నర రెట్లు ఇంధనాన్ని కొత్తగా ఉత్పత్తి చేసినట్లే సమర్థవంతమైన ఇంధన వినియోగం ద్వారా కొత్తగా ఇంధన ఉత్పత్తికయ్యే వ్యయాన్ని ఐదురేట్లకు తగ్గించవచ్చు. ఇంధన వినియోగం, డిమాండ్ల మధ్య ఉన్న అంతరాల్ని సమర్థవంతంగా పూడ్చగలిగితే ప్రతి ఏడాది 25 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఆదా చేయగలుగుతాం. నానాటికి తరిగిపోతున్న సహజ ఇంధన వనరులు దేశీయ పారిశ్రామిక ఉత్పత్తిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. మన దేశంలో లభ్యమౌతున్న బొగ్గునిల్వలు మరో 200 సంవత్సరాల వరకు లభ్యమవుతాయి. సహజవాయు, చమురు నిల్వలు మరో 25 సంవత్సరాలు మాత్రమే మనకు అందుబాటులో ఉంటాయి. ఇంధనాన్ని ఎక్కువగా వినియోగిస్తున్న రంగాలలో పరిశ్రమలు 49 శాతం, రవాణా 22 శాతం, గృహావసరాలు 10 శాతం,వ్యవసాయం ఐదు శాతం, ఇతరత్రా 14 శాతం మేర ఉన్నాయి. దీని వల్ల ప్రతి ఏడాది పెద్దఎత్తున చమురు సహాజవాయువులను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇక పెరుగుతున్న డిమాండ్, తగ్గుతున్న ఉత్పత్తుల మధ్య వ్యత్యాసాన్ని విద్యుదుత్పత్తి సంస్థలు ఏ మాత్రం తగ్గించలేకపోతున్నాయి. పదకొండవ పంచవర్ష ప్రణాళిక చివర్లో ఈ అంతరం 10 వేల మెగావాట్లుగా నమోదయ్యింది. 2011లో పరిశ్రమలకు తగినంత విద్యుచ్ఛక్తిని అందించలేకపోవటం వల్ల 10 బిలియన్ల డాలర్ల విలువైన దేశీయ ఉత్పత్తిని నష్టపోయాం. 12వ పంచవర్ష ప్రణాళికా కాలానికి (2012- 17) 46,645 మెగావాట్ల అదనపు విద్యుచ్ఛక్తి అవసరాన్ని అంచనావేశారు. దీనిని సాధించాలంటే రూ. 12,26,000 కోట్లు అవసరామవుతాయి. ఈ అదనపు సామర్థ్యాన్ని సాధించినా 2017 నాటికి 15 శాతం కొరత మిగిలే ఉంటుంది. దీనికి కారణం పెరుగుతున్న సాంకేతిక అవసరాల ఇంధన వినియోగం.



అమెరికా, జపాన్లతో పోలిస్తే మన దేశంలో ఇంధన తీవ్రత 1.5 రెట్లు అధికంగా ఉంది. అభివద్ధి చెంది దేశాల్లో ఒక శాతం జిడిపి వృద్ధికి 0.6 శాతం ఇంధన వినియోగం అవసరం. అదే మనదేశంలో ఇది 1.5 శాతం. ఆసియా దేశాలతో పోల్చినప్పుడు కూడా 1.5 రెట్ల వినియోగం దేశానికి అవసరం. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న వాణిజ్య సరళీకరణ వల్ల వాణిజ్య, వ్యాపార రంగాల్లో తీవ్ర పోటీ నెలకొంటోంది. ఈ పోటీని తట్టుకుని నిలబడాలంటే అతి తక్కువ ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి దృష్టాంతాలలో ఇంధన సంరక్షణ విధానంలో సమగ్రమైన మార్పులు, చట్టాల రూపకల్పన అవసరం ఎంతైనా ఉంది. విద్యుత్ ప్రసార, పంపిణీ వ్యవస్థల్లో లోపాల వల్ల 20 శాతం నష్టాలను ప్రతి ఏటా విద్యుత్ సంస్థలు భరించాల్సివస్తోంది. (కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థలెక్కలు) హైవోల్టేజి/లో వోల్టేజీలకు ఒకే రకమైన పంపిణీ వ్యవస్థను హైవోల్టేజి పంపిణీ వ్యవస్థ, లోవోల్టేజి పంపిణీ వ్యవస్థ కింద రెండుగా విభజించగలిగితే ఈ నష్టాలను 10 శాతానికి తగ్గించవచ్చు. నాణ్యమైన విద్యుతుత్పత్తిని ( విద్యుత్ శక్తి కారకాన్ని పెంచడం వల్ల ) చేయడం వల్ల విద్యుత్ డిమాండ్‌ను తగ్గించవచ్చు. పరిశ్రమల్లో ఉపయోగించే ఇండక్షన్ మోటార్ల వల్లే 80 శాతం విద్యుత్ వినియోగం జరుగుతోంది. పరిశ్రమల్లో లోడ్‌ఫాక్టర్ని అభివృద్ధి చేస్తే పరిశ్రమలు అత్యధిక సామర్థ్యంతో పనిచేయడమే కాకుండా

అధికోత్పత్తి సాధిస్తాయి. జాతీయ ఇంధన సమర్థ వినియోగమిషన్ 2015 నాటికి ఇంధన వినియోగాన్ని ఐదు శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతోంది. 2015 నాటికి ఎనిమిది రంగాల్లోని 476 పరిశ్రమలకు లక్ష్యాలను నిర్దేశించగా 0.686 మిలియన్ టన్నుల చమురు సమానమైన ఇంధన వినియోగాన్ని సాధించగలిగాయి. ఇంధన సంరక్షణ చర్యల్లో భాగంగా ప్రతి ఏడాది పరిశ్రమలు ఇంధన సంరక్షణ చర్యల్లో భాగంగా ప్రతి ఏడాది పరిశ్రమలు ఇంధన లెక్కలు (ఆడిటింగ్) సరిచూసుకోవడం వల్ల వృథమవుతున్న ఇంధన వనరులకు అడ్డుకట్ట వేయవచ్చు. ఇంధన వినియోగ సర్వేల వల్ల ఆడిటింగ్‌ల వల్ల వృథమవుతున్న ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా సిమెంటు, ఇనుము, స్టీల్ , ఎరువల కర్మాగారాల్లో 10-15 శాతం ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోగలిగాయి. వస్త్ర పరిశ్రమలు ఇంధన వినియోగ తీవ్రతను 20-25 శాతానికి తగ్గించుకోగలిగాయి. వ్యవసాయానికి మనదేశంలో విద్యుత్/చమురు ఆదారిత పంపుసెట్లు 20 మిలియన్ల పై చిలుకే. వీటికి ఆరు బిలియన్ల చమురు అవసరమవుతుండగా 30 బిలియన్ల కిలోవాట్ అవర్ల విద్యుత్ అవసరమవుతన్న చమురు సహజవాయువుల్లో 60 శాతం మాత్రమే దేశీయంగా ఉత్పత్తి చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది 14 శాతం విద్యుత్ వినియోగం 10 శాతం చమురు ఉత్పత్తుల వినియోగం పెరుగుతోంది. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవాలంటే వ్యవసాయ, గృహ అవసరాలకు అత్యధిక ఇంధన సామర్థ్యం గల యంత్రాలు, పరికరాలను వినియోగించటమెక్కటే మార్గం.

గృహవసరాలకు ఉపయోగించే సంప్రదాయ బల్బులు స్థానంలో ఎల్ఇడి బల్బులు ఉపయోగించడం వల్ల అత్యధికంగా విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. 770 మిలియన్ల ఇన్‌కాండిసెంట్ బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేయడం వల్ల 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. 2017-2020 కాలానికి 500 మిలియన్ల ఎల్ఇడి బల్బులను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చౌకధలరకు వీటిని అందిస్తోంది. అమెరికాలో నూతనంగా ప్రవేశపెట్టిన ఇ-లాంప్ సంప్రదాయ బల్బులు ఉపయోగించే విద్యుత్‌లో కేవలం నాల్గవవంతు విద్యుత్‌ను ఉపయోగించే విద్యుత్‌లో కేవలం నాల్గవవంతు విద్యుత్‌ను ఉపయోగించటమే కాకుండా 20 వేల గంటలు నిర్విరామంగా వెలగగలవు. దేశవ్యాప్తంగా 30 మిలియన్ల వీధి దీపాలకు 5 బిలియన్ల కిలోవాట్ల (20 వేల మెగా వాట్లు) విద్యుత్ అవసరమవుతోంది. వీటికోసం మున్సిపాలిటీలు కార్పొరేషన్లు ఖర్చుపెడుతున్న సొమ్ము 500 మిలియన్ల అమెరికన్ డాలర్లు. తొమ్మిది రాష్ట్రాల్లో వందకుపైగా నగరాల్లో ఎల్ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేయడం వల్ల ఐదువేల మెగా యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయగలిగారు. 2017-2020 నాటికి 30 మిలియన్ల వీధి దీపాలను ఏర్పాటు చేస్తోంది. ఇక గృహవసరాలకు వినియోగంచే 16 రకాల పరికరాలు (రిఫ్రిజిరేటర్లు ఎయిర్ కండీషనర్లు తదితర ) ఇందన సామర్థ్య స్టాండర్స్‌ను పాటించడంవల్ల వాటి సామర్థ్యం మూడు శాతం వరకు పెంచవచ్చు దిగుమతి చేసుకుంటున్న చమురు ఉత్పత్తుల్లో 35 శాతం రవాణా రంగానికే సరిపోతుంది. ఈ రంగంలో ప్రతి ఏడాది ఐదు శాతం ఇంధన వినియోగం పెరుగుతోంది. కాలం చెల్లిన వాహనాలు గతుకుల మయమైన రహదారులు, అంతకంతకు పెరుగుతున్న ట్రాఫిక్ వంటి కారణాల వల్ల 20 శాతం ఇంధన సామర్థ్యాన్ని ఈ రంగం కోల్పోతోంది. వీలైనంత వరకు సరుకు రవాణాకు రోడ్డు మార్గాలరపకప రైలు మార్గాన్ని ఎంచుకుంటే ఇంధన వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. దీనికి అదనపు రైళ్ళు, రైల్వేమార్గాలు అవసరం.




ఇంధన సంరక్షణకు 2001 నాటికి చట్టాలున్నా అవి అంత సమర్థవంతంగా పనిచేయనట్లేనేది నిర్వివాదాంశం దీని స్థానంత పరిపూర్ణమైన సమగ్ర చట్టం అవవసరం ఎంతైనా ఉంది. పరిశ్రమలను స్థాపించేటప్పుడే ఇంధన సంరక్షణ సమర్థ వినియోగ చర్యలు తీసుకునేటట్లు చూడాలి. రుణాలు మంజూరు చేసే సంస్థలు సైతం ఇటువంటి నిబంధనలను రుణమంజూరుకు అనుసందానం చేయాలి. ఇంధన ఉత్పత్తి ఇంధన సమర్థ్య సరికరాల తయారీ సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇంధన సామర్థ్య పరికరాల తయారీ సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇంధన వినియోగ సామర్థ్యం గల వ్యవసాయ పనిముట్లను రైతులకు సబ్సిడీలపై అంటించాలి. ఇంధన సంరక్షణ అంటే నూతన ఇంధన ఉత్పత్తే అనే భావన ప్రతి ఒక్కరిలో కల్పించాలి. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల్లో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, రైతు కూలీలకు అవగాహన కల్పించడానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలి. జాతీయ అక్షరాస్యత మిషన్, జాతీయ కుటుంబ నియంత్రణ మిషన్‌లలాగా జాతీయ ఇంధన సంరక్షణ మిషన్ అనే అంశంతో ముందుకు కదిలితే త్ప ఆశించిన లక్ష్యాలను చేరుకోలేం. మన భావితరాలకు నోట్లకట్టలను అందించే బదులు అపార సంపదకు సమానమైన ఇంధన వనరులను వారికై సంరక్షిద్దాం. ఇది మన అందరి బాధ్యత.

# కేంద్ర ప్రభుత్వ పథకాలు




**1. ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన:**

గనులు కార్యకలాపాలు వల్ల ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితులులైన ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం 2015 సెప్టెంబర్ 17వ తేదీన ప్రారంభించింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం మైనింగ్ కార్యకలాపాల వల్ల ప్రభావితులైన ప్రజల సంక్షేమం. ఇందుకోసం జిల్లా ఖనిజ ఫౌండేషన్‌లు నిధులును ఖర్చు చేస్తారు. 2015 సెప్టెంబర్ 17 నాటి నుండి ఈ పథకం అమలుకై డి.ఎం.ఎఫ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని దేశ వ్యాప్తంగా గనులు కార్యకలాపాల కొనసాగుతున్న అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరిగింది.

**ఈ పథకం యొక్క లక్ష్యం:**

- గనులు కార్యకలాపాలు కొనసాగే ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ ప్రాజెక్టులు కార్యక్రమంను అమలుపరుస్తాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలతో పాటు వీటిని అమలు జరుపబడతాయి.
- గనులు తవ్వకాల కొనసాగే మరియు కొనసాగిన తర్వాత కాలంలో కలిగే ప్రభావాలను కనీసస్థాయికి తగ్గించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.
- ముఖ్యంగా గనులున్న జిల్లాల్లో వాతావరణం ప్రజల ఆరోగ్యం ప్రజల సామాజిక ఆర్థిక రంగాలపై కలిగే ప్రభావం వంటి వాటిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తారు. గనులు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దీర్ఘకాలం పాటు సుస్థిర జీవనవృతులు కల్పించడం ద్వారా వారి జీవితాలను మరింత నాణ్యతమవడానికి దోహదపడటం.

**2. స్టాండప్ ఇండియా:**

ప్రధాని నరేంద్రమోదీ 2016 ఏప్రిల్ 5వ తేదీన దళితనేత బాబు జగజ్జీవన్‌రావ్ జయంతిని పురస్కరించుకొని నోయిడాలో స్టాండప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా యువత ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీల మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక ధోరణిలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం. భారత చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధి బ్యాంకు (సిడ్బి) దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (డిక్కి) దేశవ్యాప్తంగా మరికొన్ని సంస్థలు ఈ కార్యక్రమం నిర్వహణకు కృషి చేస్తాయి.

- సిడ్బితో పాటు వ్యవసాయ గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు (నాబార్డ్) ఈ కార్యక్రమ నిర్వహణకై స్టాండప్ కనెక్ట్ సెంటర్లను నిర్వహిస్తుంది. సమాజంలో అభివృద్ధికి నోచుకోని వర్గాలకు బ్యాంకు ఋణాలు అందెలా చేయడం ద్వారా వ్యవస్థీకృత పరపతి రంగాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం దీని యొక్క లక్ష్యం.
- తెలికపాటి యాప్‌లు అందించడం ద్వారా ప్రజల్లో ఔత్సాహిక పారిశ్రామికదారులు ప్రోత్సహించడం జరుగుతుంది.
- వ్యవసాయేతర కార్యక్రమలు క్రింద వ్యాపారాలు చేపట్టి ఎస్సీ, ఎస్టీ మహిళలకు 10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు తెలికపాటి షరతులపై రుణాలు అందించడం జరుగుతుంది.
- దేశంలో ప్రతి ఒక్క బ్యాంకు శాఖ నుండి ఒక ఎస్సీ లేదా ఎస్టీ మహిలకు రుణం అందెలా చూడటం.

STAND UP India
Endeavour and prosper

**3. ప్రగతి:**

ప్రజల నుండి ప్రభుత్వానికి అందే ఫిర్యాదులను పరిష్కరించడంకై మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన, పెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు అమలు తీరును మరియు వాటిని సమీక్షించడంకై ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ 2016 మార్చి 25వ తేదీన ఈ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

- ప్రో యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ అన్న దానిని సంక్షిప్త రూపమే ప్రగతి. దీనిని తెలుగులో సానుకూల పాలన సమయోచిత అమలుగా చెప్పుకోవచ్చును.
- ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి కార్యాలయ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు మరియు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు భాగస్వామ్యులుగా ఉంటారు.
- ప్రతి నెలా నాల్గొవ బుధవారం ప్రగతి దినంగా పేర్కొనడం జరిగింది.
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించి పరిష్కారాలు ఆదేశించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అదే విధంగా వివిధ రాష్ట్రాలు చేపట్టిన అమలు తీరును కూడా సమీక్షిస్తారు.
- సి.పి.టి.ఆర్.ఎ.ఎం.ఎస్ కు చెందిన డెటాబెస్ ప్రాజెక్టుల పర్యవేక్షణ బృందం (పి.ఎజ్) కేంద్రం గణాంకాలు కార్యక్రమం అమలు మంత్రిత్వ శాఖలు ప్రధాన కార్యాలయానికి సమాచారాన్ని సమకూరుస్తాయి.
- సాధారణ ప్రజలు ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వ, శాఖలు ప్రాజెక్టుల నిర్వహకులు ప్రధాన కార్యాలయంలో జరిపే ఉత్తర ప్రత్యుర్తరాలను కూడా ప్రధాన కార్యాలయం ఈ కార్యక్రమంలో పరిశీలిస్తుంది.
- వీడియో కాన్ఫరెన్స్ చేపట్టిన అంశాలు గురించి సమావేశం తర్వాత కేంద్ర ప్రభుత్వం కార్యదర్శులు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిలతో ఫాలోఅప్ చేస్తుంటారు.
- ప్రధానమంత్రి కార్యాలయం జాతీయ సమాచార కేంద్రం (నేషనల్ ఇన్ఫర్మెషన్స్ సెంటర్ ఎన్.ఐ.సి) సహాయంతో ఈ ప్రగతి కార్యక్రమానికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని రూపొందిస్తుంది.

**4. నిరాంచల్:**

ప్రతి ఒక్క వ్యవసాయ భూమికి నీటి పారుదల వసతులతో పాటు ప్రతి ఒక్క నీటి చుక్కను అధిక దిగుబడి సాధించడం లక్ష్యంగా ప్రారంభించిన ప్రధానమంత్రి కృషి సంచాయి యోజనలో భాగంగా కార్యక్రమాన్ని 2015 అక్టోబర్ 15న ప్రపంచ బ్యాంకు సహాయంతో అమలుపరిచే నిరాంచల్ జాతీయ వాటర్షెడ్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్కు ఆమోదం తెలిపింది కేంద్ర ప్రభుత్వం. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్ఘడ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ మొదలగు రాష్ట్రాలలో అమలుపరుస్తారు.

- ఈ కార్యక్రమంలో మొత్తం వ్యయంలో 1071.15 కోట్లు రూపాయలు ప్రభుత్వం భరిస్తుంది. మిగతా 50 శాతం మొత్తాన్ని ప్రపంచ బ్యాంకు ఋణంగా అందిస్తుంది.

**ఈ ప్రాజెక్టు యొక్క ప్రధాన లక్ష్యం:**

- వాటర్షెడ్ వర్షాధారిత, వ్యవసాయ నిర్వహణలో వ్యవస్థ మార్పులకు నాంది పలకడం.
- ఈ రెండు విభాగాలను మరింత సమన్వయం సాధించడంతో పాటు నిర్ధారిత లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన వ్యవస్థల ఏర్పాటు.
- ప్రాజెక్టు మద్దతు ఉపసంహరించిన తర్వాత కూడా మేనేజ్మెంట్ విధానాలు స్థిరంగా ఉండేందుకు అవసరమైనప్పుడు సహాయపడటం.
- సమ్మిళిత స్థానిక భాగస్వామ్యం ద్వారా మార్కెట్ అనుసంధానం

కూడా కల్గించడం రైతుల జీవితాలను, ఆదాయాలను కూడా చక్కగా మార్పు తీసుకురావడం.

- భూగర్భ జలవనరుల రీఛార్జింగ్ ద్వారా ఉపరితల జలవనరులపై ఒత్తిడి తగ్గించి వర్షాధార వ్యవసాయ భూముల్లో ఉత్పాదకతలు పెంచేందుకు పాల ఉత్పత్తి పెంచేందుకు.
- ఈ ప్రాజెక్టు అమలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను ఒక చక్రం క్రిందకు తీసుకు వచ్చి పంటల సాంద్రత పెంచేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.



**5. ప్రధానమంత్రి ఉజ్వల యోజన:**

భారతదేశంలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు చాలా ఉన్నాయి. ఆ కుటుంబాల వారికి వంటగ్యాస్ కొనుక్కొనే స్థోమత లేక కట్టెల పొయ్యి, కిరోసిన్ స్టవ్ మొదలైన వాటితో వంట చేస్తున్నారు. దాని వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా వంట చేసే ఆడవాళ్లు పలు రకాల వ్యాధులకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 2016 మార్చి 10వ తేదీన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని ప్రారంభించింది. దేశంలో దారిద్రరేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు ఉచితంగా వంటగ్యాస్ (ఎల్‌పిజి) అందించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

- ఈ పథకం వల్ల దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కోటి 50 లక్షల కుటుంబాలకు మేలు కలుగుతుంది. వీరితో పాటు మొత్తం 5 కోట్ల కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం యోచిస్తుంది.
- 2016-17 ఆర్థిక సంవత్సరం నుండి రెండేళ్ల పాటు (2018-19) వరకు ఈ పథకం అమల్లో ఉంటుంది.
- ఈ పథకం అమలుకు రూ.8000 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.
- ఈ పథకం క్రింద లబ్ధిదారులకు ఎల్.పి.జి. కనెక్షన్ కోసం 1600/- రూపాయలు అందజేయడం జరుగుతుంది.
- ఈ పథకాన్ని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సహాయంతో కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తుంది.

**6. సేతుభారతం ప్రాజెక్టు:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2016 మార్చి 4వ తేదీన సేతుభారతం ప్రాజెక్టును ప్రారంభించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలను నిర్మించడం ద్వారా 2019 నాటికి దేశంలో జాతీయ రహదారులపై రైల్వే క్రాసింగ్‌లన్నవి లేకుండా చేయడమే ఈ సేతుభారతం ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు క్రింద దేశవ్యాప్తంగా 208 రైల్వే వంతెనలు నిర్మించాలని గుర్తించారు.

**7. స్వదేశీదర్శన్:**

దేశంలో పర్యాటకరంగ అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వదేశ్‌దర్శన్ అను పేరుతో పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ప్రకారం మనదేశంలో ఉన్న పర్యాటక స్థలాలను అభివృద్ధి చేసి వినూత్న పద్ధతుల్లో పర్యాటకులను విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కోసం రూపొందించిన పథకం ఇది. తద్వారా భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్యాటక గమ్యంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం ఆశయం.

- ఈ పథకం ద్వారా స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని సర్కారు ప్రణాళికలు రూపొందించారు.
- థీమ్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశపు సంస్కృతి వారసత్వపు విలువలను ఇనుమడింపజేస్తారు.
- స్వదేశీ దర్శన్ క్రింద 5 సర్క్యూట్‌ల క్రింద విభజించారు.

1. నార్త్ ఈస్ట్ సర్క్యూట్, 2. బుద్దిస్ట్ సర్క్యూట్, 3. హిమాలయన్ సర్క్యూట్, 4. కోస్టల్ సర్క్యూట్, 5. కృష్ణాసర్క్యూట్

**- ఎం.ప్రదీప్‌కుమార్,**
**రిసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్**





# మానవాళిని ప్రేమించే క్రీస్తు

మానవాళికంతటికీ స్ఫూర్తిదాయకమైన మహా బోధకులను మనసారా గౌరవించాలని భారతీయులమైన మనమంతా మన మతం ద్వారా నేర్చుకున్నాం. బోధకుల జీవితాలను మనం అధ్యయనం చేసే మన విధానంలో కూడా కొత్తదనంతో కూడిన అందం ఇమిడి ఉంది. మరో మతాన్ని ప్రబోధించే మనమంతా జీసస్ అనే మహనీయుని ద్వారా ఇంతటి స్ఫూర్తిని ఎలా పొందగలుగుతున్నామన్నది హిందూ యేతరులకు అంత సులభంగా అర్థమయ్యే విషయం కాదు.

ఒక మూఢనమ్మకాన్నో మతసూత్రాన్నో కాక మతాన్వేషణలో భాగంగా భారతదేశం పొందగోరుతున్న ఆధ్యాత్మికత ఇది. మనం చదవబోతున్న విధంగా, జీసస్ క్రైస్ట్ కూడా మతం పట్ల ఇదే దృక్పథాన్ని అవలంబించాడు. భారతీయ మేధస్సులోని ఆత్మీయ ఆతిథ్యాన్ని ఈ దృక్పథం వివరిస్తుంది. వచ్చే రోజుల్లో అన్నీ నిక్షిప్తమైన ఉన్న ఇలాంటి విశాల దృక్పథాన్ని ప్రపంచంలో ఆలోచన కలిగిన వాళ్ళంతా స్వాగతించబోతున్నారు. జాతీయ సంస్కృతిగా మనం గర్విస్తున్న ఈ సంపదంతా వచ్చే రోజుల్లో సర్వమానవాళి సంస్కృతీ నాగరికతలలో అంతర్భాగం కాబోతోంది. ఆ పరిణామం, శతాబ్దాలుగా సంకుచిత ప్రాదేశిక మతసూత్రాల సంకెళ్ళలో బందీగా ఉన్న క్రీస్తు–ఆత్మను విముక్తి చేయడంలో సాయపడుతుంది. ఆ మహాబోధకుని మతానికి ఈ యుగంలో 'భారతీయత' చేయబోయే సేవ ఇది.

**జీసస్ జననం, బాల్యం...**

దైవాంశ కలిగిన మహనీయుల జనన సమయంలో అటు ప్రకృతి ఇటు మానవాళి సమ్మేళనంలో ఆనందాతిరేకంతో కూడిన పరిణామాలు సంభవిస్తాయన్న విషయం మన దేశంలో ఉన్న వారికందరికీ తెలుసు. ఎందుకంటే సార్వత్రికానందాన్ని కలిగించే స్వాగత ఘటన అది. మన పవిత్ర గ్రంథాల్లోని మాటల్లో చెప్పాలంటే, "మన పూర్వీకులు సంతసిస్తారు, దేవతలు నృత్యం చేస్తారు, ఈ ప్రపంచానికొక రక్షకుడు ఉద్భవిస్తాడు.

బైబిలులోని కొత్త నిబంధన గ్రంథంలోని సువార్త భాగాల్లో జీసస్ క్రైస్ట్ జననానికి సంబంధించిన వివరణ దీనితో సరిపోతుంది. లూకా సువార్తలో వర్ణన హృదయాన్ని లోతుగా తాకే విధంగా ఉంటుంది. కొత్తగా ప్రకటించబడిన రోమా చట్టం మేరకు పన్నుల తాలూకు వివరాలివ్వడం కోసం తల్లిదండ్రులైన జోసఫ్ మేరీలు గలిలియలోని నజరేతు నుండి యూదాయ ప్రాంతంలోని బెత్లేహేముకు వచ్చారు. అప్పటికే ఆమె తన ప్రథమ సంతానంతో గర్భవతి. ఆ జంట ఒక సత్రంలో తలదాచుకుంది. ఒక మహాగొప్ప ఆధ్యాత్మిక బోధకుడు కాబోతున్న శిశువును మేరీ అక్కడే ప్రసవించింది. సత్రంలో తగిన స్థలంలేని కారణంగా శిశువును తల్లి పొత్తిగుడ్డలతో చుట్టి ఒక పశువుల పాకలో పడుకోబెట్టింది. ఆ సమయంలో, దగ్గరలోనే గొర్రెలు మేపుకొంటున్న కొందరు కాపరులకు అంతా సదుమణిగిన అర్ధరాత్రివేళ ఈ కబురు అందింది. అత్యంత అమూల్యమైన శిశువు జనన వార్త అత్యంత అసాధారణమైన పద్ధతిలో వారికందింది.

'ప్రభువు దూత వారి వద్దకు వచ్చింది. ప్రభువు మహిమ వారి చుట్టూ ప్రకాశించినందున వాళ్ళంతా భయపడిపోయారు. అయితే ఆ దూత భయపడకండి. ఇదిగో ప్రజలందరికీ కలుగబోయే మహాసంతోషకరమైన శుభ సందేశాన్ని నేను మీకు తెలియజేస్తున్నాను. దావీదు పట్టణంలో నేడు మీ కోసం రక్షకుడు పుట్టాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. దానికి మీకిదే సూచన. పొత్తిగుడ్డలతో చుట్టబడిన ఒక శిశువు తొట్టిలో పరుండబెట్టబడి ఉండటం మీరు చూస్తారు'

కాపరులంతా ఆశ్చర్యచకితులయ్యారు. తమ ఆశ్చర్యంలోంచి తేరుకొంటూండగానే దేవతల సమూహమంతా కలిసి "సర్వోన్నతమైన స్థలాల్లో దేవునికి మహిమయు, భూమికి, మనుషులందరికీ సమాధానం కలుగునుగాక" అంటూ దేవున్ని స్తుతిస్తూ పాడుతున్న మధురమైన గానాలు వినబడసాగాయి.

ఆ ఆనవాళ్ళ ఆధారంగా శిశువును చూసేందుకు కాపరులు



బెల్లెహేము బయలుదేరారు. మేరీని, జోసఫ్‌ను కనుగొన్నారు. పశు వుల పాకలో పరుండియున్న శిశు వునూ కనుగొన్నారు. ప్రేమ పూరితమైన ఆరాధనను, అర్పణలను సమర్పించారు.

ఆ తరువాత పన్నెండేళ్ల బాలుడిగా జీసస్ బాల్యం తాలూకు క్లుప్త వివరాలు మనకు లభ్యమవుతాయి. యూదుల పస్కా పండుగను ఆచరించడానికి తల్లిదండ్రులతో సహా పరిశుద్ధ దేవాలయ సందర్శనాలకై జెరూసలేమ్‌కు ఆయన వెళ్ళాడు. పండుగ ఆచరించిన తరువాత తల్లిదండ్రులు తిరిగి ఇంటికి బయలుదేరారు. కాని జీసస్ తమతో లేడన్న విషయాన్ని ఒక రోజు పాటు ప్రయాణించిన పిదపవారు కనుగొన్నారు. ఆయన కోసం అంతటా వెదకడం ప్రారంభించారు. కాని మూడు రోజుల వెదుకులాట తరువాత పరిశుద్ధ దేవాలయ ప్రాంగణంలో నాటి యూదు మత ప్రతిష్టులు, పెద్దలతో ధర్మశాస్త్రం, మతవిశ్వాసం వంటి అంశాల మీద చర్చలు జరుపుతూండగా ఆయన్ను కనుగొన్నారు. నీవు ఆకస్మాతుగా అంతర్ధానమైతే మేమెంత భయపడిపోయాం తెలుసా? అంటూ తల్లి మెత్తగా మందలిస్తే “నా కోసం మీరెందుకు వెదికారు? నేను నాతండ్రి వ్యవహారాల్లో తలమునకలై ఉంటానని మీకు తెలియదా? అని ఆయన ఎదురు ప్రశ్నించాడు. ఆయనిచ్చిన జవాబులోని అంతారార్థమైతే తల్లిదండ్రులు గ్రహించలేకపోయారు గాని, అతను తిరిగి దొరికాడు, తమతో ఇంటికి తిరిగి రావడానికి సమ్మతించాడని మాత్రం సంతృప్తి చెందారు.

జీసస్ యవ్వన ప్రాయానికి సంబంధించి ఒక పురుషుడిగా ఆయన ఆరంభ దినాలకు సంబంధించి మనకు పెద్దగా వివరాలు తెలియవు. అయితే “జీసస్ జట్టానంలోను, దేవుని దయలోను మానవుని దయలోను వర్ధిల్లాడు’ అని మాత్రం సువార్తల్లో ఒక్క మాటలో వివరించబడింది.

అయితే తన జీవిత పరమోద్దేశ్యాన్ని చాలా త్వరగానే ఆయన గ్రహించి, అది నెరవేర్చేందుకు గాను ఏదీ ఆటంకంగా ఉండకుండా అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడనడానికి సూచనలున్నాయి. దగ్గరలోనే ఉన్న కొండలో ఏకాంతంగా, నిశ్శబ్దంగా స్వీయ ధ్యానంలో అనేక గంటలపాటు ఆయన గడిపి ఉండవచ్చు. మళ్ళీ ఆయన్ను మనం కలుసుకునేటప్పటికి ఆయన ముప్పై ఏళ్ళవాడు. అప్పటికి ఆయన ఒక చోట నుండి మరోచోటికి తిరుగుతూ, తన జీవితం, బోధనల ద్వారా సంచలనాన్ని సృష్టిస్తున్న మరో బోధకుని గురించి విన్నాడు. యూదయ అరణ్యంలోనూ, ఆ తరువాత యొర్దాను నదీ తీరంలోనూ ‘మారు మనసు పొందండి. పరలోకరాజ్యం త్వరలోనే రాబోతుంది’ అంటూ ప్రకటిస్తున్న బాప్తిస్మమిచ్చే యోహాను ఆయన.

బాప్తిస్మమిచ్చే యోహాను, యేసుక్రీస్తుల జీవితం, పరిచర్య మనకు యూదుల మతచరిత్రకు సంబంధించిన ఒక కొత్త అధ్యాయాన్ని మనల్ని పరిచయం చేస్తుంది. దైవ మానవ సంబంధంలో ప్రేమానుబంధంతో కూడిన సాన్నిహిత్యం ప్రాతిపదికగా పాశ్చాత్యుల ఈ మతానికి వారి అసాధారణ పరిచర్య ఒక కొత్త రూపాన్నిచ్చింది. ప్రాచీన యూదుల మతానికి ఇది వరకు ఈ రూపం లేదు. దేవుడంటే అక్కడెక్కడో దూరంగా ఉండేవాడని, మానవుడికి దేవుడెంత దూరంగా ఉంటే దేవుడంత గొప్ప వాడవుతాడని పురాతన మతం విశ్వసించేది. దేవునికి దూరంగా ఇక్కడ భూమ్మీద మానవుడు దేవుడంటే భయంతో విశ్వాసంతో జీవనాన్ని గడపాలి. తన జీవనకాలంలో చూపించిన విశ్వాసానికి మరణానంతరం ఫలాలుంటాయన్నది పురాతన ప్రాతిపదిక. అలాంటి మతం ఎక్కువగా ఈ లోకానికి సంబంధించినదిగా, చారిత్రక, కాల సంబంధమైన మార్పులకు నిరంతరం లోనయ్యేదిగా ఉంటుంది. వరలోకానికి సంబంధించిన వాసనలు ఎక్కువగా లేని అలాంటి సాంఘిక-రాజకీయ విశ్వాసం, మూఢవిశ్వాసంగా, కేవలం ఆచార వ్యవహారాలు, పూజా ! సంబంధమైన కార్యకలాపాలు ప్రధానంగా ఉన్న మత విశ్వాసంగా అసహన పూరితంగా ఉంటుంది.

బాపిస్మవిచ్చే యోహాను, యేసుక్రీస్తు నాటి కొత్త నిబంధన కాలంలో అలాంటి మత పరిస్థితులున్నాయనడానికి స్పష్టమైన వర్ణనలు దొరుకుతాయి. సార్వత్రిక, మానవీయ దృక్కోణంతో పురుడు పోసుకొంటున్న ఒక కొత్త మత విశ్వాసపు పోకడలు యోహాను, యేసుక్రీస్తుల కాలంలో మనకు కనిపిస్తాయి. ఈ కొత్త సిద్ధాంతానికి అప్పటికే పాతుకుపోయి వున్న ఏకదేవవాద నియంతృత్వపు పోకడలకు మధ్య చెలరేగిన ఘర్షణలు, మత సంప్రదాయాలు మూఢవిశ్వాసాల సంకెళ్ళ నుండి వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న యాజక వర్గపు పెత్తనం నుండి విముక్తి కోరుతున్న అప్పటి ప్రజల లోతైన మనోభావాలకు, నిరీక్షణ, వాగ్దానం పునాదులుగా యోహాను, యేసుక్రీస్తు వంటి మహనీయులు తమ జీవితాలు, పరిచర్య ద్వారా చేస్తున్న బోధనలు... ఇవన్నీ మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఆత్మసంబంధమైన అన్వేషిగా మానవుడెవ్వాడూ మతపరమైన నియమాలు, ఆజలను అదిగమించడానికే ప్రయత్నం చేస్తాడు. సంకుచితమైన, భూ సంబంధమైన ప్రయోజనాలకు మాత్రమే మత

నియమాలు, ఆజ్ఞలు పరిమితమవుతాయి కాని ఆత్మీయ విలువలు నిత్యజీవానికి, అంతం లేని అనంత జీవనానికి చేరువగా తీసుకెళ్తాయి. ఆత్మీయంగా ఆకలిగొని ఉన్న ప్రజలకు నిత్యజీవం అనే రొట్టె నివ్వడానికి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. ఆత్మసంబంధమైన అంశాల కోసం ఆకలిగొన్న వ్యక్తికి మత నియమాలు, ఆచారవ్యవహారాలు తృప్తి నివ్వలేవు. అవి అతనికి రాళ్ళలాగే కనిపిస్తాయని కొత్త నిబంధన చెబుతుంది. యేసు ప్రబోధించిన మతం పునాదులు లోతైనవి, సరిహద్దులు సువిశాలమైనవి. ఆయన దేవున్ని మానవునికి చేరువగా తీసుకువచ్చి, వారిద్దరినీ ప్రేమ అనే బంధంతో కట్టేశాడు. వారిద్దరి సంబంధంలో ప్రధాన భాగంగా ఉన్నా భయాన్ని పూర్తిగా రూపుమాపాడు. 'భయం' స్థానాన్ని 'ప్రేమ' ఆక్రమించుకున్న కొత్త నేపథ్యంలో మానవుడు తన తోటి వారుని ప్రేమించేవాడుగా కొత్త రూపాన్ని సంతరించుకున్నాడు. దేవుణ్ని ప్రేమించడంతో, తోటి మానవునికి పరిచర్య చేయడంలో తన జీవనానికి సార్థకతను అతడు వెదుక్కోవడం ఆరంభించాడు. దేవుని పట్ల అతనిలో చిగురించిన ఈ ప్రేమ, ఈ సన్నిహితబంధం అతనిలోని నీతియుక్తమైన జీవనవిధానాలకి కొత్తరూపాన్నిచ్చింది. అతనిలోని ఆధ్యాత్మిక ఆకలిని తీర్చగలిగిన ఒకే ఒక స్థానంగా అది పరిణమించింది. మతంలో ఇదే అతి ప్రధానమైన అంశం. మానవుడు భౌతిక, సాంఘిక జీవి మాత్రమే కాదు. అతనిలో అత్యున్నతమైన మరో కోణంతో కూడిన వ్యక్తిత్వం ఉంది అని అది రుజువు చేసింది. అతడు ప్రధానంగా ఆధ్యాత్మిక జీవియని, అతనిలో అంతర్గతంగా ఉన్న ఈ ఆధ్యాత్మిక వ్యక్తిత్వంలోనే సృష్టి కర్తయైన దేవునితో పటిష్టమైన సంబంధం, దేవుని సృష్టియైన తోటి మానవులతో సాభ్రాతృత్వం ఏర్పడుతాయి. ఆ ఆధ్యాత్మిక వాస్తవాన్ని ఆవిష్కరించి అతని జీవితంలో, ప్రవర్తనలో పరిఢవిల్లేదే మతం.

మతం పట్ల యేసు ప్రభువుకున్న దృక్పథం ఇది. ఇదే దృక్పథాన్ని ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతం తదితర లేఖనాలు ద్వారా ఇండియా అలవర్చుకుంది. ఇదే మన జాతీయ జీవన స్రవంతిలో అవగాహనలో భాగమయింది. మతం కేవలం ఒక మూఢవిశ్వాసం కాదని, మెరుగైన జీవితం, నైతిక జీవితం, నీతియుక్తమైన జీవితానికి సంబంధించిన నియమావళి కాదని, మామూలు విశ్వాసం కాదని, అది జీవన సార్థకతను సాధించే ఆధ్యాత్మిక ఉపకరణమని ఈ లేఖనాలు ఉద్భోధించాయి. అయితే ఇవన్నీ కూడా అందులో అంతర్భాగమే తప్ప ప్రధానాంశాలు కాదని మనం నేర్చుకున్నాము. పాలస్తీనా మతానికి భిన్నంగా ఉపనిషతులు కేవలం సాంఘిక, నైతిక నియమావళిగా మారిన మతంకాక ఆధ్యాత్మిక లోతు విలువ కలిగిన మతాన్ని భారతదేశానికిచ్చాయి. అలాంటి మతం పట్ల ఆసక్తిని రగిలించాయి. 'స్మృతి' కంటే 'శ్రుతి' గొప్పదన్న మన జాతీయ భావనకు ఉపనిషత్తులే పునాది వేశాయి. 'స్మృతి ప్రధానమైన' "జీవితం నిజానికి 'శృతి' ప్రధానమైన జీవితానికి ఉపోద్ఘాతమేనని ఉపనిషత్తులు నిర్వచించాయి.

**యేసు నెరవేర్పుకోసం వచ్చాడు, నాశనం చేయదానికి కాదు!**

యూదు మతస్థులకు, దాని సంబంధిత మతస్థులకు మొట్టమొదటిసారిగా ఈ గొప్ప ఆలోచన యోహాను యేసుక్రీస్తుల ద్వారా వచ్చింది. అయితే వారి పూర్వీకులకు, వారి సంప్రదాయాలకు ఇది అంత కొత్త విషయమేమీ కాదు. ప్రతిభావంతులైన కొందరు పూర్వమే ఈ విషయమై సాక్ష్యమిచ్చారు. అయితే వారి వాణి అప్పటికే అమలులో వున్న సంప్రదాయాల పైన పెద్దగా ప్రభావాన్ని చూపించలేకపోయింది. బాప్తిస్మమిచ్చే యోహానుది కూడా అదే పరిస్థితి గనుకనే "అరణ్యంలో కేకలు వేస్తున్న ఒక వ్యక్తి స్వరం' తనదని అతను చెప్పాడు. కాని యేసులో ఆ స్వరం ఒక శక్తిగా మారింది. అది సాంప్రదాయక మతశక్తులతో ఘర్షణకు దిగడం తప్పని సరయింది. కొత్త నిబంధనలో ఈ రెండు స్రవంతులూ పక్కపక్కనే ప్రవహించినట్లుగా మనం చూస్తాము. ఈ రెండు ధోరణుల మధ్య ఉన్న వైరుధ్యం ఒకే వైపునకు ప్రవాహం సాగే అయింది. పాతది కొత్త దానితో ఘర్షణ పడటం చూస్తాము తప్ప కొత్త దానికి పాతదానితో ఘర్షణ లేదు. ఆధ్యాత్మిక సందేశం ఎంత విశాలమైనదంటే, అన్ని రకాల విశ్వాసాలకు అందులో తావుంది. ప్రేమ, కృప ధర్మశాస్త్రాన్ని ఆజ్ఞల్ని వమ్ము చేయవు కాని వాటిని నెరవేర్చుతాయి. పాతమతాన్ని పారదోలాలని యేసుప్రభువే ఎన్నడూ అనుకోలేదు. తాను ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడానికే వచ్చాను తప్ప రదు చేయడానికి కాదని ఆయన స్పష్టం చేశాడు. సువిశాలమైన, ఎంతో ఔదార్యంతో కూడిన ఈ ఆలోచనా విధానంలో పాత కొత్త భావాల కలయికతోపాటు, లోతైన ఆధ్యాత్మిక మత విశ్వాసపు నిజమైన చిహ్నాలు కనిపిస్తాయి. మోషే, యేసుక్రీస్తుల సందేశాల పరస్పర సమన్వయ ధోరణి తాలూకు దృశ్యాలు మనకు కొత్త నిబంధనలో కనిపిస్తాయి. 'ఎందుకంటే మోషే ద్వారా ధర్మశాస్త్రం, యేను క్రీనుద్వారా కృపాసత్యాలు వచ్చాయి' అని బైబిలులో రాయబడి ఉంది

నిత్యజీవానికి వారసుడయ్యేందుకు మార్గం తెలుపమంటూ తనను సంప్రదించిన ధనికునికి యేసుక్రీస్తు ఉన్నత ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోవడానికి ముందుగా దేవుని ఆజ్ఞలన్ని పాటించమంటూ సలహా ఇచ్చాడు. ఈ ఉన్నత ఆధ్యాత్మిక అన్వేషణలోనే యేసుక్రీస్తు కొన్ని సరికొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించనుద్దేశించాడు. విన్నవారికి అవి కొత్తగానే కాదు, సంచలనాత్మకమైనవిగా కూడా ధ్వనించాయి. చాలా ప్రదేశాల్లో ప్రజలు ఆయన ప్రసంగాలు విని నిర్ఘాంతపోయారని కొత్త నిబంధన చెబుతుంది.

**యేసుక్రీస్తు బాప్తిస్మం**

ఇలాంటి పరిస్థితుల్లో యోహాను ఆవిర్భావం ప్రజలకు విస్మయం కలిగించింది. భవబంధాలకు దూరంగా బ్రహ్మచారిగా సన్యాసి జీవితం గడిపిన వ్యక్తి యోహాను. యూదుమత సంప్రదాయాల సన్యాసత్వం, బ్రహ్మచర్యం తెలియని విషయాలు. "పరలోక రాజ్యం సమీపంలో ఉంది. పశ్చాత్తాప పడండి' అన్న నంచలనాత్మక నందేశంతో యోహాను అందరి దృష్టినీ ఆకర్షించాడు.

పరలోక రాజ్యానికి సంబంధించిన అవగాహన ప్రజలకు అప్పటికే ఉంది. అందువల్ల అందులో సంచలనాత్మక విషయమేమీ లేదు. పరలోక రాజ్యమంటే అక్కడెక్కడో దూరంలో, ఎప్పుడో భవిష్యత్తులో రానున్న విషయం. అది చనిపోయాక చేరే రాజ్యం కాబట్టి దాని గురించి తొందరపడవలసిన అవసరం లేదన్నది ప్రజల అభిప్రాయం. కాని

'అది సమీపించింది', అన్న యోహాను మాటలే వారిలో సంచలనం కలిగించాయి. ఇక్కడే 'దగ్గరలోనే పరలోకరాజ్యం ఉందనడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. రోమా ప్రభుత్వపు అణిచివేత పాలనలో ఉన్న పీడిత ప్రజలకిది ఆనందాన్ని కలిగించింది. అయితే ప్రజలు దాన్ని రాజకీయంగా అన్వయించుకొని అర్థం చేసుకున్నారు. అంతరంగ ప్రక్షాళన ద్వారా, నిజమైన పశ్చాత్తాపం ద్వారా ఆ పరలోక రాజ్యంలోకి ప్రవేశించమంటూ ప్రజలకు ప్రకటించి యోహాను వారిని సిద్ధపర్చాడు. ఆ ప్రక్షాళనకు బాహ్యచిహ్నంగా యోర్దాను నదిలో "బాప్తిస్మాన్ని యోహాను నిర్దేశించాడు. వందలాదివుంది ప్రజలు యోహాను ద్వారా బాప్తిస్మం తీసుకోవడానికి పరుగులు తీశారు. వారిలో కుటలచిత్తం గలవారిని యోహాను తిట్టి బెదిరించి వెనక్కి పంపేశాడు. ఔదార్యం, న్యాయం, కరుణ, నిజాయితీ వంటి సత్ లక్షణాలతో బతకమంటూ బాప్తిస్మం తీసుకున్న వారికి ఆయన హెచ్చరిక చేశాడు. లేఖనాలు ప్రవచించిన మెస్సీయా ఇతనేనేమో నన్న భ్రమను యోహాను కల్పించాడు. అయితే వారి తలంపుల నెరిగిన వాడుగా యోహాను ''నేను నీటిలో బాప్తిస్మమిస్తున్నాను. కాని నావెనుక వచ్చేవాడు నాకంటే శక్తివంతుడు. ఆయన చెప్పులవారు విప్పడానికి కూడా నా కరతలేదు. ఆయన పరిశు ద్ధాత్మలోను, అగ్నిలోనూ మీకు బాప్తిస్మమిస్తాడు' అని రుజువు చేశాడు. అప్పటికి ప్రజలకెవరికీ అంతగా తెలియని యేసుక్రీస్తు యోహాను వద్దకు వెళ్ళి బాప్తిస్మం తీసుకున్నాడు. యేసును ఎగాదిగా చూసిన యోహాను ''నేను మీకు బాప్తిస్మమిచ్చేంత అర్హున్ని కాదు. నాకే మీరు బాప్తిస్మమివ్వాలి" అన్నాడు. "నీతియావతూ నెరవేరడం కోసం ఇప్పటికి ఇలా జరుగనివ్వ అని యేసు జవాబిచ్చి ఆయన ద్వారా బాప్తిస్మం తీసుకున్నాడు. యోర్దాను నదిలో ఆవిధంగా యోహాను ద్వారా బాప్తిస్మం తీసుకున్న యేసు నీళ్ళలో నుండి వెలుపలికి రాగానే ఆకాశం నుంచి ఒక స్వరం వినబడింది. ఈయన నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేనానందిస్తున్నాను" అన్న పరలోక స్వరం ద్వారా యేసుక్రీస్తు ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందాడు.

యేసు పరిచర్య ఇపుడు ఆరంభమయింది. తన కాలం కన్నా ఎంతో ముందున్న కాలానికి సంబంధించిన ప్రవచనాలు చేసినందుకు ఆ తర్వాత యోహానును నిర్బంధించి శిరచ్ఛేదనం చేశారు. బాప్తిస్మం తీసుకున్న వెంటనే యేసుక్రీస్తు ప్రక్కనే ఉన్న కొండల్లోకి వెళ్ళి ఏకాంతవాసం చేసి అంతర్గత పరిశోధన చేసుకున్నాడు, "శోధనలు" జయించాడు. ఆ తరువాత గలిలయ సరస్సు తీరానికి వెళ్ళి తన ప్రజా పరిచర్యను బహిరంగంగా ప్రారంభించాడు.

– స్వామిరంగనాథనంద

# జ్ఞానమే సౌభాగ్యం

సంపద, సంస్కారం, ఐశ్వర్యం, జ్ఞానం వైరుధ్యమైన దారుల్లా నేటి సమాజంలో మనకు కనిపిస్తున్నాయి. మనిషికి గుర్తింపఉనూ, కీర్తినీ తెచ్చిపెట్టేవి సంపద, ఐశ్వర్యాలే కదా! కనిపించని సంస్కారం, జ్ఞానం మనిషినెలా వ్యక్తీకరిస్తాయి. అవి లేకపోయినా ఫర్వాలేదు. సంపద, ఐశ్వర్యం మనిషి ఉనికిని ఖండాంతరాలు దాటేలా చేస్తాయనేది నేడు చిన్నపిల్లాడి నుంచీ పండు ముదుసలి వరకూ ఘంటాపథంగా చెప్పుకునే నిర్వివిదాంశం. సంస్కారం వల్ల కడుపు నిండుతుందా? జ్ఞానం సుఖాన్నిస్తుందా? వాటివల్ల ఎటువంటి ప్రయోజనం లేదూ.. అంటూ నమ్మకాన్ని పెంచుకున్న ప్రయోజనం లేదు.. అంటూ నమ్మకాన్ని పెంచుకున్న సామాజిక ధోరణికి అద్దంలో స్వరూపాన్ని చూపిస్తుందో సంఘటన.

యా హి వైశ్రవణే లక్ష్మీ ర్యా చంద్రే హరివాహనే.

సా రావణ గృహేరమ్యా నిత్యమేవానపాయినీ.

అందమైన సంపద, అంతులేని ఐశ్వర్యం కుబేరుని సౌధాన్నీ, ఇంద్రలోకాన్నీ అలంకరించినవి. కానీ అవన్నీ రావణుని లంకలోనూ ఉండటం అత్యంత ఆశ్చర్యంగా ఉందని నివ్వెరబోయిన హనుమంతుడు రావణుని హెచ్చరిస్తాడు.

రావణుడు తన ఐశ్వర్యాన్ని చూసుకొని గర్విస్తూ చేయరాని పనులెన్నో చేశాడు. చివరికి తానూ ఒక సంపద నాశనమైపోయే పరిస్థితి వచ్చింది.

తపస్సంతాపలబ్ధస్తే సోయం ధర్మపరిగ్రహః,

న స నాశయితుం న్యాయ ఆత్మ ప్రాణ పరిగ్రహః.

నీవు సంపాదించిన ఐశ్వర్యం నిన్ను అత్యున్నతస్థానంలో నిలబెట్టిందనుకుంటున్నావు. ధర్మాన్ని విడిచిపెట్టిన నిన్ను ఆ ఐశ్వర్యమే ఒకనాడు కాలరాస్తుందని హనుమంతుడంటాడు. అయినా లెక్కచేయని రావణుని గురించి మనకు తెలియంది కాదు.

మనిషి ఎప్పుడైతే తన ఐశ్వర్యాన్ని చూసుకొని గర్విస్తాడో అప్పుడే తనలోని వివేకాన్ని కోల్పోతాడు. జ్ఞానాన్ని జారవిడుచుకుంటాడు. జ్ఞానం లేని ఐశ్వర్యం మనిషిని సరైన దారిలో నడిపించలేవు. అదే మనిషి జ్ఞానాన్ని మన్నుకొని వివేకంతో బతికితే సంపద, ఐశ్వర్యం వాటంతటవే తన దరికి చేరుతాయి. ఒకవేళ మనిషి జ్ఞానే అయినా ఐశ్వర్యాన్ని చూసుకొని మిడిసిపడితే తన చేజేతులా ధన గర్వంతో జ్ఞానాన్ని కప్పేసుకుంటాడు. మనం సముద్రంలో వచ్చే అలల్ని చూసినంత సేపూ దాని లోతునూ, వైశాల్యాన్ని గమనించలేం. సూర్యున్ని ఒక గోళంలా చూసినంత సేపూ దాని అద్భుతమైన వెలుగును తెలుసుకోలేం. అందుకే అంటారు.. బంగారు కవచంతో సత్యాన్ని దాచేస్తున్నామని. వివేకం, జ్ఞానం మనిషికి అన్నిరకాల సౌభాగ్యాన్నీ అందిస్తాయి.

టిసిపార్డు నిర్వహించిన

# జియో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ శిక్షణలకు జాతీయ అవార్డు




తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. టిసిపార్డు నిర్వహించిన జియో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ శిక్షణా కార్యక్రమాలకు ఈ అవార్డు లభించింది. ఈ అవార్డును టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ బి.నరేంద్రనాథ్‌రావు ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రివర్యులు శ్రీ నరేంద్రసింగ్‌తోమర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ శిక్షణలను ఆ సంస్థ సిఇఓ శ్రీమతి నీతూకుమారిప్రసాద్ ఐఏఎస్ ఆదేశాల మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఈ-గవర్నర్స్ మరియు సహజవనరులు యాజమాన్య కేంద్రాలు సంయుక్తంగా తెలంగాణ రాష్ట్రంలో గత అక్టోబర్-నవంబర్ మాసాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న అనేక మంది అధికారులు మరియు సిబ్బందికి జియో ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ అవార్డు ద్వారా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ అందించిన శిక్షణా కార్యక్రమాలను దేశవ్యాప్త ప్రత్యేక గుర్తింపు లభించింది.

## పంచాయతీరాజ్ శాఖలో 100 శాతం నగదురహిత లావాదేవీలకు కృషి

సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే 100 శాతం నగదు రహిత లావాదేవీలు జరిపే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపేందుకు సహకరించాలని బ్యాంకింగ్, పోస్టల్ అధికారులకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివ ృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. జనవరి 10 నాటికి నగదురహిత లావాదేవీలను పంచాయతీరాజ్ శాఖలో 100 శాతం అమలుచేసేందుకు సచివాలయంలో బ్యాంకర్లు, పోస్టల్ అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశం నిర్వహించారు. జనవరి 10 నాటికి 100 శాతం నగదు రహిత లావాదేవీలు జరిపేలా కార్యచరణ సిద్ధం చేశారు. 100 శాతం నగదు రహిత లావాదేవీల అమలు కోసం బ్యాంకర్లు, అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల 96 వేల ఆసరా పించన్ల పంపిణీ ప్రతి నెల జరుగుతుందని, ఇందులో 17 లక్షల 81 వేల పింఛన్లను పోస్టాఫీసుల ద్వారా... 13 లక్షల 63 వేల పించన్లను బ్యాంకుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మరో 4 లక్షల 52 వేల లబ్ధిదారులకు పింఛన్లను నేరుగా నగదు రూపంలో అందజేస్తున్నట్లు వివరించారు. వీరందరికి డిసెంబర్ 31లోగా బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలో దాదాపు 5వేల గ్రామపంచాయతీల్లో బ్యాంకు శాఖలు లేవని, ఈ గ్రామాల్లో బిజినెస్ కరస్పాండెట్లను ఏర్పాటు చేసి 100 శాతం ప్రజలకు ఖాతాలు ఉండేలా చర్యలు తీసుకొనేందుకు బ్యాంకర్లు అంగీకరించినట్లు తెలిపారు. రెండు గ్రామాలను ఒక్కో బ్యాంకు శాఖ దత్తత తీసుకుని డిసెంబర్ 31 లోపు అందరికి ఖాతా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. అలాగే జనవరి 10 లోపు ఖాతాలను ఆధార్ సీడింగ్ చేయడంతో పాటు రూపే కార్డులను అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆసరా పించన్ దారులకు, ఉపాధిహామీ కూలీలందరికి జనవరి 10 నుండి పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ ద్వారా డబ్బులు చెల్లించాలని నిర్ణయించామన్నారు. బ్యాంక్ ఖాతా ఉన్నవారందరికి రూపే కార్డులను అందచేయడంతో పాటు... గ్రామపంచాయతీల్లో స్వైపింగ్ మిషన్ లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. తద్వారా గ్రామాల్లో అన్ని పన్నులను నగదు రహితంగా చెల్లించే అవకాశం ఖాతాదారులకు కలుగుతుందని వివరించారు. జనవరి 10 నుంచి పూర్తి స్థాయిలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, కార్డు లావాదేవీలు, పీఓఎస్ ల మిషన్ ల వాడకాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని బ్యాంకర్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఇక రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండేలా కార్యచరణ సిద్ధం చేసినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దాదాపు 20 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం ఇప్పటికే జరిగిందని... రానున్న రెండేళ్లలో 27 లక్షల కుటుంబాలకు మరుగుదొడ్ల నిర్మాణం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2018 అక్టోబర్ 2 లోగా తెలంగాణలో 100 శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసి, దేశంలోనే 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేసిన తొలి అతిపెద్ద రాష్ట్రంగా తెలంగాణను నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్, ఉపాధిహామీ ద్వారా అన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇంకుడు గుంతల నిర్మాణానికి కార్యచరణ సిద్ధం చేశామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా స్త్రీ నిధి బ్యాంకు ద్వారా అడ్వాన్స్ గా లోన్ ఇప్పించే ఆలోచన కూడా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయిన తరువాత చెల్లించే వెసులుబాటు కల్పించనున్నట్లు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్, పోస్టల్, టీసీఎస్ అధికారులతో పాటు స్పెషల్ సీఎస్ ఎస్పీసింగ్, కమిషనర్ నీతూకుమారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకు పాలన



ప్రదీప్‌చంద్ర

పరిపాలనను ప్రజలకు మరింత చేరువగా తీసుకువెళతామని రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర చెప్పారు. జిల్లాల విభజన అనంతరం ఏదైనా ఫిర్యాదు వస్తే కలెక్టర్లు గంటలోగా ఆ గ్రామాలకు వెళుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులను మరింత క్రియాశీలకంగా పనిచేయిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికడతామని, ప్రజాసేవలన్నీ ఆన్‌లైన్ చేయటం, సిటిజన్ చార్టర్ రూపొందించడం వంటి చర్యలు తీసుకుంటామని వివరించారు. నూతన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్‌చంద్ర ఈ విధంగా మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర చెప్పారు. ఏ స్థాయిలో అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే రాజకీయ అవినీతిని అరికట్టారని, ఫలితంగా సచివాలయం వైపు పైరవీకారులు రావడం లేదన్నారు. ఈ స్ఫూర్తితో ఇక క్షేత్రస్థాయికి వెళతామని చెప్పారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ప్రజలు దరఖాస్తు చేసుకుంటే సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్ణీత సమయంలోగా ఆ వినతులు పరిష్కరించేలా కార్యాచరణచేపడతామన్నారు.

**పాలన సులువైంది..**

జిల్లాల ఏర్పాటుతో జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోల పరిధి మూడవ వంతు తగ్గిందని ఆయన తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను విచారించి పరిష్కరించడం, ఫీల్డ్ విజిట్ చేయడం అధికారులకు ఇప్పుడు సులువైందని అన్నారు. పాత జిల్లాలు ఉన్నప్పుడు వారం వారం గ్రీవెన్స్ సెల్‌కు 500 ఫిర్యాదులు వస్తే వాటిని మానిటరింగ్ చేయడం కష్టంగా ఉండేదన్నారు. ఇప్పుడు పరిధి తక్కువ ఉండటంతో చాలా తక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని వెంటనే విచారించి పరిష్కరించడం సులువవుతున్నదని అన్నారు. కలెక్టర్ ఒక్క రోజులోనే జిల్లా అంతా పర్యటించి వస్తున్నారని వివరించారు. ఏ గ్రామం నుంచైనా ఫిర్యాదు వస్తే విచారణ చేయడానికి గంటలో సదరు గ్రామానికి వెళ్లగలుగుతున్నామని జిల్లా కలెక్టర్లు స్వయంగా తనకు చెప్పారని ప్రదీప్ చంద్ర వివరించారు.

**ఎఫెక్టివ్‌గా ప్రభుత్వ కార్యక్రమాలు ..**

కొత్త జిల్లాలు వచ్చాయి. 10 పెద్ద జిల్లాలు పోయి 31 చిన్న చిన్న జిల్లాలు వచ్చాయి. అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే పరిస్థితి వచ్చింది. సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ సులువైంది. అందువల్ల ప్రభుత్వ కార్యక్రమాలు మరింత ఎఫెక్టివ్‌గా అమలు చేస్తాం అని ప్రదీప్ చంద్ర అన్నారు. సీఎం కేసీఆర్ పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల స్కీమ్, ఇంటింటికి తాగునీటిని అందించే మిషన్ భగీరథ, అలాగే చెరువుల పునరుద్ధరణకు మిషన్ కాకతీయను అమలు చేస్తున్నారని, సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం భారీ ఎత్తున చేపట్టారని అన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ అమలులో ఉన్నాయని. వీటన్నింటినీ త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇందుకోసం పరిపాలనా యంత్రాంగాన్ని, ఇంజినీర్లను సమన్వయం చేసుకొని ముందుకు వెళతామన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకమైన భూసేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ల ద్వారా వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

**సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం..**

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ అర్హులైన పేదలకు అందేలా కృషి చేస్తామని ప్రదీప్ చంద్ర చెప్పారు. పరిపాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తామని, అర్హులైన వారికే లబ్ధి చేకూరేలా పర్యవేక్షణ పెంచుతామని తెలిపారు. ముఖ్యంగా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల మీద దృష్టి పెడుతామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తగిన విధంగా ప్రభుత్వ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళిత కుటుంబాలకు భూమి పంపిణీ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

**నగదు కొరతను అధిగమించడానికి..**

రాష్ట్రంలో నోట్ల కొరత తీవ్రంగా ఉందని సీఎస్ చెప్పారు. దీనిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అధిగమించాల్సిందే తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్ చొరవ చేసి ప్రధానితో మాట్లాడి రాష్ట్రానికి నోట్ల సరఫరా పెంచాలని కోరారని చెప్పారు. నోట్ల అంశంపై ఎప్పటికప్పుడు కేంద్రంలో సంప్రదింపుల కోసం ఒక అధికారుల బృందాన్ని నియమించాలని ఆదేశించారని, ఆ మేరకు ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారని వివరించారు. ప్రింటింగ్ సమస్య వల్ల రాష్ట్రానికి అనుకున్న మేర నోట్లు అందటం లేదని చెప్పారు. మరింత నగదు పంపాలంటూ రెగ్యులర్‌గా రిజర్వు బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్నామని వెల్లడించారు. సీఎం కేసీఆర్ సూచన మేరకే ప్రధాని మోదీ వివిధ రాష్ట్రాల సీఎంలతో కమిటీ వేశారని చెప్పారు. రాష్ట్రంలో నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని, గ్రామ స్థాయిలో ఈ విధానాన్ని ప్రోత్సహించడానికి, నగదు కొరత ఇబ్బందులను పరిష్కరించడానికి సురేశ్‌చంద్ర నేతృత్వంలో అధికారుల కమిటీతో అధ్యయనం చేయించారని చెప్పారు. ఈ కమిటీ ప్రాథమిక నివేదిక ఇచ్చిందని, ఇంకా కసరత్తు జరుగుతున్నదని వివరించారు. గ్రామాల్లో నగదురహిత లావాదేవీలు జరుగాలంటే

స్మార్ట్‌ఫోన్లు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే వారికి అవగాహన కల్పించేందుకు భారీ ప్రచారం కూడా అవసరమన్నారు. నోట్ల రద్దుతో ప్రభుత్వంపై ఎంత ఆదాయం తగ్గిందనేది ఈ నెలాఖరుకు తెలుస్తుందన్నారు. రవాణశాఖ సమాచారం ప్రకారం ద్విచక్రవాహనాల అమ్మకాలు బాగా తగ్గాయని, గతంలో రోజుకు 300 అమ్మితే ఇప్పుడు వంద కూడా విక్రయించడం లేదని, ఇది ఆ శాఖ ఆదాయం మీద ప్రభావం చూపుతుందని అన్నారు.

**విభజన సమస్యలపై..** షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యల పరిష్కార ప్రక్రియను ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న రాజీవ్‌శర్మ చాలా ముందుకు తీసుకువెళ్లారు..కొన్ని చివరి దశకు వచ్చాయి..వీటిని పూర్తి చేయాల్సి ఉన్నదని ఆయన చెప్పారు. ఉద్యోగుల సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయని చెప్పారు. సీనియార్టీపై కోర్టు కేసుల కారణంగా డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ల విభజన పూర్తి కాలేదని, అవికూడా త్వరలో పూర్తి అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో పురోగతి చాలా బాగా ఉందని అన్నారు. టీఎస్ ఐపాస్‌ను చాలా సమర్థంగా ముందుకు తీసుకువెళతామని, ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకుంటామని అని ప్రదీప్ చంద్ర తెలిపారు. ●



# టిసిపార్డు నందు జండర్ గవర్నెన్స్‌పై వర్క్‌షాప్

తెలంగాణ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ (TSIPARD) నందు జండర్ రిసోర్స్ గవర్నెన్స్ పై ఒకరోజు వర్క్ షాప్ ను ఆ సంస్థ టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ బి. నరేంద్రనాథ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థను దేశంలోనే ఉన్నత శిక్షణ సంస్థగా పంచాయతీ రాజ్ శాఖ గుర్తించి ఈ ప్రాజెక్టు టిసిపార్డుకు ఇవ్వడం జరిగిందన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రాజెక్టు క్రింద మహిళ ప్రతినిధులకు నాయకత్వ అభివృద్ధి పై శిక్షణ ఇవ్వడం జరగుగుందని జె.డి వివరించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ధైర్యంగా స్థానిక సంస్థల్లో చురుకుగా పాల్గొనేట్లు తీర్చిదిద్దాలని చెప్పారు. పంచాయతీరాజ్ వ్యవస్థలోని మూడు స్థాయిల్లో 50% రిజర్వేషన్ ద్వారా వచ్చినమహిళలు తమ కుటుంబ సభ్యుల సహకారంతో కార్యదీక్షతో పనిచేస్తూ మంచి ఫలితాలు సాధించి ముందుకు నడవాలి అని అభిలిషించారు.

అంతకు ముందు యు.ఎన్. మహిళా ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో వెనకబడిన జిల్లాలైన మహబూబ్ నగర్ నుండి చిన్న చింతకుంట గ్రామంను, అదిలాబాద్ జిల్లా నుండి ఇంద్రవెల్లి గ్రామంను ఎంపిక చేసుకొని మహిళా ప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని మహిళా శిక్షణ సంక్షేమ సెంటర్ హెడ్ శ్రీమతి కుసమ మాధురి తెలిపారు.

మహిళ ప్రతినిధులు చొరవతో తమ విధులను బాధ్యతలను పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలలో పాల్గొని నియామాలు గైకొను విధంగా తీర్చిదిద్దవలసి అవసరం వుందని అన్నారు. మహిళలు వారి కుటుంబ పురుషుల యొక్క సహకారంతో తమకార్యసాధనను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నట్లు వారు చేసిన సర్వేలో వెల్లడయిందని శ్రీమతి మాధురి పేర్కొన్నారు. ఈ "జండర్ రిసోర్స్ గవర్నెన్స్" శిక్షణను టిసిపార్డు మరియు నార్వే ప్రభుత్వ సహకారంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు బండారి భాస్కర్, మరియు ఇతర ప్రతినిధులు యుఎన్ ప్రాజెక్టులు సంబంధిత అధికారులతో పాటు టిసిపార్డు కేంద్రాల ప్రతినిధులు ఈ వర్క్‌షాప్ లో పాల్గొన్నారు.





# పాడిపరిశ్రమ అభివృద్ధి చెందిన నాడే రాష్ట్రంలో రైతాంగం సుభిక్షంగా ఉంటుంది

రాష్ట్రంలోవ్యవసా రంగానికి సమాంతరంగా పశుసంపద, పాడిపరిశ్రమ అభివృద్ధి చెందిన నాడే రాష్ట్రంలోని రైతాంగం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధక మత్య పాడి పరిశ్రమ అభివృద్ధి మరియు సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడినతరువాత పశుసంవర్ధక శాఖ మంత్రి టిఎస్ ఎల్ డిఏ టిఏ పై సమీక్ష నిర్వహించారు. పల్లెలో నివాసం ఉంటున్న ప్రజలు పాడి పరిశ్రమ రంగం పై ఆధాపడి జీవిస్తున్న సయమంలో



పాల ఉత్పత్తిని వృద్ధి చేసే క్రమంలో చేపట్టాల్సిన చర్యలు టిఎస్ ఎల్ డిఏ ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలపై సుదీర్ఘ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా టిఎస్ ఎల్‌డిఏ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలైన కృత్రిమ వీర్య ఉత్పత్తి మరియూ తద్వారా పశుగణాభివృద్ధి చేయడం ద్వారా పాల ఉత్పత్తిని మెరుగు పర్చడం తదితర అంశాలపై ఆశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కరీంనగర్ లో ఉన్నకృత్రిమ వీర్య ఉత్పత్తి కేంద్రాన్ని 10కోట్ల రూపాయల ఖర్చుతో మరింత అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాడానికి చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. వీర్యం యొక్క నాణ్యతను పరీశీలించిన పిదప కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలకు వినియోగించే ఆవశ్యకతను మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసారు. ఒక ఆండ్రాలజీ ల్యాబ్ ను ఏర్పాటు చేయాలని, ఆయన అధికారులను ఆదేశించారు. జాతీయ ఆవులు, గేదెలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో 16కోట్ల వ్యయంతో నిర్మిచతల పెట్టిన కృత్రిమ వీర్య ఉత్పత్తి కేంద్రానికి షాద్ నగర్ జిల్లా కంసాన్ పల్లిలో త్వరఓ శంఖుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణా రాష్ట్రంలో ఆవులు, గేదెలను అభివృద్ధి పరిచే దిశలో ప్రత్యేకంగా చేపట్టాల్సిన చర్యలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలన్నారు. గోపాల మిత్రలలో జవాబుదారీతనం పెరగడానికి, వారు పాలు పంచుకుంటున్న కృత్రిమ గర్భధారణ కార్య క్రమాలకు సంబంధించిన నివేదికలను ప్రతినిత్యం తెలప్పించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో 2083పశు వైద్య కేంద్రాలలో కృత్రిమ గర్భధారణ సదుపాయానికి అదనంగా సుమారు 1288 అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి పశుగణాభివృద్ధి సంస్థ కృషిచేస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల పశుగణాభివృద్ధి సంఘ అధ్యక్షులను వారి జిల్లాల్లో పర్యటనలు చేసి గ్రామాలలో పశు గణాభివృద్ధికి చేపడుతున్న చర్యలను పశుసంవర్ధక శాక అధికారులతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు జిల్లాలో విస్తృత ప్రచారం కల్పించి అర్హులైన లబ్ధిదారులకు ఉపయోగ పడటానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టాలిని మంత్రి వారికి సూచించారు. పశుసంవర్ధకశాఖలో మరియు పశుగణాభివృద్ధి సంస్తలో ఉన్న ఖాళీల బర్తీ చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజయడెయిరీ పాలకిఎంతో డిమాండ ఉందని, డిమాండ కు తగిన విధింగా పాలసేకరణ జరపాలని వాటిద్వారా తయారు చేసే పదార్థాలను విక్రయించడానికి ఉన్న మార్కిటింగ్ సదుపాయాలను అభివృద్ధి పర్చడం చేయాలని మంత్రివారికి సూచించారు. తెలంగాణా విజయ డెయిరీకి సంబంధించిన ఉత్పత్తులకు మరింత ప్రచారంకోసం మీడియా ప్రణాళికను తయారు చేయాల్సిందిగా ఆయన అధికారును ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న సిబ్బందికి అదనంగా క్యాంపస్ రిక్రూట్ మెంట్ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో అవసరమున్న చోట్ల నియామకాలు జరుపుకోవాలని మంత్రి సూచించారు. విజయ డెయిరీకి పాలు అందించే రైతులకు చెల్లించే బకాయిలు, ఇన్సెంటివ్ ల విషయంలో ఎలాంటి ఆందోళణలకు గురికావద్దని రైతులకు ఇవ్వాల్సింది ప్రతి పైసా సకాలంలో చెల్లించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. లీటర్ పాలకు 4రూపాయల చొప్పున ఇన్సెంటివ్ క్రింద ఇప్పటి వరకు 70కోట్ల రూపాయలు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ ప్రిన్సిపాల సెక్రటరీ సురేష్ చందా, విజయడెయిరీ ఎండీ నిర్మల, పశుసంవర్ధకశాఖ డైరక్టర్ వెంకటేశ్వర్లు, టిఎస్ ఎల్ డిఏ ఛైర్మన్ రాజేశ్వరరావు, ఆయా జిల్లాల పశుగణాభివృద్ధి సంఘుల అధ్యక్షులు పాల్గొన్నారు. •

# happy holidays

# 2017 ప్రభుత్వ సెలవులు

తెలంగాణ ప్రభుత్వం 2017 సంవత్సరంలో ప్రభుత్వ సెలవులను ప్రకటించింది. ఈ మేరకు సాధారణ పండుగ సెలవులు, ఐచ్ఛిక సెలవుల వివరాలను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

| సంఖ్య | పండుగలు | తేదీ | రోజు |
|---|---|---|---|
| 1. | భోగి | 13.01.2017 | శుక్రవారం |
| 2. | రిపబ్లిక్ డే | 26.01.2017 | గురువారం |
| 3. | మహాశివరాత్రి | 24.02.2017 | శుక్రవారం |
| 4. | ఉగాది | 29.03.2017 | బుధవారం |
| 5. | వార్షిక ఖాతాలముగింపు | 01.04.2017 | శనివారం |
| 6. | శ్రీరామనవమి/ బాబూ జగ్జీవన్‌రాంజయంతి | 05.04.2017 | బుధవారం |
| 7. | గుడ్‌ఫ్రైడే/అంబేద్కర్‌జయంతి | 14.04.2017 | శుక్రవారం |
| 8. | మేడే | 01.05.2017 | సోమవారం |
| 9. | రంజాన్ | 26.06.2017 | సోమవారం |
| 10. | శ్రీకృష్ణాష్టమి | 14.08.2017 | సోమవారం |
| 11. | ఇండిపెండెన్స్ డే | 15.08.2017 | మంగళవారం |
| 12. | వినాయక చవితి | 25.08.2017 | శుక్రవారం |
| 13. | బక్రీద్ | 02.09.2017 | శనివారం |
| 14. | దురాష్టమి | 28.09.2017 | గురువారం |
| 15. | విజయదశమి/దసరా | 30.09.2017 | శనివారం |
| 16. | మహాత్మాగాంధీజయంతి | 02.10.2017 | సోమవారం |
| 17. | బోనాలు | 10.07.2017 | సోమవారం |
| 18. | దీపావళి | 18.10.2017 | బుధవారం |
| 19. | కార్తీకపూర్ణిమ/ గురునానక్‌జయంతి | 04.11.2017 | శనివారం |
| 20. | ఈద్‌-మిలాదున్ నబీ | 01.12.2017 | శుక్రవారం |
| 21. | క్రిస్మస్ | 25.12.2017 | సోమవారం |
| 22. | బాక్సింగ్‌డే | 26.12.2017 | మంగళవారం |

**రెండవ శనివారం, ఆదివారం వచ్చిన పండుగలు**

| | | | |
|---|---|---|---|
| 1. | సంక్రాంతి | 14.01.2017 | శనివారం |
| 2. | హోళీ | 12.03.2017 | ఆదివారం |
| 3. | మొహర్రం | 01.10.17 | ఆదివాకం |

**ప్రభుత్వ విద్ధిక (అప్షనల్ సెలవులు ఇలా ఉన్నాయి**

| | | | |
|---|---|---|---|
| 1. | యాజ్ దహమ్‌షరీఫ్ | 10.01.2017 | మంగళవారం |
| 2. | శ్రీపంచమి | 01.02.2017 | బుధవారం |
| 3. | హజరత్ అలీ జయంతి | 11.04.2017 | మంగళవారం |
| 4. | సాహెబ్ ఈ-మిరాజ్ | 25.04.2017 | మంగళవారం |
| 5. | బసవజయంతి | 28.04.2017 | శుక్రవారం |
| 6. | బుద్ధపూర్ణిమ | 10.05.2017 | బుధవారం |
| 7. | సహెబ్ ఈ-భరత్ | 12.05.2017 | శుక్రవారం |
| 8. | బసవ జయంతి | 16.06.2017 | శుక్రవారం |
| 9. | జుమ-అతుల్-వడ/ సాహెబ్ ఈ ఖతర్ | 23.06.2017 | శుక్రవారం |
| 10. | వరలక్ష్మీవ్రతం | 04.08.2017 | శుక్రవారం |
| 11. | రాఖీ పౌర్ణమి/ శ్రావణ పూర్ణిమ | 07.08.2017 | సోమవారం |
| 12. | పార్సి న్యూ ఇయర్ డే | 17.08.2017 | సోమవారం |
| 13. | మహార్‌నవమి | 29.09.2017 | శుక్రవారం |
| 14. | నరక చతుర్థి | 17.10.2017 | మంగళవారం |
| 15. | అర్బయీన్ | 10.11.2017 | శుక్రవారం |

**రెండవ శనివారం, ఆదివారం వచ్చిన ఐచ్ఛిక సెలవులు**

| | | | |
|---|---|---|---|
| 1. | న్యూఇయర్ | 01.01.2017 | ఆదివారం |
| 2. | కనుమ | 15.01.2017 | ఆదివారం |
| 3. | హజ్రత్‌సయ్యద్ మహ్మద్ జువాన్‌పురి/ మెహది జయంతి | 11.02.2017 | శనివారం |
| 4. | మహావీర్‌జయంతి | 09.04.2017 | ఆదివారం |
| 5. | రథయాత్ర | 25.06.2017 | ఆదివారం |
| 6. | ఈద్‌-ఎ-ఘదీర్ | 10.09.2017 | ఆదివారం |
| 7. | క్రిస్మస్‌ఈవ్ | 24.12.2017 | ఆదివారం |



# బాలల హక్కులను కాపాడుదాం

ప్రపంచ జనాభాలో మూడోవంతు పిల్లలే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. నేటి బాలలే రేపటి మానవాళికి భవిష్యత్. కనుక జీవితం, ఆరోగ్యం, విద్య, శ్రేయస్సు తదితర అంశాలలో పెద్దల హక్కులకంటే బాలల హక్కులకు అధిక ప్రాధాన్యత ఇవ్వగలగాలి. అందుకోసమే 1942 వ సంవత్సరంలో నానాజాతి సమితి బాలల హక్కులను గుర్తించి పిల్లల బానిసత్వానికి, బాల కార్మిక వ్యవస్థకు, పిల్లల వ్యభిచారానికి, విక్రయానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేయటం జరిగింది. అదే విధంగా 1979 వ సంవత్సరాన్ని అంతర్జాతీయ బాలల సంవత్సరంగా ప్రకటించింది. 1989 వ సంవత్సరం నవంబరులో బాలల హక్కుల పరిరక్షణపై సమావేశం నిర్వహించి ప్రతి సంవత్సరం నవంబరు 20 వ తేదీని బాలల హక్కుల పరిరక్షణ దినంగా పాటించటం జరుగుతుంది. మన దేశం కూడా 1992 వసంవత్సరంలో బాలల హక్కుల కన్వెన్షన్ పై సంతకం చేయటం జరిగింది. దీనిని మానవజాతి చరిత్రలోనే ఒక మైలురాయిగా పేర్కొంటారు. బాలలకు ఇవ్వాల్సిన గౌరవం, రక్షణ, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు అన్నీ ఇందులో పొందుపరిచారు. ఇందులో మొత్తం 54 నిబంధనలున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన ఈ హక్కులపై మొత్తం 160 దేశాలు సంతకాలు చేశాయి.

మన దేశంలో బాలల హక్కులు వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బాలల సంక్షేమ కమిటీ తన విస్తృత అధికారాలతో పనిచేస్తూ బాలల సంరక్షణకు వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత కల్పిస్తూ బాలల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయటం జరుగుతుంది. ఈ కమిటీ బాలల హక్కుల పరిరక్షణలో నిర్మాణాత్మకమైన ధోరణితో పనిచేయటం జరుగుతుంది. బాలల హక్కులను అమలు పరిచేందుకు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి బాలల హక్కులను గుర్తించటం జరిగింది.

**బాలల హక్కులు:** 18 సంవత్సరాలలోపు బాలలందరికీ ఈ హక్కులు వర్తిస్తాయి. బాలల ప్రయోజనాలు, బాలల హక్కుల కార్యాచరణకు చేపట్టినప్పుడు వారి సంపూర్ణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవాలి. హక్కుల అమలుకై తీర్మానాలు, గుర్తించిన హక్కుల అమలుకు శాసనపరమైన, పాలనాపరమైన కార్యక్రమాలు చేపట్టాలి. అవసరమైతే అంతర్జాతీయ సహకారం పొందాలి. బాలలకు విజ్ఞానాన్ని అందించడానికి ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. బాలలకు సంబంధించిన హక్కులు ఈ క్రింది విధంగా ఉన్నాయి అవి.

1. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండే హక్కు
2. నాణ్యమైన ఉచిత విద్యపొందే హక్కు
3. వినోదం పొందే హక్కు, ఆడుకునే హక్కు
4. పరిశుభ్రమైన త్రాగునీరు పొందే హక్కు
5. పోషకాహారం పొందే హక్కు
6. గౌరవాన్ని పొందే హక్కు
7. సమానత్వపు హక్కు
8. భావవ్యక్తీకరణ హక్కు
9. సమాన విద్యావకాశాలు పొందే హక్కు
10. స్వేచ్ఛగా ఆలోచించే హక్కు
11. మానసిక, శారీరక వేధింపుల నుంచి విముక్తి పొందే హక్కు
12. ప్రేమ, ఆప్యాయతలను పొందే హక్కు
13. సామాజిక భద్రత పొందే హక్కు

పై విధంగా బాలలు తమ హక్కులను పొందే అవకాశం కలదు. అయితే మన దేశంలో సుమారు 50 శాతం మంది బాలలకు సరైన పోషకాహారం లభించటం లేదు. లింగవివక్ష వల్ల ప్రతి ఆరుగురిలో ఒక బాలిక మరణానికి గురవుతుంది. అంతే కాకుండా రెండు సంవత్సరాలలోపు శిశువులలో 58 శాతం మందికి పూర్తిగా వాక్సినేషన్ అందటం లేదు. మనదేశంలో 25-30 మిలియన్ల వరకు బాల కార్మికులున్నారని "ఇంటర్నేషనల్ సెంటర్ ఆన్ లేబర్" తన నివేదికలో పేర్కొనటం జరిగింది. నేడు మనదేశంలో 18 సం॥లోపు ఉన్నవారి సంఖ్య 45 కోట్లు. ఇటువంటి యువతరాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచి ఆరోగ్యకరమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

అందుకోసం ప్రభుత్వాలు బాలల హక్కుల రక్షణకై శిశు సంరక్షణాలయాలను నిర్వహించాలి. పిల్లలను ఎవరైనా హింసించినా, దౌర్జన్యం చేసినా, వేధించినా నేరం. బాలలను రక్షించేందుకు ప్రభుత్వాలు రక్షణ చర్యలు చేపట్టాలి. పుట్టినప్పటి నుంచి వారికి జాతీయత కలిగివుండటం, తల్లిదండ్రులలో కలసి జీవించటం బాలల హక్కు. అలాగే బాలలను ఎవరైనా అక్రమంగా రవాణా చేయటం, వ్యభిచార వృత్తిలోకి దించటం నేరం. బాలలు తమకు నచ్చిన మతాన్ని కలిగివుండవచ్చు. శరణార్థులుగా మారిన బాలలకు మానవతతో సాయం చేయాలి. మానసికంగా, శారీరకంగా, వికలాంగులైన వారి వృద్ధికి, వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

నేటి సమాజంలో మనమందరం కూడా చిత్తశుద్ధితో సమానత్వం గురించి, మానవ హక్కుల గురించి, వాటిని కోర్టుల ద్వారా రక్షించుకునే హక్కు-అవకాశం వంటి వాటిని భోధనలో భాగంగా చేసి భావి భారత పౌరులను పక్కవాడి హక్కులను కూడా గౌరవించే విధంగా తీర్చిదిద్దాలి. అదే విధంగా మనమందరం కూడా బాలలందరికీ సకాలంలో వాక్సినేషన్ ఇప్పించాలి. సరైన విద్యను అందించేందుకు కృషిచేయాలి. సమాజంలో అందరం కూడా బాలల సంక్షేమం తమ సంక్షేమంగా భావించాలి. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే నినాదంతో మంచి జీవితాన్ని, ఆరోగ్యకరమైన జీవితాన్ని వారికి ఇవ్వగలగాలి. అందుకోసం మనవంతు సాయంగా బాలల హక్కులను కాపాడుదాం.

**-చల్లా దేవి, పరిశోధకులు, ఖమ్మం జిల్లా**

# బాలికా విద్యా ప్రాముఖ్యత



నేటి మన సమాజంలో బాలికా విద్య యొక్క ప్రాముఖ్యను స్త్రీలలో మరియు కుటుంబంలో ఒక అవగాహన కల్పించి బాలికా విద్యను ఒక సామాజిక సమస్యగా పరిగణించగలగాలి. అంతేకాకుండా నేడు మహిళలు ప్రస్తుతం సమాజంలో ఏ విధంగా రాణిస్తున్నారో, అన్ని రంగాలలో అందివచ్చిన అవకాశాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో వారికి అర్థమయ్యే విధంగా తెలియచేసే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలి. బాలికలకు విద్య అనేది స్థాయి, ప్రమాణాలను పెంపొందిస్తుందని క్రమంగా సమాజంలో అవకాశాలను మెరగు పరుస్తుందని ఇది క్రమేసి కుటుంబ వ్యవస్థపై ప్రభావ వంతంగా పనిచేస్తుందని తెలియచేయగలగాలి. స్త్రీలు నిరక్షరాస్యులైతే వారికి పుట్టుబోయే బిడ్డ యొక్క ఆలనా పాలన, వారికి అందించగలిగే పౌష్టికారం సక్రమంగా అందించడానికి కూడా వారికి సరైన అవగాహన ఉండదు అనేది బాలికలకు అర్థమయ్యే విధంగా చెప్పగలగాలి.

ఇటీవల కాలంలో ప్రపంచ దేశాలలో యువత ముఖ్యంగా బాలికల పురోగతిలో భారతదేశం అత్యంత పురోగతి సాధించిందని ఐక్యరాజ్య సమితి జనాభా నిధికి (యు.యన్.యఫ్.పి.ఎ.) తెలియచేసింది. వీరి యొక్క అభిప్రాయంలో 'బాలికలకు హాని చేసే వారి హక్కులను కాలరాసే ఆచారాలు పదేళ్ళ వయస్సులోనే ఆరంభమవుతున్నాయని, అవి పెద్దాయ్యాక వారి శక్తి సామర్థ్యాలను గుర్తించలేని విధంగా తయారుచేస్తున్నాయని వాటిని నివారించడానికి ప్రపంచ దేశాలు ఎంతో కృషి చేయాలని" నివేదించారు.

అయితే మన దేశంలో బాలికల భవిష్యత్‌ను మెరుగుపరుచుకొనేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయని, ప్రపంచ దేశాలకు మన దేశం ఒక ఆదర్శవంతంగా వుంటుందని పేర్కొన్నారు. కాని అదే సమయంలో బాలికల విద్య పట్ల అనగా సెంకడరీ విద్య వారికి దూరమవుతుందని సూచించింది. ప్రస్తుతం మన దేశంలో పదేళ్ళ వయస్సు బాలికలు 1.2 కోట్లకుపైగా వున్నారని ఇది ఇతర దేశాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ శాతం మంది ప్రాథమిక విద్యతోనే ఆపి వేస్తున్నారని కనీసం సెంకడరీ విద్య వరకు కూడా వెళ్ళటం లేదని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం పేదరికం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పురాత కాలం నుంచి వస్తున్న ఆచారాలు అలవాట్లు. ప్రస్తుతం మనదేశంలో పదేళ్ళ వయస్సు పిల్లలు 12.5 కోట్ల మంది ఉండగా వీరిలో 6 కోట్ల మంది బాలకలు ఉన్నారు. వీరందరూ కూడా ప్రాథమిక విద్యతోనే ఆగిపోతున్నారని బాలురతో పోటిగా ఉన్నత చదువులను నోచుకోవటం లేదు. ఎక్కడో కొంత మంది మాత్రమే ఉన్నత విద్య అభ్యసించడానికి వస్తున్నారు. ఇది పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా వుంది. దీనివల్ల బాలికల్లో శారీరక, మానసిక ఆరోగ్య ఎదుగుదలలో పూర్తిగా వెనుకబడి వుంటున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గటం వల్ల లైంగిక సమానత్వం సాధించాలనే దిశగా అడుగులు వేయటం వల్ల ముందు ముందు తరాలలో పదేళ్ళ వయస్సు బాలికల యొక్క పాత్ర గణనీయంగా ఉంటుందనటంలో సందేహం లేదు. ప్రభుత్వాలు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు ఆ దిశగా ఆలోచిస్తాయనటంలో అతిశయోక్తి కాదు.

**బాలికా విద్య విశిష్టత:-**

మనకు సాత్వంత్రం రాకపూర్వం బాలికా విద్య పట్ల అంతగా అవగాహన లేకపోవటం, సమాజంలో వారికి సరైన గౌరవం, సమానత్వం లేకపోవటం చేత బాలిక విద్య యొక్క ప్రాముఖ్యత లేకుండా పోయింది. నాటి సమాజం స్త్రీలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేకపోయింది. కాని మారుతున్న పరిస్థితులు వల్ల సమాజం స్త్రీ విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి స్త్రీలు విద్యవంతులైతే ఆ కుటుంబ మరియు వారితో పాటుగా సమాజం బాగుపడుతుందని భావించటం జరిగింది. అందులో భాగంగానే స్వాతంత్ర సమయములో అనేక మంది స్వాతంత్ర్య సమార యోధులు స్త్రీ విద్య పట్ల ఎక్కువ మక్కువ చూపటం జరిగింది. వారిలో రాజారామమోహన రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు గారు మరియు సరోజిని నాయడు, గుర్గాభాయి దేశ్‌ముఖ్ వంటి వీర వనితలు స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, దురాచారాలు, బాల్య వివాహాలను నిర్మూలించేందుకు తమ వంతు కృషి చేయటం జరిగింది.

నాటి సమాజంలో వేళ్ళూనుకున్న బాల్య వివాహాలును నిర్మూలించి వితంతు వివాహాలను ప్రోత్సహించటం జరిగింది. క్రమక్రమేన స్వాతంత్ర అనంతరం సమాజంలో కొంత మార్పులు చోటు చేసుకుని ప్రభుత్వాలు, పాలకుల బాల్య వివాహాలను నిర్మూలించటం, స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని సాటిచెప్పేందుకు స్త్రీ విద్యను ప్రోత్సాహించటం జరిగింది. వాటిని దృష్టిలో ఉంచుకుని మన దేశంలో బాలిక విద్యను ప్రాథమిక హక్కులలో భాగంగా చేయటం జరిగింది.

**బాలిక విద్య – ఒక సామాజిక సమస్య:–**

నేటి సమాజంలో బాలికా విద్య అనేది ఒక సామాజిక సమస్యగా పరిగణించాలి. ఎందుకంటే వారికి సమాజంలో జరుగుతున్న పరిణామాలపై ఒక అవగాహన ఏర్పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఎదో ఒకటి కంటితుడుపుగా బాలికలకు అనేక ప్రత్యేక పథకాలు ఏర్పాటు చేస్తున్నారు. వారికి కనీస అవసరాలను తీర్చ గలిగితే బాలికా విద్య అనేది అభివృద్ధి చెందుతుంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో పాటుపడుతున్నాయి. కాని వారికి చదువుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి కుటుంబ నేపద్యాన్ని మార్చలేకపోతున్నారు. మన తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో అనేక నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లలు 10 ఏళ్ళ వయస్సు నుంచి వారి యొక్క కుటుంబ బాధ్యతను భుజానవేసుకుని కూలి పనులకు వెళుతున్నారు. దాంతో వచ్చే చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను వెల్లదీస్తున్నారు.

కావున బాలికా చదువును ఒక సామాజిక సమస్యగా గుర్తించి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు వివిధ రూపాలలో సమర్థవంతంగా పనిచేసి బాలికా విద్య యొక్క ప్రాముఖ్యతను, నేటి సమాజంలో స్త్రీలు ఏ విధంగా అభివృద్ధి వైపు దూసుకువెళుతున్నారో తెలియచేసేందుకు గాను గ్రామీణ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పటిష్టంగా నిర్వహించగలిగితే ఈ సమస్యను అధిగమించగలం. అయితే బాలిక విద్య అనేది ఒక సామాజిక సమస్యగా గాను ఆర్థిక సమస్యగా పరిగణించి ఆ విధమైన చర్యలపై దృష్టి సారించగలగాలి. అలాంటప్పుడే బాలిక విద్య యొక్క నాణ్యత పెరుగుతుంది.

**బాలికల విద్యకు ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు:–**

**1) కస్తూర్భ గాంధీ బాలిక విద్యాలయ పథకం:–**

ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం యస్.సి, యస్.టి, మరియు ఒ.బి.సి మైనారిటలకు చెందిన ప్రాథమికోన్నత పాఠశాలల ఏర్పాటు కోసం ప్రారంభించడిన పథకం. ఈ పథకాన్ని జూలై 2014లో ప్రారంభించటం జరిగింది. పురుషుల అక్షరాస్యతతో పోలిస్తే మహిళల అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉంది. కావున దారిద్రరేఖకు దిగువన ఉన్న యస్.సి, యస్.టి, ఒ.బి.సి మరియు మైనార్టీలకు చెందిన బాలికల కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం క్రింద ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, ఏకరూప దుస్తులు, ఆరోగ్య సేవలు, ఉచిత హాస్టల్ వసతి కల్పించటం మొదలైనవి ఏర్పరిచి బాలికల హాజరు శాతాన్ని పెంచేందుకు నిర్దేశించబడినది.

**2). జాతీయ అక్షరాస్యతా మిషన్:–**

ఈ జాతీయ అక్షరాస్యతా మిషన్‌ని సెప్టెంబర్ 30, 1999న ప్రారంభించట జరిగింది. దీని యొక్క ముఖ్య ఉద్దేశం భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించే లక్ష్యంగా ఏర్పాటు చేయటం జరిగింది. 14సం॥లోపు బాల బాలికలకు నిర్బంధ విద్యను అమలు అయ్యేవిధంగా ఈ మిషన్‌ను విస్తరించటం జరిగింది. దారిద్రరేఖకు దిగువనున్న యస్.సి, యస్.టి, ఒ.బి.సి మరియు మైనార్టీ వర్గాల వారికి అక్షరాస్యతా శాతాన్ని పెంపొందించేకు ఎంతగానో కృషిచేస్తుంది. ఈ మిషన్ ద్వారా ప్రజలలో చైతన్యవంతం చేసేందుకు అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

**3). మధ్యాహ్నభోజన పథకం:–**

పేదరికం కారణంగా దారిద్రరేఖకు దిగువనున్న బాల బాలికలు పాఠశాల మాని వేయకుండా వారికి ఉచితంగా పాఠశాల యందు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. దీని యొక్క ముఖ్య ఉద్దేశం పేదరికంతో మగ్గుతున్న పేద బాల బాలికలకు ఒక పూట భోజనం కల్పించి, వారి యొక్క హాజరును పెంచేందుకు వీలుకల్పిస్తుంది. అదే విధంగా పాఠశాలలో చేరేవారి సంఖ్యను, హాజరు సంఖ్యను పెంచేందుకు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు బాల బాలికలకు సామాజిక సమ భావన అలవడేందుకు ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. 2001 నవంబర్ 28న సుప్రీం కోర్టు మార్గ నిర్దేశం ప్రకారం ఈ పథకాన్ని అన్ని రాష్ట్రాలకు విస్తరించారు.

**4). సుకన్య సంవృద్ధి యోజన:–**

ఈ పథకాన్ని 2015 జనవరి 22న గౌరవ ప్రధాన మంత్రిగారు బాలికల కోసం ప్రత్యకంగా ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని "బేటి బచావో, బేటి పడావో" కార్యక్రమంలో భాగంగా ప్రారంభించటం జరిగింది. ఇది ఒక చిన్న మొత్తాల పొదుపు పథకం. 10సం॥లోపు వయస్సుగల బాలికల తల్లిదండ్రులు లేక చట్టబద్ధమైన సంరక్షకులు ఈ ఖాతాను తెరువవచ్చు. ఖాతా యొక్క కాలపరిమితి 21 సంవత్సరాలు. 21 సంవత్సరాలు తర్వాత వడ్డీతో కలిపి పూర్తి సొమ్ము పొందవచ్చు. బాలికకు 18 సంవత్సరాలు తర్వాత చదువు లేక వివాహం కొరకు ఖాతా నుంచి 50 శాతం నిధులు తీసుకోవచ్చు.

**ముగింపు:**

మన తెలంగాణ రాష్ట్రంలో బాలికా విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన గౌరవ ముఖ్యమంత్రి గారు యస్.సి., యస్.టి., బి.సి., మరియు మైనార్టీలకు చెందిన బాలికలకు ప్రత్యేక వసతి గృహాలను ఏర్పాటుచేసి వారికి ఉచితంగా విద్య, వసతి కల్పించి వారిని ఉన్నత చదువులకు ప్రోత్సాహం కల్పించటం జరుగుతుంది. కావున బాలికలు ఈ ఉచిత విద్య, వసతి సౌకర్యాలకు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులపై దృష్టి సారించినట్లయితే మన రాష్ట్రంలో బాలికల విద్యా శాతం పెరుగుతుందని ఆశిద్దాం. బాలురలతో పాటుగా బాలికలు కూడా ఉన్నత చదువులపై ఆశక్తి కనబరిచి కుటుంబంలోను, సమాజంలోనూ ఉన్నత స్థితిలో ఉండాలని కోరుకుందాం.

**– డా॥ కె.నాగేశ్వర రావు, రీసెర్చ్ అసోసియేట్,**
**సిడియస్–సిపార్డ్**

# పిల్లల్లో పోషకాహార లోపం-రుగ్మతలు



పిల్లల్లో పోషకాహార లోపం 3 రకాలుగా ఉంటుంది. అవి: 1. కేలరీ పోషకాహార లోపం 2. ప్రొటీన్ పోషకాహార లోపం 3. ప్రొటీన్–కేలరీ పోషకాహార లోపం.

- **కేలరీ పోషకాహార లోపం:** కార్బోహైడ్రేట్లు, కొవ్వులు లోపించిన ఆహారం తీసుకోవడం ద్వారా కలుగుతుంది.
- **ప్రొటీన్ పోషకాహార లోపం:** ప్రొటీన్‌లు లోపించిన ఆహారం తీసుకోవడం ద్వారా కలుగుతుంది.
- **ప్రొటీన్–కేలరీ పోషకాహార లోపం:** ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు లోపించిన ఆహారం తీసుకోవడం ద్వారా కలుగుతుంది.
- పోషకాహార లోపంవల్ల పిల్లల్లో వచ్చే వ్యాధులు క్వాషియోర్కర్
- దీన్నే నిర్లక్ష్యం చేయబడిన శిశువు అంటారు.
- ప్రొటీన్‌ల లోపంవల్ల ఈ వ్యాధి వస్తుంది.
- పిల్లలకు తల్లిపాలు సరిగా అందక ఈ వ్యాధి వస్తుంది.
- ఈ రుగ్మత కలిగిన పిల్లలు తరచూ అతిసార వ్యాధితో బాధపడుతారు.
- పెరుగుదల మందగిస్తుంది. కండరాల అభివృద్ధి సక్రమంగా ఉండదు.
- కణాల మధ్య ఖాళీల్లో నీరు చేరడంవల్ల శరీర భాగాలు ఉబ్బుతాయి.

**మెరాస్‌మస్**

- ఈ వ్యాధి ప్రొటీన్‌లుంకేలరీల లోపంవల్ల వస్తుంది.
- ఈ వ్యాధిగల పిల్లలు తమ వయస్సులో ఉండాల్సిన బరువులో 60 శాతం మాత్రమే ఉంటారు.
- ఉదరం ఉబ్బినట్లుగా ఉండి ముందుకు వస్తుంది.
- చర్మం కింద కొవ్వు ఉండదు. పొడిగా, వేలాడుతూ ఉంటుంది.
- కాళ్లు, చేతులు సన్నగా శుష్కించి ఉంటాయి. పక్కటెముకలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.
- రోగ నిరోధక వ్యవస్థ క్షీణించి ఉంటుంది.

**స్థూలకాయత్వం (ఒబేసిటీ)**

- అతిగా తినడం ద్వారా కొవ్వు అధికమై ఈ వ్యాధి వస్తుంది.
- శరీరం మొత్తం బరువులో 20 శాతానికంటే ఎక్కువగా కొవ్వులు ఉంటే దాన్ని స్థూలకాయంగా పరిగణిస్తారు.
- ఈ వ్యాధి జన్యు లోపాలవల్ల కలుగుతుంది.
- ఇది క్రమంగా మధుమేహానికి దారితీస్తుంది. హ ృదయం, రక్తనాళాలు, మూత్రపిండం, పిత్తాశయానికి సంబంధించిన వ్యాధులు కలుగుతాయి.
- వీరు పీచు పదార్థాలుగల ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ ఉండటం ద్వారా క్రమంగా ఎడిపోస్ కణాల్లోని కొవ్వు తగ్గి సన్నబడుతారు.

**గమనిక:**


- దేశంలో పోషకలేమితో వచ్చే వ్యాధుల గురించి పరిశోధించే సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్–NIN. ఇది హైదరాబాద్‌లో ఉంది.
- ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అధ్యయనం ప్రకారం పోషకాహార లోపంతో బాధపడుతున్న భారతీయుల సంఖ్య 245 మిలియన్లు.

**విటమిన్ల లోపంవల్ల వచ్చే వ్యాధులు విటమిన్ లోపం – కలిగే వ్యాధులు**

- విటమిన్ A – కెరటోమాలాసియా, జెరోఫ్థాల్మియా, నిక్టలోపియా (రేచీకటి), బైటాల్ చుక్కలు.
- విటమిన్ D – రికెట్స్, రికెటింగ్ రోజరీ, సోరియాసిస్, ఎముకల్లో డీ కాల్సిఫికేషన్.
- విటమిన్ E – పురుషుల్లో వంధ్యత్వం, స్త్రీలలో గర్భస్రావం, డిస్‌మెనోరియా.
- విటమిన్ K – గాయాలైనప్పుడు రక్తం గడ్డకట్టకపోవడం (హిమరేజ్).

**B కాంప్లెక్స్**

- B1 (థయమిన్) – బెరి–బెరి, పాలీన్యూరైటిస్.
- B2 (రెబోఫ్లేవిన్) – ఖీలోసిస్, గ్లాసైటిస్, డెర్మటైసిస్.
- B3 (నియాసిన్) – పెల్లాగ్రా
- B5 (పాంటోథెనిక్ ఆమ్లం) – రుమటాయిడ్ ఆర్థరైటిస్, బర్నింగ్ ఫీట్.
- B6 (పెరిడాక్సిన్) – అనీమియా.
- B7 (బయోటిన్) – రక్తంలో కొలెస్ట్రాల్ అధికమవడం.
- B11(ఫోలిక్ ఆమ్లం) – రక్తహీనత, మానసిక వ్యాధులు.
- B12 (సయనోకోబాలమైన్) – మాక్రోసైటిక్ అనీమి యా, పెర్నిసియాస్ అనీమియా.
- విటమిన్ C – స్కర్వీ.





# చాట.. బుట్ట ఉపాధి బాట

నేల.. ప్రకృతి.. కులవృత్తినే నమ్ముకున్నోళ్ల ఇంట సిరులు కురువకపోవచ్చు. కానీ, కుటుంబాన్ని చక్కదిద్దుకొని హాయిగా బతికేయొచ్చు. చేసేందుకు పని లేక.. ఇల్లు గడిచేందుకు దారి లేక.. కుంగిపోయే మధ్యతరగతి కుటుంబాలు అనేకం. దొరికిన పనల్లా చేస్తూ అతికష్టంగా ఇంటిని నెట్టుకొచ్చే కుటుంబాలు కొన్ని ఉంటే.. భారం మొత్తాన్ని భర్తపైనే వేయకుండా.. వాళ్లకూ అండగా నిలుస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నారీమణులూ ఉన్నారు. అందులో రమాదేవి ఒక ఉదాహరణ మాత్రమే. వరంగల్ రూరల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన ఈమె అమ్మానాన్నల నుంచి అబ్బిన వృత్తినే ప్రవృత్తిగా ఎంచుకున్నది. చాట, బుట్టలతోపాటు ఇంట్లోకి అవసరమైన వస్తువులను సరికొత్తగా తయారు చేస్తూ చేతినిండా సంపాదిస్తున్నది. స్వశక్తితో ఎదుగుతూనే కుటుంబానికి అండగా నిలబడి ముందుకెళుతున్న ఈమె తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. కష్టపడి పనిచేస్తే ఇంట్లో ఉండి సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని చెబుతోంది.

అడవిలో లభించే వెదురు నార మనిషికి అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ఇళ్లు కట్టుకోవడానికి, నిచ్చెనలు, బుట్టలు, తట్టలు, చాటలు మొదలైన ఉపకరణాల తయారీలో విశేషంగా పనికొస్తుంది. పురాణ కాలం నుంచే వెదురు మానవుడికి అంత్యంత చేరువలో ఉండి, అనేక విధాలుగా సాయపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణానికి వెదురునే వాడుతారు. ఇప్పటికీ అనేక పల్లెల్లో వెదురు బొంగులతో నిర్మించిన ఇళ్లే దర్శనమిస్తుంటాయి. వివాహ వేడుక ఉందంటే ఇంటి ముంగిట పెళ్లి పందిరికి వెదురుతో తయారు చేసిన తడకలను వాడుతారు. గృహ సామగ్రిలో ఉపయోగించే బుట్టలు, చాటలు, తడకలాంటివన్నీ వెదురుతో చేసినవే. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో ఇందులో కొన్ని కనుమరుగై, వాటి స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు వచ్చి చేరాయి. పురాతన కాలం నుంచి వాడుకలో ఉన్న చాట, బుట్టలు కనుమరుగవ్వొద్దనీ, పాస్టిక్ నివారించాలనే ఉద్దేశంతో వీటిని తయారీ మొదలుపెట్టింది రమాదేవి. ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే చాట, బుట్టలు, ఇతర గృహ అలంకారణ వస్తువులను చేతితోనే అందంగా తీర్చిదిద్దుతూ.. వీటికి మార్కెట్లో తిరిగి ఆదరణ మొదలయ్యేలా చేసింది.

### స్థిరవ్యయాలు...

వస్తువుల తయారీ కోసం...

| | | |
|---|---|---|
| యంత్ర పరికరాలు (అన్ని రకాలవి) | : | 20,000 |
| ప్రాథమిక + ప్రారంభ వ్యవయాలు | : | 20,000 |
| **మొత్తం** | : | **40,000** |

### నెలవారీ ఖర్చు

- ముడి సరుకులు (వెదురు, ఆకులు మొదలైనవి) : 5,000
- వస్తువును బట్టి ఖర్చు ఉంటుంది. కాబట్టి సగటున ఒక్కో వస్తువుకు అయ్యే ఖర్చు : 20
- రోజుకు 20 వస్తువులను తయారు చేయవచ్చు నెలకు 25 రోజులు పనిచేస్తే 500 వస్తువులను తయారు చేయవచ్చు. అంటే నెలకు 20×500: 10,000
- మొత్తం : 15,000

**మొత్తం పెట్టుబడి : 55,000**

### ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు కనీసం 20 వస్తువులను అమ్మొచ్చు. ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే.. 20×300 = 6000 వస్తువులను అమ్మగలుగుతాం.
- వస్తువును బట్టి రేటు ఉంటుంది.
- సగటున ఒక్కో వస్తువును రూ.60కు అందజేస్తాం. 6000×60= రూ.3,60,000

**సంవత్సర ఖర్చు విషయానికొస్తే..**

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే.. 12,500×12=1,50,000
- ప్రారంభ వ్యయాలు : 20,000

ఏడాదికి అయ్యే మొత్తం ఖర్చు :1,70,000

**లాభం అంచనా...**

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 3,60,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ. 1,50,000
- తీసేస్తే వచ్చే లాభం : 2,10,000
- అంటే నెలకు వచ్చే లాభం : రూ. 17,500

**ప్లాస్టిక్‌కు ధీటుగా..**

ప్రతి ఇంట్లో అవరసరమైన కనీస వస్తువు చాట. బియ్యం చెరిగేందుకు దీన్ని తప్పనిసరిగా వాడాల్సిందే. ఇక పండుగలు, పబ్బాలప్పుడు చాట, బుట్టలతోనే వాయనాలను ఇస్తారు. ప్రపంచీకరణ పుణ్యమా అని ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తడంతో చాటలు, బుట్టలకు కష్టకాలం మొదలైంది. వీటిపైనే ఆధారపడి జీవిస్తున్న మేదరి కుటుంబాలు వృత్తిని వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ తరుణంలో తాతముత్తాల వృత్తిని కాపాడుకోవాలని ప్లాస్టిక్‌కు ధీటుగా వెదురు నారతో చాట, బుట్టలు, ఇతర గృహ అలంకారణ వస్తువులు తయారీ చేస్తున్నారు. అవి ప్లాస్టిక్ కంటే ఆకర్షణీయంగా ఉంటూ, తక్కువ ధరకే మార్కెట్లో లభిస్తున్నాయి. ఇప్పుడు వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తుండడంతో చాట, బుట్టలు పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయి.

**సంప్రదాయంగా..**

బతుకమ్మల కోసం ఈ బుట్టలనే సంప్రదాయంగా వాడుతారు. ఆలయాల్లో పూజలకు, దీపావళి నోములకు వీటినే ఎక్కువగా వినియోగిస్తారు. వెనుకటి రోజుల్లో పిల్లలు పుట్టిన వెంటనే చాటలో వేసేవారు. చివరకు చావులోనూ చాటను వాడుతారు. ఇప్పటికీ ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. ఇంకా వెరైటీగా తయారు చేసిన వస్తువులను డైనింగ్ టేబుల్‌పై అలంకరించుకోవచ్చు. ఇంట్లో పండ్లను వేసుకోవడానికి, మందులను వేసి వాడుకోవచ్చు. తడకలు, గోవా తడకలు, పెళ్లి పందిళ్లు, చలువ, డెకరేషన్లకు ఉపయోగించే వాటిని కూడా రకరకాల డిజైనల్లలో తయారు చేస్తున్నారు. వాటి హవా కూడా ఏమీ తగ్గలేదు.

**సంఘాల నుంచి..**

వెనకటి రోజుల్లో అడవి నుంచి వెదురుబొంగులను తీసుకొచ్చి వాటిని చీల్చి ఉపకరణాల్లో ఉపయోగించేవారు. అడవులు అంతరించిపోతున్న దృష్ట్యా ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు వెదురును టెండర్ రూపకంగా గ్రామైక్య సంఘాలకు అందజేస్తున్నాయి. సంఘాల నుంచే వెదురు బొంగులను మోపులుగా కొనుగోలు చేస్తున్నారు. మోపులో 20 వరకు బొంగులుంటాయి. ఒక్కబొంగుకు రూ. 50 వరకు చెల్లిస్తున్నారు. సంప్రదాయచారంగా వాడే వెదురు వస్తువులకు మార్కెట్లో సరైన గిట్టుబాటు ధర లభిస్తే ఇంకా తయారీదారులు పెరుగుతారు. అప్పుడు ప్లాస్టిక్ నివారణ కూడా సాధ్యమవుతుంది. ప్రస్తుతానికి రూ. 50 నుంచి రూ. 60 వరకు చాట ధర పలుకుతోంది. ఎక్కడో ఒక చోట రూ. వందకు కొనుగోలు చేస్తున్నారు. బుట్ట రూ. 50 నుంచి 100 వరకు ఉంటుంది.

**అత్తారింట్లో అడుగు పెట్టగానే..**

ములుగులోని మారుమూల ప్రాంతం ఖానాపూర్‌కు చెందిన రమాదేవి, ఇంటర్మీడియట్ చదివారు. వివాహం కావడంతో ఖానాపూర్ వచ్చారు. కొద్దిరోజులకే ఇంట్లో కష్టాలు మొదలయ్యాయి. భర్త ఆటో నడిపినా ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. బయట పనులకు వెళ్లలేక కులవృత్తిలో భాగంగా చాట, బుట్టలు చేయాలని అనుకున్నది. చిన్నప్పటి నుంచి ఇంట్లో అమ్మనాన్నలు వెదురుతో తయారు చేసే వస్తువులను చూసి నేర్చుకునేది. కొద్దిరోజుల్లోనే చాటలు, బుట్టలు, విసనకర్రలు తయారు చేయడం మొదలుపెట్టింది. కాలనీలో పది మంది మహిళలతో కలిసి రమ్యశ్రీ ఎంఎస్‌పీఎస్‌ను గ్రూపును ఏర్పాటు చేసింది. గ్రూపులో కొందరు వ్యవసాయం, టైలరింగ్ చేస్తే.. రమాదేవి మాత్రం కులవృత్తిని నమ్ముకున్నది. ఒక్కరోజు రెండు బుట్టలు, రెండు చాటలు, విసనకర్రలాంటివి చేసేవారు. రోజువారీ కూలీలాగా డబ్బులు ఇచ్చేది. తర్వాత ప్లాస్టిక్ భూతంపై ప్రచారం ముమ్మరం కావడంతో వీరి వ్యాపారానికి మంచి డిమాండ్ వచ్చింది.

**కుటుంబానికి అండగా..**

భర్త సంపాదనతో ఇంటిని నడిపించడం కష్టమయ్యేది. ఏదైనా చేసి, కుటుంబానికి ఆసరా అవ్వాలని అనుకునేదాన్ని. అందుకే కులవృత్తిని నమ్ముకున్నా. వెదురుతో చాటలు, బుట్టలు తయారుచేయడం మొదలు పెట్టిన. మొదట్లో ఆదాయం తక్కువగా వచ్చేది. ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తడంతో, మా వ్యాపారం బాగా దెబ్బతిన్నది. ఇప్పుడు ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని జనాల్లో అవగాహన పెరగడంతో, వెదురు వస్తువులకు గిరాకీ పెరుగుతున్నది. ఇప్పుడు ఆదాయం బాగానే వస్తున్నది. ఎవరైనా ముందుకువస్తే వాళ్లకు నేర్పించే ప్రతిభ ఉన్నది. కష్టపడితే పనికిదగ్గ ప్రతిఫలం పొందాలంటే.. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలి. అట్లయితనే వినియోగం ఉంటుంది. ఉంటే కష్టపడి, ప్రభుత్వానికి రాయితీలు కడతాం. సబ్సిడీ రుణాలు అందజేసి, ఆదుకుంటే ఇంకా ఆదాయం పెరుగుతుంది.

**– నీలం రమాదేవి**

**రాజేందర్ పిల్లి, ఖానాపూర్**

# బలమైన విద్యారంగంతోనే బంగారు భవిత

దేశాభివృద్ధిలో విద్యకు ఎనలేని ప్రాధాన్యము కలదు. విజ్ఞానవంతమైన సమాజముతోనే అభివృద్ధికి బంగారుబాటలు ఏర్పడతాయి. అందుకే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శీఘ్రగతిన, ఇతోధికంగా అభివృద్ధి చేయడానికి పూనుకొని పలు కార్యక్రమాలతో,లక్షలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఆధునిక సమాజంలో నాణ్యమైన



విద్యలేక,నైపుణ్యాభివృద్ధి గల వారి కొరత ఏర్పడుతున్నది.సాంకేతిక పరిజ్ఞానం విరివిగా,అన్ని రంగాలలో సాంకేతిక దన్ను పెరిగి అంతా సాంకేతిక సౌరభాలు వెదజల్లుతున్నా ఆయా అవకాశాలను అందుకోవడంలో మన యువత రేసులో వెనుకబడి పోతున్నది. మనదేశములో అత్యంత చౌకగా మానవ వనరులతో పనిచేయించుకొనే అవకాశం ఉండబట్టే దేశానికి పలురకాల కంపెనీలు వాలిపోతున్నాయి.కానీ యువశక్తిలో అధికభాగం నైపుణ్యలేమితో కొట్టుమిట్టాడుతోంది.అంచనాలను అందుకోలేక అవకాశాలను జారవిడుచుకుంటున్నారు.ఉన్నత విద్యారంగములోని లోపాలు మేలిమి విద్యావంతులను,మానవ వనరులను తయారుచేయడంలో ముందడుగు పడుతున్నా మరింత రాటు దేలాల్సిన అవసరం ఉంది.ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థులున్న దేశంగా భారత్ కు ఘనకీర్తి ఉన్నా,అధిక విధ్యార్థులను ప్రయోజకులుగా మార్చడంపైననే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.దేశంలో సుమారు 32 కోట్ల విధ్యార్థులు ఉండగా వారందరిని నైపుణ్యం గల వారిగా తీర్చిదిద్దడం పైననే దేశానికి కావలసిన మేలిమి మానవ వనరులు ఆధారపడి ఉంటాయి.రాబోయే ఏడేళ్ళలో దేశంలో నిర్మాణ రంగం,రవాణా,ఆటోమోబైల్,చిరు వర్తకం వంటి 24 రంగాల్లో 12 కోట్ల మంది నిపుణల అవసరం ఉంది.ఇలా కోట్లాది నిపుణుల తయారు చేసే విధంగా మన విద్యావ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం కలదు.ఇదిలా ఉంటే దేశంలోని విద్యారంగ సుగంధాలు వెదజల్లకుండా ఇంకా నిరక్షరాస్యులుగా కొట్టుమిట్టాడుతున్న వారిని సైతం అక్షరాస్యులుగా మార్చే క్రతువును వేగవంతం చేయాలి.

దేశంలో 2001 లో 102.80 కోట్ల జనాభా ఉండగా 2011 లెక్కల ప్రకారం 121.02 కోట్ల జనాభా పెరిగింది.దేశంలో 2001 లో అక్షరాస్యత 64.8 శాతం నవెూదుకాగా 2011 నాటికి 74.4 శాతం నమోదయింది.2001 లో పురుషుల అక్షరాస్యతా శాతం 75.8 ఉండగా 2011 నాటికి 82.1కు పెరిగింది.స్త్రీల అక్షరాస్యతాశాతం 2001 లో 52.1 ఉండగా,2011 నాటికి 65.5 పెరిగింది.అంటే13.4శాతం పెరిగి స్త్రీల అక్షరాస్యత మెరుగుపడి,గణనీయమైన పురోగతిని సాధించింది.అయినా ఇంకా35 శాతం సాధించాల్సివుంది. భారతావని 69 వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్నా సగటున 26 శాతం అక్షరాస్యత సాధించాల్సి ఉంది. కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక-2014 ప్రకారం 2001 లో 7 సంవత్సరాల పైబడినవారి అక్షరాస్యత 64.8 ఉండగా 2011నాటికి 73.0 శాతానికి పెరిగింది.అందులో 2001లో ఎస్.సిఅక్షరాస్యత 54.7 ఉండగా, 2011 నాటికి 66.1 పెరిగింది.2001 లో ఎస్టీ అక్షరాస్యత 47.1 ఉండగా2011 నాటికి 59.0 కు పెరిగింది. 15సంవత్సరాల పైబడిన వయస్సు వారు 2001 లో అక్షరాస్యత 61 శాతం ఉండగా, 2011 నాటికి 69.3 శాతం పెరిగింది. ఇందులో ఎస్.సి లల్లో 2011 నాటికి 60.4 శాతం పెరగగా, ఎస్టీ ల్లో 2011 ప్రకారం 51.9 శాతం నమోదయింది. ప్రభుత్వాలు వేలకోట్ల రూపాయలు వెచ్చించి సంపూర్ణ అక్షరాస్యత భారతావని దిశగా పయనింపచేయాలని ఆరాటపడుతున్నా లక్ష్యాన్ని అందుకోవడానికి మరింతగా కృషి చేయాల్సిన అవసరముంది.దేశ జనాభాలోని నిరక్ష్యరాస్యులకు తోడు,పేదరికముతో కొట్టుమిట్టాడుతున్న వారు ప్రభుత్వము అందించే సదుపాయాలు అందుకోవడంలో వెనకబడిపోతున్నారు.ఇటీవలి కాలములోవిద్యారంగములో గణనీయమైన మార్పులు ప్రవేశించి ఆధునీకకరణ దిశగా అడుగులు పడి, డిజిటల్మయంగా మారుతున్నది.దేశములో ప్రపంచీకరణ,ప్రైవేటీకరణ విధానాలు అనుసరించబడుతూ విద్యావ్యవస్థలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి.కంప్యూటరీకరణ అధికమయి విద్యా, ఉపాధి,ఉద్యోగ అవకాశాల్లోనూ కంప్యూటర్ విద్యకు ఎనలేని గిరాకీ పెరిగిపోయింది.దేశంలో పరిపాలన,ఆర్థిక,ఇతర ముఖ్యమైన వ్యవహారాల్లోనూ కంప్యూటర్ల వాడకం పెరిగిపోయి,అత్యధిక

ప్రాధాన్యతను సంతరించుకున్నది. పారిశ్రామిక, సేవారంగాలల్లో కంప్యూటర్ కొలువులకు అత్యంత గిరాకీ ఏర్పడింది.

ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో 2013-14 సం॥రంలో ప్రాధమిక పాఠశాలలు 7,90,640ఉండగా, ప్రాధమికోన్నత పాఠశాలలు 4,01,079, సెకండరీ పాఠశాలలు 1,31,287, మరియు సీనియర్‌సెకండరీ పాఠశాలలు 1,02,558 ఉండగా మొత్తం 14,25,564 పాఠశాలలు కలవు. ఉన్నత విద్యావకాశాలకు గాను సెంట్రల్ యూనివర్శిటీలు 42 ఉండగా, రాష్ట్ర పబ్లిక్ యూనివర్శిటీలు 310, డీమ్డ్ యూనివర్శిటీలు 127, రాష్ట్ర ప్రైవేటు యూనివర్శిటీలు 143, సెంట్రల్ ఓపెన్ యూనివర్శిటీలు 1, రాష్ట్ర ఓపెన్‌యూనివర్శిటీలు 13, ఇలా ఇతర యూనివర్శిటీలు కలిపి మొత్తం 712 కలవు. కళాశాలలు 36,671 ఉండగా ఇతర విద్యాసంస్థలు 11,445 కలవు. ఇలా విభిన్న రంగాల వారీగా అంటే ప్రాధమిక, మాధ్యమిక మరియు ఉన్నత విద్యారంగమును మెరుగుపరచడానికి గాను ఇన్ని వేల సంస్థలు ప్రారంభించినా ఇంకా పురోగతిని సాధించాల్సి ఉంది. విద్యారంగ అభివృద్ధికి వేలాదిగా విద్యా సంస్థలు స్థాపితమయి, విద్యారంగము విస్తరిస్తున్నా ఆశించినంత వేగంగా అక్షరాస్యతను అందుకోకపోవడం వెనుకబాటుతనానికి గురిచేస్తోంది. ఉన్నతవిద్యారంగము పిహెచ్.డిలో సైన్స్ విభాగంలో 20.61 శాతంతో అధికంగా నమోదవుతుండగా, సోషల్ సైన్స్‌లో 18.27 శాతం నమోదవుతుండగా, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలో 17.45 శాతం నమోదవుతున్నారు. హోమ్ సైన్స్‌లో 0.68 శాతం తో అతితక్కువగా నమోదవుతున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సోషల్ సైన్స్‌లో 20.58 శాతం అత్యధికంగా నమోదవుతుండగా, హోమ్ సైన్స్‌లో 0.21 శాతంలో అత్యంత తక్కువగా నమోదవుతున్నారు. గ్రాడ్యుయేషన్ స్థాయిలో 40.69 శాతంతో అధికంగా ఆర్ట్స్, హ్యూమనిటీస్, సోషల్ సైన్స్‌లో నమోదయ్యారు. ఇలా పిహెచ్.డి, పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌మరియు గ్రాడ్యుయేషన్ స్థాయిలో అతితక్కువగా నమోదవుతుండగా వృత్తివిద్యాకోర్సులయిన లా, ఐ.టి & కంప్యూటర్ లాంటి రంగాలలో సైతం అత్యంత తక్కువ నమోదుకావడం వలన ఉపాధి కల్పించే వృత్తి విద్యా కోర్సులను విస్తృతపరచాల్సిన అవసరం ఎంతైనా కలదు. దేశంలోని అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించడానికి అన్ని రకాల కోర్సుల యందు విరివిగా చేర్పించేలా తగు చర్యలు చేపట్టాలి. అప్పుడే సమాజ అభ్యున్నతి కావాల్సిన వివిధ రకాల నిపుణుల తయారుకాబడి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది. మరియు వృత్తి విద్యాకోర్సులను నిర్లక్ష్యం చేస్తే నిరుద్యోగం ప్రబలి దేశానికి అశాంతి పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా విద్యారంగాన్ని మరింతగా సంస్కరించాలి.

కేంద్ర ప్రభుత్వము 2016-17 బడ్జెట్‌లో 72,394 కోట్లు కేటాయించి ప్రాధమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యతను పెంచేలా విద్యారంగాన్ని తీర్చిదిద్దాలని మానవవనరుల శాఖ నిర్ణయించింది. జాతీయ విద్యామిషన్‌కు 28,010 కోట్లు కేటాయించగా, అందులో సర్వశిక్షా అభియాన్‌కు 22,500కోట్లు ప్రత్యేకించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి 9,700 కోట్లు కేటాయించారు. విద్యారంగ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలతో పాటు, కోట్లాది రూపాయలు కేటాయించి విద్యారంగాన్ని పటిష్టవంతముగారూపొందించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి 1000 కోట్ల ప్రారంభ మూలధనముతో ఉన్నత విద్య ఆర్థిక సహాయ సంస్థను ఏర్పాటు చేసి, మార్కెట్‌నుంచి నిధులను సేకరించి మౌలిక వసతుల మెరుగుకోసం ఐఐటి లాంటి ఉన్నత విద్యాసంస్థలకు ఆర్థికసహాయం చేస్తుంది. దేశంలోని పది ప్రభుత్వ, మరో పది ప్రయివేటు విద్యా సంస్థలు ప్రపంచస్థాయి బోధన, పరిశోధన కేంద్రాలుగా ఎదిగేందుకు అవసరమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడం, సామాన్యులకు సైతం ఉన్నత ప్రమాణాలు గల విద్య అందేలా చూడడమే దీని ఉద్దేశం. సర్వశిక్షా అభియాన్‌కు నిధులను పెంచింది. తద్వారా పటిష్టమైన ప్రాధమిక విద్యకు పునాది వేయాలని ప్రభుత్వము భావిస్తున్నది. నూతనంగా 62 నవోదయ విద్యాలయాలను ఇంతకూ ఏర్పాటుకాని జిల్లాల్లో నెలకొల్పి ప్రాధమికవిద్యను బలోపేతం చేయడమే కాకుండా ప్రాంతాల మధ్య, జిల్లాల మధ్య అసమానతలను రూపుమాపుతూ దేశంలోని అందరికీ విద్యను అందుబాటులో తెచ్చేలా అహర్నిశలు కృషి చేస్తున్నది. దేశంలో ఆధునీకరణ పెరిగిపోతున్నది. కంప్యూటరీకరణ ఊపందుకుని సర్వం డిజిటల్ మయంగా మారుతున్నది. దేశంలోనూ డిజిటల్ ప్రభంజనానికి పరుగులు పెట్టించాలని కేంద్ర ప్రభుత్వము డిజిటల్ ఇండియా స్థాపనే లక్ష్యంగా పలు పథకాలను ప్రారంభించి అమలుకు పూనుకున్నది. విద్యార్థుల్లో విద్యార్హత ధ్రువపత్రాల కోసం డిజిటల్ డిపాజిటరీలను నెలకొల్పనున్నది. సెక్యూరిటీ పత్రాల మాదిరిగా విద్యార్థుల మార్కుషీట్లు, స్కూలు, డిగ్రీ సర్టిఫికెట్లకు కూడా డిజిటల్ డిపాజిటరీలను ఏర్పాటు చేయడం ద్వారా పత్రాల ధ్రువీకరణ, భద్రత, వాటిని పొందడం సులువవుతుంది. డిజిటల్ ఇండియాలో భాగంగా దేశ వ్యాప్తంగా 2.5 లక్షల పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు అంతర్జాల సదుపాయం కల్పించనున్నారు. సాధారణ పౌరులకోసం 4 లక్షల అంతర్జాల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల్లో వైఫై హాట్ స్పాట్‌లు ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వము అంతర్జాల సదుపాయాన్ని విద్యాసంస్థల్లో, ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటుచేసే పనులు ఊపందుకున్నాయి. తద్వారా దేశంలోని విద్యారంగము డిజిటల్ మయంగా మారనుండగా ఐదుకోట్లకు పైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

దేశంలోని ప్రాధమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలో పురోగతి దిశగా ప్రణాళికలు రూపొందించి అమలుపరుస్తున్నారు. కానీ ఉన్నతవిద్యలో మరింత ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా కలదు. దేశంలోయువ జనాభా అధికంగా కలదు. కానీ దేశంలోని పారిశ్రామిక, సేవారంగాలకు కావాల్సిన నైపుణ్యం గలయువ జనాభా లేకపోవడంతో ఆధునికంగా దేశం అభివృద్ధి చెందడానికి విదేశీ మానవవనరులపైన ఆధారపడవలసి వస్తోంది. దేశంలోని మొత్తం కార్మికశక్తిలో కేవలం 2 శాతం మాత్రమే నైపుణ్యం కలవారుఉండగా నైపుణ్యలేమి అభివృద్ధికి అవరోధంగా మారనున్నది. దేశంలో యువత అభివృద్ధి అన్న ధోరణికి స్వస్తి పలికి యువత ద్వారా అభివృద్ధి అన్న నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ జనాభాలో 54 శాతం మంది 25 ఏళ్లలోపు



యువకులు కలరు. ఇంతటి భారీ యువజనాభాగల యువభారత్‌ను అభివృద్ధి పథం పయనింపచేయాలంటే యువశక్తిని మేలిమి,నైపుణ్యం గల శక్తిగా తీర్చిదిద్దాలి. అప్పుడే ఆధునిక భారత్ నిర్మాణం దిశగా అడుగులు పడి అభివృద్ధిలో వేగం పుంజుకుని ప్రపంచదేశాల సరసన అభివృద్ధిలో పోటీపడనుంది. దేశంలో మానవవనరులకు కొరత లేదు కానీ నైపుణ్యం గల మానవవనరుల లేమి వెంటాడుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 12 కోట్ల నిరుద్యోగులు కలరు. 2012లో భారత్‌లో పనిచేయగల వారి సంఖ్య 48.4 కోట్లు, కానీ ఇలా వేగంగా యువ జనాభా పెరుగుతుంటే 2020 నాటికి 85 కోట్లకు చేరుతుందని అంచనా. అంటే ప్రపంచ శ్రమశక్తిలో 25 శాతా మన దేశంనుండే ఉంటుంది. ఇలాంటి అమితమైన మానవ వనరులను నైపుణ్యం గలమానవ వనరులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వము ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనను ప్రారంభించి రానున్న మూడేళ్ళలో కోటి మంది యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆ దిశగా చర్యలు ప్రారంభించి ముందుకు సాగుతున్నది. ఇందుకు గాను 1500 బహుళ నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి,1700 కోట్లను కేటాయించారు. దీనికి తోడు జూలై 2015 లో జాతీయ కెరీర్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా 3.5 కోట్ల మంది యువత ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నారు. దీన్ని రాష్ట్రాల్లోని ఉపాధి కల్పనా కేంద్రాలకు అనుసంధానం చేసి యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు 100 ఆదర్శ కెరీర్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రయోజకులుగా మార్చడం ద్వారాసమాజానికి,దేశానికి కావలసిన మానవవనరులను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తున్నది.

విద్యారంగంలో ప్రాధమికస్థాయిలో చేరే బడిపిల్లల సంఖ్య ఆశాజనకంగా,సంతృప్తికరంగా ఉన్నా ప్రాదమికోన్నత దశ నుండి ఉన్నత విద్యా రంగములో అడుగిడే సరికి నగానికి కుచించుకుపోతున్నది. కుటుంబవ్యవస్థ,ఆర్థిక పరిస్థితులు,ఇతర సామాజిక కారణాలు తోడుగా బడికి దూరం చేస్తూ అజ్ఞాన సమాజానికి చేరువవుతున్నారు. ప్రాధమికరంగం నుండి మొదలు ఉన్నత విద్యారంగం వరకు ఉపాధ్యాయుడు,విద్యార్థి మధ్య ఉండాల్సిన నిష్పత్తి సమతూకంలో ఉండేలా తగు చర్యలు చేపట్టాలి. విద్యాసంస్థల యందు గల ఖాళీలను భర్తీ చేసి,ఉన్నత విద్యను ఆధునీకరించాలి. విద్యారంగములో సరియైన కేటాయింపులు చేసి,సకాలములో నిధులు వెచ్చించేలా తగినప్రణాళిక రూపొందించి విద్యారంగ అభ్యున్నతికి సమగ్రమైన విధానాన్ని రూపొందించాలి. విద్యా వ్యవస్థ మరింతగా అభివృద్ధి దిశగా పయనింపజేసేలా తగిన సంస్కరణలు రూపొందించాలి. 1951 లో 18.3 శాతం గా ఉన్న అక్షరాస్యతా శాతం2011 నాటికి 74 శాతం పెరగగా ఇంకా సాధించాల్సి ఉంది. 1951 నాటి లెక్కల ప్రకారం పురుషులకంటే స్త్రీలల్లో 8.9 శాతంగా ఉన్న అక్షరాస్యతా శాతం 2011 నాటికి 65.5 శాతం గణనీయమైన ప్రగతిని సాధించింది. దేశంలో ప్రాధమిక,మాధ్యమిక మరియు ఉన్నత విద్యారంగాల అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆధునికతకు ఆలవాలమైన ఉన్నత విద్య పట్ల మరింత శ్రద్ధ వహించి మారుతున్న పారిశ్రామిక,సేవా రంగాలకు అవసరమయ్యే మేలిమివనరులను తీర్చిదిద్దే విధంగా విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి,విద్యారంగ అభివృద్ధితో పాటు ఉపాధి,ఉద్యోగ కల్పన ధ్యేయంగా సంస్కరించాలి. అప్పుడే యువజనాభాకుతగిన ఉపాధి,ఉద్యోగావకాశాలు లభించి,ఆధునిక భారత్ నిర్మాణంలో పాలుపంచుకుంటారు. సమాజం ఎంత త్వరితగతిన విజ్ఞానవంతం గావించబడితే అంతే శీఘ్రముగా అభివృద్ధికిబాటలు పడి,నూతన ఆధునిక సమాజం ఏర్పడుతుంది. ఆధునిక సమాజంలో చైతన్యానికి,విజ్ఞానానికి నిరంతరసంఘర్షణ జరుగుతూ అభివృద్ధిలో పురోగమిస్తుంది. మనిషి కేవలం తన తెలివితేటలను అలాగే మిగిల్చితే మనుగడ సాగించే అవకాశం లేదు. ఆ తెలివితేటలను జ్ఞానంగా మార్చుకోవాలి. అప్పుడు అతడు కేవలం మనుగడసాగించడం మాత్రమే కాదు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు అని ప్రఖ్యాత ఇంగ్లీష్ రచయిత జార్జి బెర్నార్డ్ షా వెలిబుచ్చినట్లుగా విద్య వ్యక్తి మనుగడకు,ఉన్నత శిఖరాల అధిరోహణకు ఆయుధంగా ఉపయోగపడాలి. అప్పుడే దేశంలో విద్యా సుగంధాలు వెదజల్లి అభివృద్ధిలో అగ్రభాగాన దూసుకుపోతుంది.



**– ఎ.శ్యామ్ కుమార్,**
**విస్తరణాధికారి(పిఆర్&ఆర్‌డి),**
**భీమదేవరపల్లి, వరంగల్(అర్బన్)**

# సంక్షేమ శ్రేయో రాష్ట్రంగా తెలంగాణ



తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోటీపడుతూ వడివడిగా ముందుకుసాగుతున్నది.కనిష్ట విస్తీర్ణం,గరిష్ట ప్రయోజనాలే లక్ష్యంగా చిన్న జిల్లాల ఏర్పాటుతో సర్వతోముఖాభివృద్ధిగా తెలంగాణను అభివృద్ధి పరచాలని సమగ్రప్రణాళికలను రూపొందిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చిమ్మచీకట్లు నెలకొని విద్యుత్ రంగము అష్టకష్టాల పాలవుతుందని వక్రభాష్యం చెప్పినవారికి ధీటుగా సమాధానమిస్తూ నిరంతరవిద్యుత్‌ను అందిస్తూ ప్రజల జేజేలు అందుకుంటున్నది.విన్నువిరిగి మన్నుమీద పడలేదు,శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం కాలేదు,కారు మబ్బులు కమ్ముకోలేదు,జల ప్రవాహాలుఏమీ ఆగిపోలేదు కానీ వంకర బుద్ధితో మోకాలడ్డుపడిన వారికి చెంపపెట్టుగా దేశం లోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా అవార్డులు,సత్కారాలు అందుకుంటున్నది.ఇంతకంటే ఇంకేమి కావాలి ప్రతిభకు,పాలనకు నిదర్శనం.రాష్ట్రంలోని సబ్బండ వర్ణాల అభివృద్దే ధ్యేయంగా పరాయిపాలనలో మరుగునపడి,అభివృద్ధికి నోచుకోని పల్లెలు,ప్రాంతాలు,చారిత్రక ప్రదేశాలు స్వరాష్ట్రంలో సమున్నత గౌరవంతో సత్కరించుకుంటున్నాయి.రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని పరిపుష్టం చేయడానికి కాలువలు,మోటార్ల ద్వారా సాగుతున్న సాగునీటి అవసరాలను తీర్చడానికి మిషన్‌కాకతీయ పేరుతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం గ్రామాలనుజలకళనుసంతరించుకున్నది.సాగునీటికి కావలసిన కరెంట్ కష్టాలతో సతమతమయిన రైతాంగానికి తొమ్మిదిగంటల అంతరాయంలేని విద్యుత్‌పంపిణీతో రైతులల్లో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది.కరెంట్ వేళలతో కాచుకు కూర్చునే రైతు ధీమాగా నిద్రపోతున్నాడు. ఇంటికి,పొలానికి పగలు,రాత్రి అనే తేడా లేకుండా సంచరించి ప్రమాదాల బారిన పడి అర్ధాంతరంగా తనువు చాలించే అన్నదాతలకు నిరంతర విద్యుత్‌తో తగిన భద్రత కలుగుతున్నది.దేశ అభివృద్ధి ముఖ చిత్రంలో తెలంగాణ ఏళ్ళ నాటి రాష్ట్రాలతోసమున్నతంగా పోటీపడుతూ,సగర్వంగా నిలబడుతున్నది.

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతున్నది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఒక్క రోజులోనే సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి రాష్ట్ర సమగ్రసమాచారాన్ని తయారు చేయడం జరిగినది.మన ఊరు–మన ప్రణాళికలతో ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి సమగ్ర సమాచారాన్ని క్రోడీకరిస్తూ సర్వతోముఖాభివృద్ధి దిశగా వనరులను గుర్తించి తద్వారా ప్రణాళికలను రూపొందించుకుని ఆర్థిక స్వావలంబన,సాధికారత దిశగా గ్రామాలు పయనింపచేయాలని ప్రణాళికలను తయారుచేయడం జరిగింది. తదనంతరం గ్రామీణాభివృద్దే ధ్యేయంగా గ్రామజ్యోతి ప్రణాళికలతో గ్రామపంచాయతీలను నిర్దిష్ట కాలములో లక్ష్యాలను చేరే విధముగా కార్యోన్ముఖులను చేసింది.గ్రామజ్యోతి పథకము ద్వారా గ్రామపంచాయతీల యందుఆదాయ,వనరులను గుర్తించడం,కేంద్ర,రాష్ట్ర పథకముల ద్వారా వస్తున్న నిధులను లెక్కించి సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవడం జరిగింది.గ్రామాభివృద్ధి యందు ప్రజల భాగస్వామ్యంను పెంపొందించాలని కార్యాచరణ కమిటీలను ఎన్నుకోవడం జరిగినది. ప్రస్తుతం పదవీలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ పాలకవర్గము మరియు గ్రామములో ఇతర ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులను కూడా కలుపుకొని గ్రామజ్యోతి కార్యాచరణ కమిటీలను గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేయడం జరిగినది.గ్రామాల అభివృద్ధికి గాను స్వల్పకాలిక,దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి నిర్దిష్ట కాలములో లక్ష్యాలను చేరేవిధంగా ప్రణాళికలను అధికారులు,ప్రజాప్రతినిధులు,ప్రజల భాగస్వామ్యంతో రూపొందించుకుని కార్యాచరణను ప్రారంభించడం జరిగింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రామాల దత్తత తీసుకుని అధికారుల నుండి మొదలుకుని దాతల వరకు అభివృద్ధిలో తమ వంతుగా విరాళాలు ప్రకటిస్తూ గ్రామాభివృద్ధికి పునాదులు వేస్తూ శ్రీమంతులుగా నిలిచారు.పారిశ్రామిక సంస్థలు, వివిధ అభివృద్ధి సంస్థలు,గ్రామాల పూర్వ విద్యార్థులు,విదేశాల్లో ఆర్థికంగా స్థిరపడిన శ్రీమంతులు తమ స్వదేశ,స్వగ్రామ అభివృద్దే లక్ష్యంగా ఆర్థిక సహాయమును ప్రకటించి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావడం జరుగుతున్నది.గ్రామాల దత్తత అనేది సామాజిక ఉద్యమంగా ఎందరినో కదిలిస్తూ,మరెందరికో స్ఫూరినిస్తూ పల్లెకుపోదాం,పల్లెలను బాగుచేద్దాం అన్న సదాశయముతో బంగారు తెలంగాణ దిశగా ముందుకు సాగుతున్నది. గ్రామాలను,గ్రామాల అభివృద్ధి ప్రదాతలను కదిలించడంలో,అభివృద్ధిలో భాగస్వాములను చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విజయవంతం అయి,గ్రామాలను బంగారు గ్రామాలుగా తీర్చే దిద్దే క్రతువులో దిగ్విజయంగా పరుగులెడుతున్నది.

తెలంగాణ రాష్ట్రము రెండున్నర ఏళ్ళను పూర్తి చేసుకుని తమ దైన పరిపాలనతో దీటుగా పయనిస్తున్నది.దేశంలో సంక్షేమరంగము సాకల్యముతో బాధపడుతున్న తెలంగాణకు బాధలు తీరే విధంగా ఆసరా,విద్యార్థులకు సన్నబియ్యం,పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు,కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్,ప్రతీ పేద వ్యక్తికి 6 కిలోల బియ్యం,మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి మంచినీరు,ఎకనామిక్









సపోర్ట్ స్కీంలాంటి పథకాలను రూపొందించి సంక్షేమ శ్రేయో రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అంతే కాకుండా మహిళా సంక్షేమం,రైతు సంక్షేమం,బిసి సంక్షేమం,ఉద్యోగుల సంక్షేమం ను పెంపొందించే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేసి పలు రకాల రాయితీలు ఇస్తూ విభిన్న వర్గాల సంక్షేమంను సైతం పొంపొందిస్తూ సర్వతోముఖాభివృద్ధికి పూనుకున్నది. అన్నదాతల ఆత్మహత్యలను నివారించి అన్నదాత సంక్షేమం ధ్యేయంగా ఎన్నికల మానిపెస్టోలో పేర్కొన్న విధముగా భారమయినప్పటికీ లక్ష లోపు పంట రుణాలను విడతల వారీగా మాఫీ చేసన్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నది. 2016-17 బడ్జెట్‌లో మూడోవిడత రుణ మాఫీ నిధులను కేటాయించి, వచ్చే ఏడాదికి రుణవిముక్తులయ్యే విధంగా నిధులను కేటాయించి, విడుదల చేసన్తూ కర్షకుల అభివృద్ధికి పూనుకొన్నది. సిరులున్న తెలంగాణలో అన్నదాతలు నిర్లక్ష్యం చేయబడి ఆత్మహత్యలకు పురికొల్పిన వ్యవసాయవిధానాలను సైతం మార్చే విధంగా హోలికులకు అవగాహనను కలిగిస్తూఆధునిక పద్దతులను పాటించే విధంగా రైతులను తయారు చేస్తున్నది. పంట నష్టాలతో రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు నష్ట పరిహారాన్ని 6 లక్షలకు పెంచి, రైతులోకానికి ఆపద్బాంధవునిగా నిలిచింది. ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు 480 కోట్లను సైతం చెల్లించింది. రాష్ట్రంలో 1023 కోట్ల వ్యయముతో 17 లక్షల మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో 330 గోదాములు నిర్మిస్తున్నారు. గోదాముల్లో నిల్వ చేసుకున్న సరుకు విలువలో 75 శాతం మేర వడ్డీలేని రుణాలను సైతం ఇస్తూ రైతుల సంక్షేమాన్ని పొంపొందిస్తున్నది. వ్యవసాయరంగాన్ని ఆధునీకరించడం ద్వారా రాష్ట్రం లో అత్యధికంగా ఆధారపడుతున్న వ్యవసాయరంగము ప్రజలకు ఉపాధిని కల్పిస్తుంది. రైతుల పంటరుణాలు మాఫీ చేయడం,ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం,ఉచిత్ విద్యుత్ అందివ్వడం,గోదాముల నిర్మాణంతో పాటు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చే అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నది. వ్యవసాయంలో దిగుబడులు పెంచేందుకు మైక్రో ఇరిగేషన్ ను ప్రోత్సహిస్తున్నది. గ్రీన్ హౌజ్ కల్టివేషన్,పాలీ హౌజ్‌లకు సబ్సిడీలు ఇవ్వడ డం జరుగుతున్నది. ఎస్సీ, ఎస్టీ రైతులకు పాలీహౌజ్ కల్టివేషన్‌లకు నూటికి నూరు శాతం సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా వ్యవసాయరంగ అభివృద్ధికి వ్యవసాయ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఆధునిక పద్దతులను పెంపొందించి తద్వారా అధిక దిగుబడులు సాధించే విధంగా రైతుకు రాబడిని రెట్టింపు చేసే విధంగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నది.

తెలంగాణ రాష్ట్రములో గ్రామీణాభివృద్ది, గ్రామీణ ప్రజల సంక్షేమమునకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి తెలంగాణను సంక్షేమ శ్రేయో రాష్ట్రంగా అవతరింపచేయాలని ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నది. తెలంగాణలోని అధిక జనాభా గ్రామాల్లోనే కలరు. అట్టి జనాభా సర్వతోముఖాభివృద్ధికి రంగాల వారీగా అభివృద్ధి చేయడానికి పలు దఫాలు చర్చలు జరుపుతూ వివిధ రకాల ప్రణాళికలు రూపొందిస్తూ అమలు చేస్తున్నది. గ్రామాల్లో విద్యా, వైద్యము, మంచినీరు,పారిశుధ్యము,రవాణా సౌకర్యాలు,సాగునీరు,నిరంతర విద్యుత్, మెరుగైన రోడ్డు సౌకర్యము లాంటి కీలకమైన మౌళిక వసతులను కల్పిస్తూ గ్రామసీమల భాగ్యోదయానికి బాటలు వేస్తూ ప్రభుత్వం కలలు గన్న బంగారు తెలంగాణ నిర్మాణము దిశగా అహర్శిశలు కృషి చేస్తున్నది. ఇలా సమాజంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతూ సంక్షేమాన్ని,శ్రేయస్సును పెంపొందిస్తూ సంక్షేమ శ్రేయో రాష్ట్రంగా అవతరించనున్నది.

**- చింతల దేవేందర్, తాడ్వాయి మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**

మైనారిటీ వర్గాల సంక్షేమంకోసం రూపొందించిన 15 సూత్రాల కార్యక్రమాన్ని మరింత ప్రత్యేక పథ కాల ద్వారా ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దనున్నట్లు ఆనాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ వెల్లడించగా 2005 ఫిబ్రవరి 25వ తేదీన పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ఈ ప్రకటన చేశారు. మైనారిటీల సంక్షేమంకోసం 15సూత్రాల కార్య క్రమాన్ని సవరించి అమలుచేస్తామని ప్రధాన మంత్రి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. సవరించిన 15 సూత్రాల కార్యక్రమంలో కచ్చితమైన లక్ష్యాలనునిర్దేశించామని నిర్దిష్టకాలపరిధి లోగా వాటిని సాధించాల్సి ఉంటుందని కూడా అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ స్పష్టం చేశారు. కానీ ఈ పథకాలు వాస్తవానికి ఎలా అమలవ్వతున్నాయో పరిశీలిస్తే విస్మయం కలుగుతుంది.

ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలలో మైనారిటీలకు సమానస్థాయి వాటా కల్పించేందుకు కొత్త పథకాలు ప్రస్తుత పథకాల ద్వారా కృషి చేయ డం, మైనారిటీ వర్గాలద్వారా 15 సూత్రాలపథకాల లక్ష్యం స్వయం ఉపాధికి అవసరమైన రుణసదుపాయాలను మరింత

# మైనారిటీ, సంక్షేమ పథకాలు

పెంపొందించ డం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పెంపొందించడం, పట్టణమున్సిపల్ ప్రాంతాలలో మైనారిటీ వర్గాలు కలిగిన మురికి వాడలలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి పథకంలో మైనారి టీలకు తగిన వాటా కల్పించడం ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగుపరచటం, మత సామరస్యం దెబ్బతినేందుకు దారితీసే సంఘటనలను నియంత్రిం చేందుకు, నివారించేందుకు ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవటం ఇవీ ముఖ్య అంశాలు.

**కార్యక్రమ లక్ష్యాలు:-**

విద్యావకాశాలను పెంపొందించటం, ప్రస్తుతం అమలు చేసే పథకాలు, కొత్త పథకాల ద్వారా ఆర్థిక కార్య కలాపాల్లో ఉపాధి రంగాల్లో మైనారిటీలకు సమానవాటా లభించేలా చర్యలు తీసుకోవడం, స్వయం ఉపాధికోసం రుణసదుపాయాన్ని పెంచడం, రాష్ట్రప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియమకాల్లో మైనారి టీలకువాటా కల్పించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాల అమలులో మైనారిటీలకు తగిన వాటా కల్పించి వారి జీవన పరిస్థి తులు మెరుగుపరచడం, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని సమానస్థాయిలో అందుబాటులో ఉంచటం, చిన్నపిల్లల, గర్భిణిల, పాలిచ్చే తల్లుల సంక్షేమ లక్ష్యంగా సమగ్ర శిశు అభివృద్ధి సేవలు పథకం రూపొందించింది. వారికి అనుబంధ పోషక ఆహా రం వ్యాధి నిరోధక సేవలు, ఆరోగ్య పరీక్షలు, విద్యరెఫర్ సేవలు తదితర సదుపాయాలను అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందించ డం ఈ పథకం ఉద్దేశ్యం.మైనారిటీవర్గాల ప్రజలు నివాసం ఉండే గ్రామాలు, మండలాలు ఐ.సి.డి.ఏ సేవలను కొన్ని అంగన్‌వాడి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.పాఠశాల విద్యకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ మైనారిటీవర్గాలవారు ఉండే ప్రాంతాలలో సర్వఅభియాన్, కస్తూరిబా గాంధీ విద్యాలయ పథకం కింద ఇతర ప్రభుత్వ పథకాల కింద పాఠశాలలు ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా ఉర్దూబోధనకు అదనపు వనరులు కల్పిస్తూ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించేందుకు కేంద్రం సహాయం అందిస్తుంది.

మదర్సాలలో బోధించే విద్యను ఆధునీకరించేందుకు ఈ పథకం ఉద్దేశించారు. మదర్సాల ఆధునీకరణ కార్యక్రమాన్ని పటిష్టంగా చేసి సమర్థవంతంగా అమలు చేస్తారు. ప్రతిభగల విద్యా ర్థులకు ఉ



పకారవేతనాలు అందిస్తారు. 10వ తరగతి వరకు 10వ తరగతి తర్వాత విద్యాభ్యాసంచేసే మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుంది. మౌలిక విద్య సదుపాయాలను మెరుగుపరుస్తుంది. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌలిక విద్య సదుపాయాల విస్తృతికి ప్రతిష్ఠాత్మకంగా అన్ని విధాలా సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. పేదల కోసం స్వయం ఉపాధిని అంది స్తారు. గ్రామీణ పేద కుటుంబాలకు సహాయం అందించే లక్ష్యంతో స్వర్ణజయంతి, గ్రామస్వరాజ్‌గార్ యోజన రూపొందించారు. గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖకు దిగువ్షన జీవించే మైనారిటీ వర్గాల లబ్ధిదారుల ప్రయోజనాల కోసం ఈ పథకం కింద కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తారు. స్వర్ణజయంతి షహరీ రోజ్‌గార్ యోజన పథకం కింద రెండు ప్రధాన భాగాలుగా ఉంటుంది.

పట్టణ స్వయం ఉపాధి కార్య క్రమాలు, పట్టణ వేతన ఉపాధి కార్యక్రమం అనే రెండు భాగాలుగా ఈ పథకం రూపొందించారు. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక, సామాజికపరమైన మౌలిక సదుపా యాలు కల్పించటంతో పాటు అదనంగా వేతనంతో కూడిన ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు.

దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇప్పటికే ప్రారంభమైనందున మిగిలిన జిల్లాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉండే మైనారిటీ వర్గాల లబ్ధిదారుల ప్రయోజనాల కు పథకం కింద కొన్ని కచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించారు. మైనా రిటీ వర్గాల ప్రజలలో ఆర్థికాభివ ృద్ధి, కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ మైనారిటీ అభివ ృద్ధి ఆర్థిక సహాయ సంస్థ 1994లో ఏర్పాటైనది. పూర్తిస్థాయిలో లక్ష్యాలను సాధించే విధంగా మరింతవాటా ధనానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వాటిని సమర్థవంతంగా కొనసాగించేం దుకు బ్యాంకు రుణాలు ఎంతో అవసరం.

ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చే రుణాలలో తగినశాతాన్ని మైనారిటీ వర్గాలకు కేటాయించేందు కు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుంది. పోలీసు సిబ్బంది నియా మకాల్లో మైనారిటీ వర్గాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకో వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. కేంద్ర పోలీస్ బలగాల కోసం నియామకాలు జరిపేటప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధమైన చర్యలు తీసుకొంటుంది. దేశంలో రైల్వేలు, జాతీయ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలు పెద్దసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ నియామకాల్లో కూడా మైనారిటీ వర్గాల అభ్యర్థులను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకొనేలా సంబం ధిత శాఖలు తగిన చర్యలు తీసుకొంటాయి. మైనారిటీ వర్గాల అభ్య ర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ ఇచ్చేందుకు ఒక ప్రత్యేక పథకం ప్రారంభిస్తారు. మైనారిటీవర్గాల జీవనస్థితిగతులు మెరుగు పరచడంతోపాటు గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో సమానస్థాయి వాటా కల్పిస్తుంది.

గ్రామీణ ప్రాంతాలలో మైనారిటీ వర్గాలకు చెందిన పేదల ప్రయోజనాల కోసం ప్రధాని ఆవాజ్ యోజన పథకం కింద కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తారు. సమగ్ర గ ృహనిర్మాణం మురికి వాడల అభివృద్ధి కార్యక్రమం జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరుద్ధరణ పథకం కింద కేంద్రం ఈ సహాయం అందిస్తుంది. మతపరంగా అల్లర్లు తలెత్తడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల నిష్పాక్షికతకు లౌకికతత్వానికి కట్టుబడి సమర్థతతో పనిచేసేజిల్లా అధికారులను, పోలీసు అధికారులను నియమించాలి. అలాంటి ప్రాంతాలలోను, ఇతర చోట్ల మతపరమైన ఉద్రేకతలు తలెత్తకుండా నిరోధించడం జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా పోలీస్ సూపరిం టెండెంట్లు ప్రధాన కర్తవ్యం కావాలి. మతకల్లోలాలను నిరోధించ డంలో వారి సామర్థ్యాన్ని పదోన్నతి కోసం ప్రధాన అంశంగా పరిగణనలోకి తీసుకోవాలి.

మతోన్మాదాన్ని, ఉద్రేకతలను రెచ్చగొట్టే వారిపై లేదా హింసాకాండలో పాల్గొనేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు వీలుగా ప్రత్యేక కోర్టులను కేటాయించాలి. మత కల్లోలాల బాధ్యులకు



పునరావాసానికి తగిన ఆర్థిక సహాయాన్ని కూడా వెంటనే అందించాలి. 1992వ సంవత్సరం జాతీయ మైనా రిటీ కమిషన్ చట్టంలోని 2(ఓ) సెక్షన్ గుర్తించిన ప్రకారం ఈ కార్య క్రమ లబ్ధిదారులను ఎంపికచేస్తారు. ఈ సెక్షన్ ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలను మైనారిటీలుగా గుర్తిస్తారు. అలా గుర్తించిన టార్గెట్ గ్రూపులకే ప్రయోజనాలు అందే లా లక్ష్యాలు నిర్దేశిస్తారు. జాతీయ మైనారిటీ కమిషన్ చట్టంలోని 2(ఓ) సెక్షన్ ప్రకారం మైనారిటీగా గుర్తింపు పొందిన ప్రజలు మరో రాష్ట్రంలో మెజారిటీ అయినపుడు వివిధ పథకాల ప్రయోజనాలు మైనారిటీ వర్గాలుగా నోటిపై చేసిన ఇతర గ్రూపులకు మాత్రమే వర్తి స్తాయి. ప్రతీరాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రధాని 15సూత్రాల పథకం అమలు చేసేందుకు తగు ఆదేశాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, జిల్లా కలెక్టర్లకు జారీ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రాష్ట్ర కమిటీ 15 సూత్రాల పథకంపై పర్యవేక్షణ నిల్. జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జరపాల్సిన జిల్లా కమిటీ సమా వేశాలు అరకొర. జిల్లా కలెక్టర్లు నిర్లక్ష్యధోరణి, జిల్లాస్థాయిలో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన మైనారిటీ సంక్షేమ శాఖాధి కారులు నిదురపోతున్నారు. మైనారిటీ సంక్షేమం కోసం రూపొం దించిన ఈ కార్యక్రమాల అమలుకు వీలుగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీ 15 సూత్రాల కార్యక్రమాల కింద అమలయ్యే వివిధ పథకాల శాకాధికారులు సభ్యులుగా ఉంటారు.

జిల్లా స్థాయిలో ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కోసం కమిటీ ఉంటుంది. జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీలో 15 సూత్రాల శాఖాధికారులు కార్యక్రమాన్ని అమలు చేసే వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. కార్యక్రమం అమలుతీరు, పర్యవేక్షణలో రాష్ట్రంలోమైనారిటీ సంక్షేమశాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తుంది. జిల్లా స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ నివేదికను రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖకు పంపించాలి.

15 సూత్రాలలో కొన్ని పథకాలపై విశ్లేషణ. రాష్ట్రసర్వశిక్ష అభియాన్, కస్తూరిబా విద్యబాలికల పథకంలో రాష్ట్రంలో సుమారు 60 కస్తూరిబా బాలి కల విద్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధ నలు 15 సూత్రాల నిబంధనల ప్రకారం ఈ పాఠశాలలు మైనారిటీ వర్గాలు కలిగిన ప్రాంతాలలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ●



# స్త్రీలపై హింస పరిస్థితి

**సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం కొందరు పండుగలు జరుపుకొంటారు. గత చరిత్రను.. పూర్వీకుల అనుభవాలను నెమరువేసుకుంటూ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి మరికొందరు ఉత్సవాలు చేసుకుంటారు. సమాజానికి ఏదైనా ఒక సందేశం ఇవ్వడానికి ఇంకొందరు ప్రత్యేక దినోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఏది చేసినా మానవాళి శ్రేయస్సు కోసమే.. అలాగే అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులు, హింస గురించి ఈరోజు ఆలోచించి, మన బాధ్యతలేమిటో తెలుసుకుందాం..**

నింగినైనా.. నేలనైనా.. అమూల్యమైనది మగువ అన్నాడో సినీ కవి. మహిళలను ఎన్ని విధాలుగా కీర్తించినా అదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు స్త్రీలు అనూహ్యరీతిలో హింసకు గురవుతున్నారు. గృహ హింస, అత్యాచారాలు, లైగింక వేధింపుల్లాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ అరికట్టి మహిళలను జాగృత పరచాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. నవంబర్ 25ను అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేఖ దినంగా ప్రకటిస్తూ 1999 డిసెంబర్ 17న ఓ తీర్మాణం చేసింది.

యూరప్‌లోని డొమినికా రిపబ్లిక్ అనే దేశాన్ని రాఫెల్ ట్రుజిల్లో పాలించేవాడు. అతని నియంతృత్వంగా పాలనకు వ్యతిరేకంగా మిరాబాల్ సిస్టర్స్ అనే నలుగురు మహిళలు పోరాటం సాగించారు. విషయం తెలుసుకున్న ట్రుజిల్లో మిరాబాల్ సిస్టర్స్‌లో ముగ్గురిని 1960 నవంబర్ 25న హత్య చేయించాడు. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి, నవంబర్ 25న స్త్రీ హింసా వ్యతిరేకతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న హింసపై అందరికీ అవగాహన కల్పించేందుకు నవంబర్ 25ను అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినంగా 1999లో ఐక్యరాజ్య సమితి గుర్తించింది. అప్పటి నుంచి అధికారికంగా ఈ దినాన్ని నిర్వహిస్తోంది.

ఓ దేశ మహిళ స్థితిగతుల్ని చూసి, ఆదేశ పరిస్థితిని చెప్పవచ్చు అన్నారు భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. నిజమే.. ఒక దేశానికి చెందిన మహిళలు, ఆ దేశ నాగరికతకు ప్రతిబింబాలు. నాగరికత ఆరంభం నుంచి మహిళలకు ఎంతో గుర్తింపు, ప్రాధాన్యత ఉండేది. ప్రాచీన భారతంలోని మహిళలు అన్ని కోణాల్లోనూ పురుషులతో సమాన స్థాయిని పొందేవారు. స్వయంవరం ద్వారా తన భర్తను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ కూడా ఆనాటి మహిళలు పొందారు. తదనంతరకాలం సమాజంలో స్త్రీల స్థాయి తగ్గుతూ వచ్చింది. మధ్య ప్రాచీన కాలంనాటికి వారి స్థితిగతుల్లో గణనీయమైన తేడాలొచ్చాయి. అప్పుడే స్త్రీల జీవితంలో చీకటి కోణం మొదలైంది. నేటి సమాజంలో స్త్రీలు ప్రతినిత్యం ఏదోఒక రూపంలో హింసకు గురవుతున్నారు. గృహ హింసలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువవుతున్నాయి. మహిళలపై హింస తగ్గాలంటే మొదటగా ఇంటి నుంచే మార్పు ప్రారంభంకావాలని ఆమ్నెస్టీ సంస్థ సూచిస్తున్నది. మహిళలకు సమాన హక్కులు, శాంతి, స్వేఛ్ఛలభించేలా సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలను కోరుతున్నది. మహిళలపై హింసను నివారించడం సమష్టి బాధ్యతగా భావించాలని విజ్ఞప్తి చేస్తున్నది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), లండన్ స్కూల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. 80కి పైగా దేశాల్లో మహిళలపై జరుగుతున్న హింస గురించి పలు దిగ్రాంతికర విషయాలను వెల్లడించాయి.

- ప్రపంచవ్యాప్తంగా లైంగిక అత్యాచారాలకు గురైన బాలికల సంఖ్య 12 కోట్లకు పైనే..
- లైంగిక దాడుల్లో 95% మంది నిందితులు బాధితులకు పరిచయం ఉన్నవారే.
- ప్రపంచంలోని ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరిని తమ సన్నిహితులే హింసిస్తున్నారు.
- 11% మందిపై 15 ఏళ్ల వయస్సు నుంచే తమ సన్నిహితులు లైంగిక హింసకు
- పాల్పడుతున్నారు.
- 15 నుంచి 19 ఏళ్లలోపు యువతుల్లో 54%మంది లైంగిక వేధింపులకు గురవుతున్నారు.
- 119 దేశాలు మాత్రమే గృహ హింసకు వ్యతిరేకంగా చట్టాలను అమలు చేస్తున్నాయి.

**మనదేశంలోనూ తక్కువేమీ కాదు..**

నిర్భయ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా మనదేశంలో మహిళలపై లైంగికదాడులు తగ్గడం లేదు.

- 2015లో నమోదైన లైంగిక దాడుల కేసులు : 34,561
- అత్యాచారానికి గురైనవారిలో చిన్నారులు : 8,800
- బాలికలు, యువతుల కిడ్నాప్‌కు సంబంధించి నమోదైన కేసులు : 59,277
- గతేడాది అక్రమ రవాణాకు గురైనవారు : 6,877
- దేశంలోని మహిళల్లోని గృహ హింస బాధితులు : దాదాపు 70% మంది

**- శ్రీనివాస్ చిల్ల**

# మహిళ బీడీ కార్మికుల స్థితి






దినమంతా బీడీలు చుట్టే చేతులు, చేత కొడవలి ధరించి పొలం పనులకు వెళ్లే మహిళలు ఉదయాన్నే తమ పిల్లల్ని శ్రద్ధగా బడికి పంపించడం చూస్తుంటే ఎలా ఉంటుంది? సంప్రదాయ బురఖాల మాటున జీవితాలు కరిగిపోయిన ఒకతరం రేపటి తరం గురించి, వారిని చదివించేందుకు అమిత శ్రద్ధ పెడుతుంటే ఎంతటి ఆనందం కలుగుతుంది? నెలవంక నవ్వినట్లే ఉంటుంది. చిరునవ్వులు చిందిస్తూ బడికి వెళుతున్న బాలికలను చూస్తుంటే స్వరాష్ట్రంలో నిండు పున్నమి వంటి రేపటి భవితపై గొప్ప విశ్వాసం కలుగుతోంది.

నిజమే. ప్రయత్నాలు మొదలయ్యాయి. ఒక ఆశ బీజ ప్రాయం దశలో ఉంది. ఇది గనుక మొక్కై...అటు పిమ్మట మానైతే...దారిద్ర్యరేఖ కింద నలిగిపోతున్న ముస్లింల జీవితాల్లో ఒక దశాబ్ద కాలంలోనే అనూహ్య మార్పు రావచ్చు. చదువుకోని ఆడపిల్లల సంఖ్య అప్పుడు మైనారిటీ అయినా ఆశ్చర్యం లేదు!

సంప్రదాయ కట్టుబాట్లు, పేదరికం, అవకాశాల లేమి -ఈ మూడు కారణాలతో ఇంతకాలం చదువు సంధ్యలకు దూరమైన ముస్లిం బాలికలు ఇప్పుడు బడిబాట పట్టారు. మదర్సాలలో చదివే పిల్లల కన్నా ప్రభుత్వ పాఠశాల్లో చదివే పిల్లల సంఖ్యే అధికంగా ఉండటం ఇందుకు నిదర్శనం.

ఇది కేవలం నిజామాబాద్ జిల్లాలోని ఒక్క కందకుర్తి గ్రామ పరిస్థితే కాదు, బినోల, బాసర తదితర అనేక గ్రామాల్లో కనిపించిన మార్పు. ఒకరివెంట ఒకరు బడిబాట పడుతున్న వైనం ముచ్చట గొలుపుతుంది. కందకుర్తినే ఉదాహరణగా తీసుకుంటే ఈ ఊరిలో అత్యధికంగా ముస్లింలే ఉంటారు. చాలామంది ముస్లిం స్త్రీలు కొడవలి ధరించి పంట పొలాల్లో పని చేసుకుంటూ కనిపిస్తారు. వ్యవసాయంపై పూర్తిగా ఆధారపడని కుటుంబాల్లో అయితే బీడీలు చుడుతూ కనిపిస్తారు.

**బాలికలతో బడికి కళ!**

చిత్రంగా ఆ తల్లులు తమ పిల్లల విద్యా వికాసం కోసం గత కొన్నేళ్లుగా శ్రద్ధ పెడుతున్నారు. బాలికలను చదివిస్తున్నారు. ఆ ఊరి పాఠశాలకు వెళ్తే ఆ విషయం కళ్లకు కడుతుంది కూడా. నిజమే మరి. కందకుర్తి ప్రాథమికోన్నత పాఠశాల్లో మూడు వందల విద్యార్థుల్లో 200 మంది ముస్లిం బాలికలే. ఎవరైనా కొత్తవారు సందర్శిస్తే ఇది బాలికల పాఠశాల కాబోలు అనుకుంటారు. ఈ గ్రామాన్ని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత దత్తత తీసుకున్నారు. చాలా విషయాలతో పాటు విద్యా విషయంగా ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రాథమికోన్నత పాఠశాలను ఈ సంవత్సరం నుంచి హైస్కూల్‌కి అప్‌గ్రేడ్ చేయించారు. అంతేకాదు ఎంపీ నిధులతో ఒక్కో అంగన్‌వాడీకి రెండు లక్షలు ఖర్చు పెట్టి మూడు మోడల్ అంగన్‌వాడీల్లో వినోద విజ్ఞానానికి వీలుగా మంచి సౌకర్యాలు కల్పించారు. దీంతో పిల్లలు.. బాలికలతో బడి కళకళలాడుతోంది.

**సర్కారు బడిపై సానుకూలత!**

పాఠశాలలో అత్యధికంగా బాలికలు ఉండటం ఒక ఆనందించే విషయమే గానీ అందుకు మరో కారణం ఉంది. బాలలను ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు పంపుతూ బాలికలను మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో వేస్తున్నారు. అయితే తల్లిదండ్రులతో మాట్లాడితే ఇందులో దాగిన ఆశావహ కోణం ఒకటి తెలిసింది. ఒకనాడు బాలికలను చదివించే స్థితే లేదు. మదర్సాలలో వేయడం తప్పా ఊర్లో ప్రభుత్వ పాఠశాల ఉన్నా పంపే పరిస్థితి లేకుండేది. కానీ ఇప్పుడలా కాదు.. తమ పిల్లల్ని చదివించడానికి తల్లిదండ్రులు సంసిద్ధంగా ఉన్నారు. పిల్లల్నందరినీ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే స్థోమత లేకపోవడం వల్ల బాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో వేస్తున్నారు. దీన్ని సానుకూలంగానే చూడాలి అని స్థానిక ఉపాధ్యాయుడు జలీల్ బేగ్ అన్నారు.

**ఆలోచనలో మార్పు!**

నిజానికి సంప్రదాయ ముస్లిం కుటుంబాల్లో బాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసేస్తారు. కానీ, ఇటీవలి కాలంలో తల్లిదండ్రుల ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది. స్థానికంగా అవకాశాలుంటే పిల్లల్ని చదివించడానికి వారికి ఏ అభ్యంతరం లేదని తెలుస్తోంది. భద్రత విషయంలో భయం తప్పా సంప్రదాయం ఒక్కటే వారిని అడ్డుకోవడం

లేదు. నిజానికి ఆర్థిక స్థితిగతులు వారిని ఇబ్బంది పెడుతున్నాయి. అంతకన్నా ముఖ్యం తమ పరిధిలో సరైన విద్యావకాశాలు లేకపోవడం వారి ఉత్సాహానికి అడ్డుగా ఉంది అని కందకుర్తి సర్పంచ్ ఖాలీం బేగ్ అన్నారు.

**అవకాశాల లేమి!**

నిజానికి అవకాశాల లేమి వీరిని చదువులకు దూరం చేస్తోంది. అందుకు బినోలా గ్రామం మంచి ఉదాహరణ. ఈ ఊరికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో నవీపేట మండల కేంద్రం ఉంది. ఇక్కడ ఇప్పటికీ ప్రభుత్వ కళాశాల లేదు. దాంతో గ్రామాల్లో పదవ తరగతి దాకా చదువుకున్న బాలబాలికలకు కనీసం ఇంటర్ చదివే పరిస్థితి లేదు. దాంతో ఉన్నత విద్య అన్న ఊహే వారికి ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలు పిల్లల్ని చదివించడం లేదు అనడం కన్నా అవకాశాల లేమి అనే చెప్పాలి అని స్థానిక టీచర్ రఘు అన్నారు.

**చైతన్యం అవసరం!**

స్వరాష్ట్రంలో ముస్లిం మైనారిటీల విద్యాభివృద్ధికి ఒక స్వయం ప్రతిపత్తిగల సంస్థ ఏర్పాటువడం ఒక పెద్ద ముందడుగు. దాంతో పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. మునుపెన్నడూ లేనట్లుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటిసారి తెలంగాణలో ముస్లిం రెసిడెన్షియల్ పాఠశాలలు వచ్చాయి. దాదాపు డెబ్బయ్ పాఠశాలలు ఇలా ప్రారంభమయ్యాయి. వచ్చే సంవత్సరం ఈ సంఖ్య రెట్టింపు కానున్నది. వీటివల్ల విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో విప్లవాత్మక మార్పు జరిగే అవకాశం ఉంది. అయితే ఇంకా మారుమూల గ్రామాలకు ఆ పాఠశాలల విలువ తెలియడం లేదు. అందుకే మరింత చైతన్యం గ్రామాల్లో నింపవలసే ఉంది. కేవలం విద్యావకాశాలు కల్పించడంతోనే సరిపోదు. చదువు విలువ గురించి, తద్వారా జరిగే వికాసం, మార్పు ఎలా ఉంటుందో తెలియజెప్పేలా ముస్లిం సమాజంతో ఒక సంభాషణ అవసరం. విద్యావంతులు, తల్లిదండ్రులు, ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలి. విద్యతోనే ఉపాధి, ఉద్యోగాలన్న విషయాన్ని అర్థం చేయించాలి అని బాసర ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అలీఖాన్ సూచించారు.

●

# ప్రపంచంలోని ఎవరికి తీసిపోని విధంగా తెలంగాణ విద్యా విధానం

తెలంగాణ లోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట ప్రభుత్వం పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు రాష్ట్రంలో 1250 నుంచి 1300 వరకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యాశాఖ పనిచేస్తుందని చెప్పారు. ది హిందూ గ్రూప్ ఏర్పాటు చేసిన ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ -2016 కాన్ఫరెన్స్‌ను విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్యా వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించామని చెప్పారు. వాటిని భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ సూచనలతో ప్రపంచంలో ఎవరికి తీసిపోని విధంగా తెలంగాణ విద్యా విధానాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.రాష్ట్రంల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో 2017 జూన్ నాటికి టాయలెట్స్, ఆర్వోప్లాంట్లు, రన్నింగ్ వాటర్, కంప్యూటర్ ల్యాబ్, కాంపౌండ్ వాల్స్, విద్యుత్, ప్రాక్టికల్ ల్యాబ్స్, భవనాలు వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించేందుకు తగిన ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఇదే సమయానికి అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం 3352 పాఠశాలల్లో డిజిటల్ క్లాసులను మొదటి దశలో ప్రారంభించామన్నారు. డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ అందించేందుకు తెలంగాణ స్కిల్, నాలెడ్జ్ సెంటర్లను ప్రతి కాలేజీలో ఏర్పాటు చేస్తామన్నారు. డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ సర్టిఫికేట్లు కూడా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు రాష్ట్రంలో అనేక జూనియర్, డిగ్రీ కాలేజీలకు అనుమతులిచ్చి మౌలిక వసతులు మాత్రం కల్పించలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఖాళీ స్థలాలున్న ఉన్న చోట డిగ్రీ, జూనియర్ కాలేజీలకు నూతన భవనాలను నిర్మిస్తుందన్నారు. దీంతో పాటు మౌలిక వసతులు కూడా కల్పిస్తామన్నారు. అదే విధంగా బోధన సిబ్బందిపై కూడా సీరియస్‌గా దృష్టి సారించామన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్దీకరించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కొన్ని న్యాయ మైన ఇబ్బందుల వల్ల జాప్యం జరుగుతుందన్నారు. ఇది పూర్తి కాగానే క్రమబద్దీకరణ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. క్రమబద్దీకరణ తర్వాత ఉన్న ఖాళీలను గుర్తించి వాటిని వెంటనే భర్తీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ మంచి కార్యక్రమమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆయన ఆకాంక్షించారు. దీనివల్ల పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు ఒక వేదిక మీదకు వస్తారన్నారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పులు రావాలనే అంశాలపై చర్చ జరిగితే పలు రకాల సూచనలు వచ్చే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చాలా సంస్థలు అనేక కార్యక్రమాలు చేస్తున్నాయని చెప్పారు. అయితే కార్పొరేట్ రెస్పాన్సిబులిటీలో ఎక్కువగా విద్యపై దృష్టి సారించాలని కోరారు.

దీనివల్ల ఎక్కువ మందికి మేలు చేసినట్లు అవుతుందని తెలిపారు. విశ్వ విద్యాలయాల్లో జరిగే పరిశోధనలకు కూడా కార్పొరేట్ సంస్థలు ప్రోత్సాహం అందించాలన్నారు. మనకు కావాల్సిన వాటిని మనమే రూపొందించుకునే విధంగా పరిశోధనలు జరగాలన్నారు. ఇందుకు కార్పొరేట్ సంస్థల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు.

●



# తెలుగు సినిమాలో తెలంగాణం

తెలుగు సినిమా చరిత్రకు సుమారు 85 ఏండ్లు. భక్తరామదాసు అంటే నాగార్జున అని, రుద్రమదేవి అంటే అనుష్క అని అనేంతగా సినిమా మాధ్యమం ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. 1931లో ప్రారంభమైన సినిమా రంగంలోకి 1961 వరకు (మూడు దశాబ్దాల కాలం) తెలంగాణకు చెందిన కవులు, రచయితలు ప్రవేశించలేదు. ఆ తర్వాత క్రమంగా తెలంగాణ వారి ప్రాతినిధ్యం పెరిగింది. తెలుగు సినిమా పుట్టుక నుంచి దాని అభివృద్ధికి తెలంగాణ వారు చేసిన సేవపై ప్రత్యేక కథనం...

**తెలంగాణ సినీ కవులు**

- **చందాల కేశవదాసు:** 1876 జూన్ 20న లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు ఖమ్మం జిల్లా జక్కేపల్లిలో జన్మించారు. కేశవదాసు తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. వీరు రచించిన కనకతార (1911) నాటకాన్ని సరస్వతీ టాకీసువారు 1937లో సినిమా తీశారు. హెచ్‌వీ బాబు దర్శకుడిగా తీసిన ఈ సినిమాలో కేశవదాసు రెండు సీసపద్యాలు, మూడు పాటలను మాత్రమే తీసుకున్నారు. ఇదే కనకతార పేరుతో 1955లో మరో సినిమా తీశారు. 1931లో హెచ్ఎం రెడ్డి తీసిన భక్తప్రహ్లాదలో కేశవదాసుతో పాట రాయించారు. అదే పరితాప భారంబు భరియింపుతరమా! కటకట నేనిది గడువంగ జాలుదు పతి ఆజ్ఞను మీరగలనా! అనే పాట. లీలావతి పాత్రకు ఈ పాటను ఉపయోగించారు. తెలుగు చలనచిత్ర చరిత్రలో తొలి సినిమా పాట రాసిన ఘనత ఈయకు దక్కింది. 1935లో సతీ అనసూయ చిత్రానికి మాటలు, పాటలు రాశారు. స్టడీ క్రానికల్ ప్రెస్, మౌంట్ రోడ్ మద్రాస్‌వారు ఈ సినిమాపై వేసిన పుస్తకంలో సతీ అనసూయ బ్యానర్‌లో కేశవదాసు ఫొటో వేశారు. గొప్ప బెంగాలీ దర్శకుడు అహిన్ చౌదరి దీనికి దర్శకుడు. 1936 చివరలో లంకాదహనం చిత్రానికి కేశవదాసు స్క్రిప్ట్ రాశారు. 1939లో లక్ష్మీసినీ టౌన్ రాధాకృష్ణ సినిమాకు కేశవదాసు కొన్ని పాటలు రాశారు. 1945లో బాలరాజు సినిమాలో కూడా పాట రాశారు. 1922లో ముత్తరాజు సుబ్బారావు రచించిన శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ఆయన రాసిన పాటల్లో భలే మంచి చౌకబేరము ఇది సమయము మించినన్ దొరకదు త్వరన్ గొనుడి సుజనులారా అనే పాటను 1955లో రాజరాజేశ్వరి ఫిల్మ్ కంపెనీవారు తీసిన శ్రీకృష్ణతులాభారం సినిమాలో వాడుకున్నారు. సీఎస్ రావు దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో కేశవదాసు పేరు వేయకుండా దైతా గోపాలం పేరు వేశారు. నాటకాలను సినిమాలకు అనుగుణంగా మార్చిన ఘనత కేశవదాసుదే. 1966లో సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డీ రామానాయుడు శ్రీకృష్ణతులాభారం తీసి కేశవదాసు పేరు వేయకపోయేసరికి ఆయన కుమారుడు కృష్ణమూర్తి ఖమ్మం కోర్టులో కాపీరైట్ కింద దావా వేయగా (నం-1966), ఆరుద్ర, శ్రీశ్రీ, దాశరథి సాక్ష్యం ఇచ్చారు. మూడు పాటలను వాడుకున్నారు. అవి.. 1) భలే మంచి చౌకబేరము 2) మునివరా తుదకిట్లు 3) కొట్టుకోండిరా. 1971లో కొన్ని రీప్రింట్లు వేసి దాసు పేరు వేశారు. భలే మంచి చౌకబేరము రాసింది తానేనని స్థానం నర్సింహారావు నటస్థానం అనే ఆత్మకథలో పేర్కొనడం దురదృష్టకరమని ప్రముఖ తెలంగాణ చరిత్రకారుడు జితేంద్రబాబు రాశారు. 1956లో నాయకన్‌గూడెంలో దాసు మరణించారు. ఎం పురుషోత్తమాచార్యులు (నీలగిరి) ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కేశవదాసు సాహిత్యంపై పరిశోధన చేసి గ్రంథాన్ని ప్రచురించారు.

- **ఎం ప్రభాకర్‌రెడ్డి**

  మూడున్నర దశాబ్దాలు విభిన్న పాత్రలు పోషించి విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, నిర్మాతగా, దర్శకుడిగా, హీరోగా పేరుతెచ్చుకున్న విలక్షణ నటుడు ప్రభాకర్‌రెడ్డి. మిర్యాలగూడెంకు దగ్గరలోని తుంగతుర్తిలో 1936 జూలైలో లక్ష్మారెడ్డి, కౌసల్య దంపతులకు జన్మించారు. 1961లో రామినీడు దర్శకత్వంలో చివరకు మిగిలేది చిత్రం ద్వారా పరిచయమై 500 సినిమాల్లో నటించారు. నిర్మాతగా పచ్చని సంసారం, పండంటి కాపురం, గాంధీపుట్టిన దేశం, మాకూ స్వాతంత్ర్యం వచ్చింది, ధర్మాత్ముడు, గృహప్రవేశం, కార్తీకదీపం సినిమాలు నిర్మించారు. మండలాధీశుడు, గండికోట రహస్యం, ప్రతిభావంతుడు, ప్రచండ భారతం సినిమాలకు దర్శకత్వం వహించారు. 21 చిత్రాలకు కథలు రాశారు. పండంటి కాపురం సినిమాకు ఉత్తమ జాతీయచిత్రంగా అవార్డు వచ్చింది. గృహప్రవేశం సినిమాలో మోహన్‌బాబును హీరోగా పరిచయం చేశారు. వృద్ధ కళాకారుల సంక్షేమం కోసం తీసిన కామ్రేడ్ సినిమా విడుదల కాకముందే (1997) మరణించారు.

- **బీ నర్సింగరావు**

  గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో 1946, డిసెంబర్ 26న జన్మించారు. సినిమా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన

ఘనత ఈయనకు దక్కింది. 1940–48లో సారథి స్టూడియోస్ జీ రవీంద్రనాథ్‌తో కలిసి సంచలన చిత్రం మా భూమి తీశారు. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా తీసిన చిత్రం ఇది. దీనికి బెంగాల్‌కు చెందిన గౌతంఘోష్ దర్శకుడు. ఇందులో భూపాల్‌రెడ్డి, కాకరాల, నర్సింగరావు, యాదగిరి, ఎంబీవీకే ప్రసాదరావు, గోపీచంద్ కుమారుడు సాయిచంద్ నటించారు. డైలాగులు తెలంగాణ భాషలో ఉన్నాయి. స్క్రిప్ట్ బీ నర్సింగరావు, ప్రాణ్‌రావు తయారుచేశారు. కథా రచయిత ఉర్దూ కిషన్‌చందర్. రజాకార్లు, పోలీసుల వల్ల జరిగిన హింసాకాండతో తెలంగాణ ఎలా రక్తసిక్తం అయిందో ఈ సినిమా తెలియజేస్తుంది. ఇందులో గద్దర్, సంధ్య, కేబీకే మోహన్‌రాజు పాటలు పాడారు. 1983లో తన స్వీయ దర్శకత్వంలో రంగుల కల సినిమా తీశారు. ఇది జాతీయస్థాయిలో ఉత్తమ చిత్రంగా అవార్డు దక్కించుకుంది. ఇంకా దాసి సినిమా కూడా తీశారు. దీనికి 1989లో 5 జాతీయ అవార్డులు వచ్చాయి. ఇందులో అర్చన, మోయిన్ అలీబేగ్, నీనాగుప్తా నటించారు. జాతీయస్థాయి ఉత్తమ తెలుగు చిత్రంగా అవార్డు వచ్చింది. నర్సింగరావు రష్యా, జర్మనీ, చెకోస్లోవేకియా, ఇటలీ, అమెరికా, కెనడా వంటి దేశాలు తిరిగి తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు. ఈయన 1984లో నిర్వహించిన ఇండియన్ పనోరమా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు.

- **కుమ్రంభీమ్**

  ఆదిలాబాద్ గిరిజన వీరుడు. ఈ చిత్ర దర్శకుడు అల్లాణి శ్రీధర్. సంగీత దర్శకుడు గౌతంఘోష్. ఆదివాసి చిత్ర బ్యానర్‌పై ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నిర్మించింది.

- **అజిత్ హమీద్ అలీఖాన్**

  1922, జనవరి 22న గోల్కొండలో జన్మించారు. ఈయన తండ్రి బషీర్ అలీఖాన్. బాలీవుడ్‌లో ఐదున్నర దశాబ్దాలు హీరోగా, విలన్‌గా నటించారు. పుస్తకాలు అమ్ముకొని 1943లో బొంబాయి వెళ్లాడు. జంజీర్, యాదోంకి బారాత్‌లో నటించాడు. నాస్టిక్, మొఘల్ –ఏ– ఆజం, టవర్‌హౌస్, బర్మారోడ్ (1962), షికారి (1963), నమస్తేజీ, మైహూం, అలాదిన్, హిమాలయ్‌కీ గోద్మే (1965) చిత్రాల్లో నటించారు. 1998, అక్టోబర్ 21న హైదరాబాద్‌లో మరణించారు. మొత్తం 57 చిత్రాల్లో నటించారు.

- **హైదరాబాద్‌లో బండి కథ (1928–57)**

  1910 ప్రారంభంలో తోపుడు బండిలో ప్రొజెక్టర్ సాయంతో తెరపై బొమ్మ వేసేవారు. మహిమూద్‌మియా సినిమా బండి హైదరాబాద్ సినిమా చరిత్రకు తొలి రోజులు. 1908లో మూసీ నది వరదలను చిత్రీకరించారు. సినిమా బండి టికెట్ అర్ధణా (మూడు పైసలు) ఉండేది. 1931 తరువాత మాటల సినిమాలు రావటం, థియేటర్ల నిర్మాణంతో తోపుడు బండి పోయింది.

- **కత్తి కాంతారావు**

  పాత తరం హీరో, జానపద కథానాయకుడు కాంతారావు అసలు పేరు తాటికొండ లక్ష్మీకాంతారావు. 1923 సెప్టెంబర్ 21న నేటి సూర్యాపేట జిల్లా కోదాడ దగ్గరలో ఉన్న గుడిబండ గ్రామంలో జన్మించారు. 450 చిత్రాల్లో నటించారు. నటప్రపూర? బిరుదు పొందారు. రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. రేపాల గ్రామ వెలుగు నాట్యమండలి ద్వారా వెలుగులోకి వచ్చారు. సురభి కళాకారుడు కూడా. చలనచిత్ర పితామహుడు రోహిణీ సంస్థ అధినేత హెచ్ఎం రెడ్డి తీసిన ప్రతిజ్ఞలో హీరోగా నటించారు. నిర్మాతగా సప్తస్వరాలు, గుండెలు తీసిన మొనగాడు, గండరగండడు, ప్రేమజీవులు, స్వాతిచినుకులు సినిమాలు తీశారు. ఈయన భార్య హైమావతి. గుడిబండలోని 400 ఎకరాల భూమిని దానం చేసిన దాత. నారదుడు, లక్ష్మణుడు, శివుడు, అర్జునుడి పాత్రల్లో జీవించారు.

- **సుద్దాల హనుమంతు**

  సినీ కవి. పల్లెటూరి పిల్లగాడా పసులు కాసే మొనగాడా పాటను రాశారు. 1908 డిసెంబర్‌లో పాలడుగు గ్రామంలో జన్మించారు. నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నారు. 1982, అక్టోబర్ 10న మరణించారు.

- **హైదరాబాద్‌లో సినిమాల సెన్సార్**

  1924లో హైదరాబాద్‌లో సెన్సార్‌షిప్ మొదలైంది. ఏడో నిజాం దీన్ని ఏర్పాటు చేశాడు. విదేశీ మూకీల్లోని ముద్దు సన్నివేశాలు, అర్ధనగ్న దృశ్యాల పట్ల అభ్యంతరాలు మొదలయ్యాయి. దీంతో కలకత్తా మదన్ థియేటర్ నిర్మించిన పతిభక్తి (1922), హేర్‌రాండు సినిమాలు సెన్సార్‌షిప్‌నకు గురయ్యాయి. అవి ముద్దు దృశ్యాలపై. 1924లో ధీరేన్ గంగూలీ నిర్మించిన రజియాబేగం హైదరాబాద్‌లో విడుదలయింది. ఇది సెన్సార్‌షిప్‌నకు గురైంది.

- **ఎంవీ రాజు (సుస్వరాల రాజు)**

  ఇతని పూర్తిపేరు మందపాటి వెంకటరాజు. నేటి సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ వాసి. 1919, డిసెంబర్ 18న జన్మించారు. మొదట సంగీత దర్శకుడు పీ చలపతిరావు వద్ద సహాయకుడిగా పనిచేశారు. భక్త కనకదాసు కన్నడ సినిమాతో సంగీత దర్శకులయ్యారు. జాతీయ ఉత్తమ సంగీత దర్శకులయింది ఈ సినిమాతోనే. అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ద్వారా అవార్డును అందుకున్నారు. ఈయన తెలుగు, కన్నడ భాషల్లోని స్వర?గౌరి, ధర్మస్థల మహత్యం, రాజు, నాగమోహిని వంటి 60కి పైగా సినిమాలకు సంగీతాన్ని అందించారు.

- **అల్లాణి శ్రీధర్**

  జిన్నారం వాసి. కుమ్రంభీమ్ చిత్ర దర్శకుడు.

- **గద్దర్**

  ఈయన అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు. మా భూమి సినిమాలోని బండెనక బండి కట్టి పాటను పాడారు. జైబోలో తెలంగాణ సినిమాలో పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పాట పాడారు. అమ్మా తెలంగాణమా, నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా వంటి పాటలను రాశారు. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మ పాటకు ఉత్తమ గీతంగా నంది అవార్డు వచ్చింది. గద్దర్ పేరుతో ఈయన రాసిన పాటలు జనాదరణ

పొందాయి.

- **సినారె**

ఈయన పూర్తిపేరు సింగిరెడ్డి నారాయణరెడ్డి. 1931, జూలై 29న సిరిసిల్ల తాలూకా హన్మాజీపేటలో జన్మించారు. గుమ్మడి వెంకటేశ్వరరావు ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. ఎన్టీఆర్ గులేబకావళికథ సినిమాకు పాటలు రాయడంతో సినీ ప్రస్థానం మొదలయింది. నన్ను దోచుకువందువటే వన్నెల దొరసాని, కలల అలలపై తేలెను మనసు మల్లెపూవై వంటి ఎవర్‌గ్రీన్ పాటలు రాశారు. ఎక్కువగా లలిత గీతాలు రాశారు. ఘంటసాల పాడిన వాటిల్లో ఎక్కువగా సినారె పాటలే ఉన్నాయి. దాదాపు 300 సినిమా పాటలు రాశారు. 2003లో ఉత్తమ గేయరచయితగా నంది అవార్డును అందుకున్నారు. సినారె రాసిన మరికొన్ని సూపర్‌హిట్ పాటలు 1) పగలే వెన్నెల జగమే ఊయల 2) చిగురులు వేసిన కలలన్నీ సిగలో పూలుగా మారినవి 3) మాయదారి సిన్నోడు మనసే లాగేసిండు (అమ్మపాట) 4) మనసు పాడింది సన్నాయి పాట (పుణ్యవతి) 5) నా మది నిన్ను పిలిచింది గానమై (ఆరాధన) 6) కనుల ముందు నీవుంటే (చెల్లెలి కాపురం) 7) తోటలో నా రాజు తొంగిచూసెను (ఏకవీర).

**దాశరథి కృష్ణమాచార్య**

మహబూబాబాద్ చిన్నగూడూరు గ్రామంలో 1925, జూలై 22న జన్మించారు. ఉమ్మడి రాష్ట్ర ఆస్థాన కవి. నా తెలంగాణ రత్నాల వీణ అన్న కవి. ఈయన రాసిన సినిమా పాటలు 1) నా కంటి పాపలో నిదురపోరా (వాగ్దానం 1960) 2) ఖుషీ ఖుషీగా నవ్వుతూ (ఇద్దరు మిత్రులు 1961) 3) ఒహో గులాబీ బాల అందాల ప్రేమ మాల (మంచిమనిషి 1964) 4) తిరుమల మందిర సుందర (మేనకోడలు 1972) 5) కలిసిన హృదయాల్లోన (ప్రేమ పగ 1978) 6) ఓ బంగరు రంగుల చిలకా (తోటరాముడు 1975) 7) మదిలో వీణలు మోగే (ఆత్మీయులు 1969) 8) మనసే కోవెలగా (మాతృదేవత 1969). 1987 నవంబర్ 5న మరణించారు. సినీ పరిశ్రమలో సినారె, దాశరథి సూర్యచంద్రుల్లా వెలిగారు. దాశరథి 1961–87 మధ్యకాలంలో 2000 సినిమా పాటలు రాశారు.

★



# సోషల్ ఆడిట్ పై డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్‌లకు టిసిపార్డులో శిక్షణా కార్యక్రమం

సోషల్ ఆడిట్ పై డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌లకు 3 రోజులు శిక్షగా కార్యక్రమాన్ని ది.8.12.2016 టిసి పార్డ్ జాయింట్ డైరెక్టర్ శ్రీ బి. నరేంద్రనాద్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి. ఆర్ .పి. లు సోషల్ ఆడిట్ లో క్రియాశిలకపాత్ర పోషించాలన్నారు. పారదర్శకంగా మరియు జవాబు దారితనంతో పనిచేయాలని సూచించారు. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జిఎస్ కార్యక్రమంలో చేపట్టిన సామాజిక తనిఖీ పక్రీయ ద్వారా ప్రజల్లో సామాజిక మార్పు కలిగిందని కొనియాడారు. అదే విధంగా సోషల్ ఆడిట్ లో ప్రతి ఒక్కరూ జియో.ఎం.జి.ఎన్ ఆర్. ఇ. జి.ఎస్ పై అవగాహన పెంచుకుని ఉపయోగించాలని సూచించారు. జి.యో.ఎం.జి ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పై టి సిఫార్సు నిర్వహించిన శిక్షగా కార్యక్రమాలకు గాను జాతీయ స్థాయిలో టిసిపార్డుకు అవార్డు లభించిందని కొనియాడారు. ఈ 6 రోజులు శిక్షగా కాలాన్ని సద్వినియోగ పర్చుకుని శిక్షణ అందిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ గ్రామాల్లో సామాజిక తణికీ ద్వారా ప్రజల్లో కొత్త చైతన్యం కలిగించాలన్నారు. ప్రభుత్వ పథకాలలో అవకతవకలు జరిగినచో ప్రజలలో సంకల్ప బలాన్ని నింపి ప్రశ్నించేతత్వాల్ని పెంచాలి. తద్వారా వారు ఒక కొత్త మార్గాన్ని అన్వేశించగలగాలి. ఆమార్గం ద్వారా ప్రజలను సమయత్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్ళడంలో గ్రామీణాభివృద్ధి శాఖతో పనిచేసే ప్రతి ఒక్కరూ కృషి చేసి బంగారు తెలంగాణాకు పాటు పడాలన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమాన్ని టిసిపార్డ్–సోషల్ ఆడిట్ సెంటర్ హెడ్ శ్రీమతి కుసుమ మధూరి గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిసిపార్డు సలహదారు శ్రీజయపాలరెడ్డి సోషలో ఆడిట్ కో–ఆర్డినేటర్ శ్రీ.శ్రీనివాస్ రిసెర్చ్ అసోషియేట్ శ్రీమితి.పద్మజ పాల్గొన్నారు. ఈ శిక్షణాకార్యక్రమంలో తెలంగాణ వివిధ జిల్లాలనుండి మంది డి.ఆర్.పిలు పాల్గొన్నారు.



# సౌరవిద్యుత్‌తో గృహ వినియోగం

**ఓ అంచనా ప్రకారం, మీటరున్నర పొడుగు, మీటరున్నర వెడల్పు ఉన్న ప్రదేశం తీసుకుంటే, ఆ ప్రదేశంలో ఒక రోజు పడిన ఎండ నుంచి ఒక గ్యాసుపొయ్యిని ఒక రోజంతా పూర్తిస్థాయిలో వినియోగిస్తే లభించేంత శక్తి ఉత్పన్నం అవుతుంది. కేంద్ర నూతన, పునర్వినియోగ ఇంధన వనరుల శాఖ 1982లో ప్రచురించిన** Global Radiation Data **నివేదిక ప్రకారం, దేశంలో రాజస్థాన్, గుజరాత్ లాంటి చోట్ల సగటు సూర్యరశ్మిని పరిగణనలోకి తీసుకుంటే, చదరపు మీటరుకు ఏడాదికి 2000 కిలోవాట్ల మేర సోలార్ రేడియేషన్ ఉత్పన్నం అవుతుంది.**

భూమి మీద ఉన్న ఇంధన వనరులు పరిమితమైనవని, వాడుతూపోతే అవి తరిగి పోతాయనే అవగాహన మొదలైంది. దాంతో ప్రత్యామ్నాయ ఇంధన వనరులను గురించిన జిజ్ఞాస మొదలయింది. తరిగి పోతున్న బొగ్గు, చమురు లాంటి శిలాజ ఇంధనాలు, పెరుగుతున్న ఇంధన అవసరాలు ప్రస్తుతం ప్రపంచ దేశాలకు అందోళన కల్గించే అంశాల్లో ప్రధానమైనవిగా ఉన్నాయి. ఇంధన అవసరాలకు పవన శక్తిని, సౌరశక్తిని వినియోగించుకోవటమే ప్రస్తుతం మానవాళి ముందున్న సులభమైన ప్రత్యామ్నాయం. ఉత్తర యూరోప్‌కు వలసవాదులు చేరినప్పుడు పవన విద్యుత్ వాడకాన్ని యాంత్రిక అవసరాల కోసం – అంటే నీటి మోటార్లు, పిండి మిల్లులు నడపటం లాంటి పనులకు వాడటం మొదలుపెట్టారు. దీన్ని కూడా రోమనే ప్రోత్సహించారు. తర్వాతి కాలంలో, సిలికాన్ లాంటి పదార్థాలను అభివృద్ధి చేయటం, సూర్యుడి నుంచి వచ్చే కాంతి తరంగాలు – షార్ట్ వేవ్, లాంగ్ వేవ్, రెంటినీ విద్యుత్‌గా మార్చే పరికరాలను రూపొందించటంతో సౌర విద్యుత్ వినియోగంలోకి వచ్చింది.

ఈ సోలార్ రేడియేషన్ అంతటినీ, కొంత మేర నష్టం ఉన్నప్పటికీ, విద్యుత్‌గా మార్చుకునే అవకాశం ఉంటుంది. తూర్పు బీహార్, ఈశాన్య రాష్ట్రాలు, ఈశాన్య పశ్చిమ బెంగాల్ లాంటి చోట్ల ఈ రేడియేషన్ సుమారు 1700 కిలో వాట్లుగా ఉంటుంది. మిగిలిన ప్రాంతాలలో రేడియేషన్ ఈ రెంటికీ మధ్య ఉంటుందని అంతర్జాతీయ ప్రమాణాల మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అంచనా వేశాయి. ఇంత అపార శక్తి వనరును పూర్తిగా ఉపయోగించుకుంటున్నమా అంటే, ఎంత మాత్రం లేదనే చెప్పాలి. దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం విద్యుత్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి 5 శాతం కన్నా తక్కువ ఉంటే, సంప్రదాయేతర ఇంధన వనరులలో కూడా సౌర విద్యుత్ వాటా ప్రసుతం నామ మాత్రంగానే ఉంది.

**ఫోటో వోల్టాయిక్ విధానం**

కేంద్ర నూతన, పునర్వినియోగ ఇంధన శాఖ ధృవీకరణ మేరకు అమెరికాకు చెందిన National Renewable Energy Laboratory భారత్‌లోని సౌరవనరులను అంచనా వేసింది. ఏడేళ్ళ వార్షిక సగటును పరిగణిస్తూ, సాటిలైట్ చిత్రాల సాయంతో, దేశంలో ప్రత్యక్షంగా అందుబాటులో ఉండే సాధారణ సౌర వనరును అంచనా వేసింది.

భూ వాతావరణంలోని ఏరోసోల్ ఆప్టికల్ డెఫ్ ఓజోన్, గాలిలోని తేమ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ, ఈ అంచనాలను రూపొందించినట్లు NREL పేర్కొంది. 2008 లో ఈ డాటాను క్రోడీకరించింది. దేశ వ్యాప్తంగా సగటున ఏడాది పోడుగూనా అందుబాటులో ఉండే సౌర వనరు పరిమాణం పట్ల ఇది అవగాహన ఇస్తుంది.

కనీసం వచ్చే 500 కోట్ల ఏళ్ళ వరకు సౌర శక్తి ప్రసారం కొనసాగుతుంది కనుక సౌర విద్యుత్‌ను ఆధార పడదగిన ఇంధన వనరుగా చూడాల్సిన అవసరం ఉంది.

**నవ సౌర శకం:–**

ఇటీవల పారిస్‌లో జరిగిన చారిత్రక ఒప్పందంలో సౌర విద్యుత్

ఉత్పాదనను ఉద్యమ స్థాయిలో చేబడతామని అమెరికా, చైనా సహా 121 దేశాలు అంగీకరించాయి. అంతర్జాతీయ సౌర కూటమిగా ఏర్పడ్డాయి. దాని ప్రకారం, 2030 సంవత్సరం నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో సౌర్ విద్యుత్ రంగాల్లో 10,000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులను పెట్టాలి. ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పాదక రంగంలో పెద్ద ఎత్తున నిధులను ఖర్చుచేయాలని, తద్వారా, పవన విద్యుత్, సౌర్ విద్యుత్ వాడకాన్ని పెంచాలని అంగీకరించాయి. బొగ్గు, చమురు వంటి ఇంధనాలపై ఒత్తిడిని తగ్గించాలని అభిప్రాయపడ్డాయి. ఈ అంతర్జాతీయ సౌర విద్యుత్ కూటమి కార్యకలాపాలకు భారత్ నేతృత్వం వహించటం, దేశ సౌర విద్యుత్ రంగానికి నవశకమనే చెప్పాలి.


ఒక అధ్యయనం ప్రకారం, ప్రపంచంలో ప్రస్తుతం 786 గిగావాట్ల ప్రత్యామ్నాయ విద్యుత్ స్థాపిత సామర్థ్యం ఉంది. దీనిలో ఎక్కువ భాగం పవన విద్యుత్, సౌర్ విద్యుత్ కావటం విశేషం. దేశాల విషయానికి వస్తే, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల స్థాపిత సామర్థ్యం విషయంలో చైనా 199 గిగా వాట్లతో ప్రపంచ దేశాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. అమెరికా, 122 గిగా వాట్లతో రెండో స్థానంలో నిలిచింది. భారత్ 38.5 గిగా వాట్ల స్థాపిత సామర్థ్యంతో ఎనిమిదవ స్థానంలో ఉంది. తాజా లెక్కల ప్రకారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 7.8 గిగా వాట్ల స్థాపిత సౌర్ విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం ఉంది. దీన్ని వచ్చే ఏడాది కల్లా 10.5 గిగా వాట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సౌర విద్యుత్ ఉత్పాదనను పెంచటానికి దేశవ్యాప్తంగా 20,000 కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు అవసరం అవుతాయని ఒక అంచనా. అందులో భాగంగానే భారత సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచటానికి చేయూత నిచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ ముందుకు వచ్చింది. 100 కోట్ల డాలర్లను పెట్టుబడిగా అందించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఇందులోనూ, 62.5 కోట్ల డాలర్లను పౌరసౌర విద్యుత్ ఉత్పత్తికి అంటే పౌరులు తమ ఇళ్ళపై సౌర ఫలాకాలను అమర్చుకోవటం సౌర పైకప్పుల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం ఖర్చుచేయాలని ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఇలా దేశ వ్యాప్తంగా సౌర పైకప్పుల ద్వారా రానున్న 5 ఏళ్ళలో 40 గిగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం పథకాలు రూపొందించింది.

**గృహ అవసరాలు:**

గృహ అవసరాలకు సౌర విద్యుత్ వినియోగాన్ని ఖచ్చితంగా అంచనా వేయటానికి ఇదమిద్ధమైన పద్ధతి కానీ మదింప చేసే ప్రక్రియ కానీ లేవు. ఎందుకంటే, సౌర విద్యుత్ అవసరాన్ని లెక్కించాలంటే వినియోగస్థాయే ప్రాతిపదిక. అంటే, ఒక ఇంటిలో విద్యుత్ వినియోగానికి ఎంత సామర్థ్యం ఉన్న సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలో తెలియాలంటే ఆ ఇంటిలో వినియోగించే విద్యుత్ పరికరాలు, వాటికి అవసరం అయిన ఇంధన సామర్థ్యం, వాస్తవంగా వినియోగించే విద్యుత్ ఎంత అన్న అంశాలపైనే దీన్ని నిర్ణయించాల్సి ఉంటుంది. మరోలా చెప్పాలంటే, వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న రెండు ఫ్లాట్‌లలో నివసించేవారికి ఒకే సామర్థ్యం ఉన్న సౌర ఫలకాలు సరిపోతాయనటానికి వీలు లేదు. ఆయా కుటుంబాల విద్యుత్ అవసరాలు, వాడకం పద్ధతి, అలవాట్లపై ఆయ కుటుంబాల వాస్తవ విద్యుత్ వాడకం ఆధారపడుతుంది. అలాగే ఆయా వాస్తవ వాడకానికి సరిపడా సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

గృహ వినియోగానికి సౌరశక్తిని వినియోగించుకోగలిగే పద్ధతులు, వాటిని ఏ ఏ పరికరాలకు వాడుకోవచ్చో అర్థం చేసుకునేందుకు వీలుగా గీసిన ఫోచార్ట్ క్రింద చూడండి.

నిపుణుల స్థూల అంచనాల ప్రకారం ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ప్రస్తుత సాంప్రదాయ పద్ధతిలో నెలకు 300 నుంచి 400 యూనిట్ల విద్యుత్‌ను ఒక కుటుంబం/ భవనం ఖర్చు చేస్తోందనుకుంటే, ఆ కుటుంబ అవసరాలకు సుమారు 5 వేల వాట్ల సామర్థ్యం, అంటే 5 KW సామర్థ్యం ఉన్న సౌర ఫలకాలను భవనంపై ఏర్పాటు చేసుకోవటం ఉపయోగకరంగా ఉంటుంది. ఇందుకు గాను



సుమారు రూ. 4 లక్షలు ఖర్చవుతాయని అంచనా. దీనిలో 15 శాతాన్ని ప్రభుత్వం రాయితీగా అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని వినియోగదారులే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇందులో కూడా వేరు వేరు రకాలున్నాయి. గృహ వినియోగం కోసం చేపట్టే సౌర విద్యుత్ ఉత్పాదనకు అయ్యే ఖర్చులో 55 శాతం సౌర ఫలకాల ఏర్పాటుకు, మిగిలిన 45 శాతం నిధులు ఇన్వర్టర్, వైరింగ్, చేంజ్ ఓవర్, గ్రిడ్ అనుసంధానాలకు ఖర్చవుతుంది. అయితే, ఈ మాదిరి నమూనాలో, పగలు ఇంటికి అవసరమైన విద్యుత్ అంటే fridge, ఫ్యాను, వాషింగ్‌మిషన్ లాంటి పరికరాలు పనిచేయటానికి, ఉత్పత్తి అయిన విద్యుత్ ఎప్పటికప్పుడు అందుబాటులోకి వచ్చి వినియోగం అవుతుంది. మరి రాత్రి పూట వినియోగించే బల్బులు, ఫ్యానులు, fridge ఇంకా AC గృహోపకరణాల కోసం ఈ విధానంలో ఇన్వర్టర్ ఏర్పాటు జరుగుతుంది. అంటే సౌర ఫలకాలు ఉత్పత్తి చేసే విద్యుత్‌తో పగలు ఈ ఇన్వర్టర్ ఛార్జ్ అయి, రాత్రి పరికరాలు పని చేయటానికి వీలుగా విద్యుత్ ఖర్చు చేసుకుంటాం. అయితే ఈ ఇన్వర్టర్ 4 గంటలకు సరిపడా విద్యుత్‌ను నిల్వ చేయగలదు. ఈ సమయం పెరగాలంటే, ఇన్వర్టర్ ఖర్చు పెరుగుతుంది.



దేశవ్యాప్తంగా 2022 సంవత్సరం నాటికి 40,000 MW (మెగా వాట్లు) సౌర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని భవనాల పైకప్పులపై నెలకొల్పాలని జాతీయ సౌర విద్యుత్ విధానం – 2014 ద్వారా కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇంధన భద్రత కల్పించటం, స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సాహించటం ఈ విధానం జోడు–లక్ష్యాలు కాగా కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా రాష్ట్రాలకు విధానపరమైన మద్దతు ఇస్తుంది. సౌర విద్యుత్ సామర్థ్య విస్తరణలో ప్రభుత్వ ప్రవేటు సంస్థలకు భాగస్వామ్యం ఇవ్వటంతో పాటు గతంలో లేని భారీ స్థాయిలో ప్రజలు/ వ్యక్తులు/ కార్యాలయాలు/ సొసైటీలు / భవన సముదాయాలకు కూడా భాగస్వామ్యం కల్పించటం విశేషం. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సోలార్ మిషన్ (JNNSM) భవనాల పైకప్పులపై స్వంత వాడకానికి వ్యక్తులు, చిన్న బృందాలు Solar Rooftop Photovoltaic Power Projectలు నెలకొల్పుకోవటాన్ని ప్రోత్సహిస్తుంది. గృహ వినియోగానికి 1 KW నుంచి 500 KW వరకు ఎవరైనా సౌర విద్యుత్ ను ఉత్పత్తి చేసుకుని, వినియోగించుకోవచ్చు. గ్రిడ్‌కు అనుసంధానం చేయటం ద్వారా, మిగులు విద్యుత్‌ను అమ్ముకునే అవకాశం కూడా వీరికి ఉ ంటుంది. ఇందుకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సహకారాన్ని అందించేందుకు భారత్ సౌర ఇంధన కార్పోరేషన్ లిమిటెడ్ ను నోడల్ సంస్థగా ప్రభుత్వ ప్రకటించింది. కనీసం 500 చదరపు గజాల స్థలం పై కప్పుపై అందుబాటులో ఉన్న ఎవరైనా ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. ఇందుకు గాను ప్రతి ప్రాజెక్టు వ్యయంలో 15 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుంది.

| క్రమ సంఖ్య | కేటగరీ కిలోవాట్లలో | సరఫరా దారులు ఇవ్వజూపిన కనీస ధర రూ.లలో |
|---|---|---|
| 1. | 1 KW | 89,998 |
| 2. | 2 KW | 1,68,245 |
| 3. | 3 KW | 2,35,550 |
| 4. | 4 KW | 3,02,813 |
| 5. | 5 KW | 3,70,014 |
| క్రమ సంఖ్య | పెద్ద ప్రాజెక్టుల కేటగరీ | సరఫరా దారులు ఇవ్వజూపిన ధర / ఒక వాటికు రూ.లలో |
| 6. | 6-10 KW | 71 |
| 7. | 11-50 KW | 70 |
| 8. | 51-100 KW | 69 |
| 9. | 101-500 KW | 65 |

భవనాల పైకప్పులపై ఏర్పాటు చేసుకునే సౌర విద్యుత్ ప్రాజెక్టు ఖర్చు ప్రాజెక్ట్ సామర్థ్యం మేరకు ఈ కింది విధంగా ఉంది. గ్రిడ్ కు అనుసంధానం చేసేందుకు అవసరం అయ్యే ఖర్చును ఇందులో కలపలేదు. ప్రాజెక్ట్ సామర్థ్యం పెరిగిన కొద్దీ ఖర్చు కొంత మేర తగ్గుతుంది.

సౌర విద్యుత్ వాడకాన్ని గృహ అవసరాలకు ప్రోత్సహించటం



ద్వారా గ్రిడ్ పై ఒత్తిడిని తగ్గించాలని ప్రయత్నం. అందుకు గాను, పైకప్పుపై నిర్మించ ప్రతిపాదించిన సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఖర్చును ఇళ్ళ రుణాల లెక్కింపులో సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిగణనలోకి తీసుకోవాలని జాతీయ సౌర విధానం సూచించింది. ఇందుకు, 8 జాతీయ బ్యాంకులు అంగీకరించి, ఆ మేరకు రుణాల లెక్కింపులో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఖర్చునూ లెక్కిస్తున్నాయి. ఈ సదుపాయం, ఇంటి విస్తరణ రుణాల పైన కూడా వినియోగించుకోవచ్చు.

పైకప్పు సౌర విద్యుత్ ప్రాజెక్టులలో కొన్ని సౌలభ్యాలు మరికొన్ని అసౌకర్యాలు ఉన్నాయి. రాత్రి అంతా విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం లేకపోవటంతో, గ్రిడ్ నుంచి లభించే విద్యుత్‌ను పూర్తిగా నిలిపివేయటం గృహ వినియోగంలో సాధ్యం కావటం లేదు. నేరుగా ఫలకాలపై ఎండ పడే సమయం, ఫలకాల నాణ్యత లాంటి కారణాలతో పూర్తి స్థాయిలో ఎండ లభ్యం అయినప్పటికీ సౌర ఫలకాలు కేవలం రోజుకు 5 నుంచి 6 గంటలు మాత్రమే నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. మొత్తం విద్యుత్‌లో 24శాతం వరకు సేద్యానికి ఖర్చవుతోందని ఒక అంచనా. అందుకే రైతుల మీద భారం లేకుండా రానున్న 5 ఏళ్లలో దశల వారీగా పెద్ద సంఖ్యలో వ్యవసాయ సౌర పంపు సెట్లను అమర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇక స్వచ్ఛంద సంస్థల సహకారంతో సామాజిక సౌర విద్యుత్ ఉత్పత్తి కూడా జరుగుతోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, విద్యుత్ సరఫరా నిలకడగా లేని ప్రాంతాలలో సామూహిక అవసరాల కోసం ఈ విధానం సత్ఫలితాలిస్తోంది. అనంతపురం జిల్లాల లాంటి చోట్ల సాగు, త్రాగునీటి అవసరాలకోసం, సామాజికంగా ఈ సౌర విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. బోరు పంపులకు సౌర ఫలకాలు అమర్చుకుని పగటిపూట నీటిని తోడుకుని, ట్యాంకులలో నింపుకుని, ఆతర్వాత, పంట అవసరం, రైతు వెసులుబాటు మేరకు డ్రిప్, తుంపర సేద్య పద్ధతుల్లో నీటిని మడులకు అందిస్తున్నారు. అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పద్ధతి సత్ఫలితాలివ్వటంతో ఇతర ప్రాంతాలలో కూడా ఈ పద్ధతిపై ఆశక్తి పెరుగుతోంది. ఈ పద్ధతిలో, ఒక ఎకరానికి రోజుకు 2 వేల లీటర్ల నీటిని దాదాపు 30 మంది రైతులు వినియోగించుకుంటున్నారు.

గృహ వినియోగానికి సౌర విద్యుత్, అలాగే గ్రిడ్ అనుసంధానిత పైకప్పు సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుపై మరిన్ని వివరాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నూతన పునర్వినియోగ ఇంధన సంస్థలు, Pisgah కాంప్లెక్స్, నాంపల్లి, హైదరాబాద్,- 500001 చిరునామాలో పొందవచ్చు. ఫోను నంబరు: 040-23201502 (TS), 04023202891 (AP) సంప్రదించవచ్చు. అలాగే http://webmail.tnredcl. telangana.gov.in/appsuite / ద్వారా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, info@nredcap.in ఏ మెయిల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట ప్రభుత్వ అధికారులను సంప్రదించవచ్చు.

**ఉపసంహారం:**

సౌర విద్యుత్ విస్తృతంగా వినియోగంలోకి వచ్చి పెద్ద ఎత్తున దాని ప్రయోజనాలు జన సామాన్యానికి అందినప్పుడే శిలాజ ఇంధనానికి సౌర విద్యుత్ నిజమైన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. చిన్న పెద్ద సౌర విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు ఉత్పత్తి చేసిన విద్యుత్ అంతా వినియోగంలోకి తేవటంలో ప్రస్తుతం ఎన్నో ఆటంకాలున్నాయి. అందుబాటులో ఉండే భూఉపరితలం తగ్గిపోతూ ఉండటం, నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి, గృహోపయోగ వస్తువుల విషయంలో పరిజ్ఞానం తగినంతగా అందుబాటులోకి రాకపోవటం, తర్వాతి తరం పరిశోధనలు జరగకపోవటం, అందుబాటులో ఉన్న పరిజ్ఞానాలు గృహవినియోగానికి పూర్తిగా అనుకూలంగా లేకపోవటం ఇలాంటి కారణాలెన్నో సౌర విద్యుత్ వినియోగానికి అవాంతరాలు కల్పిస్తున్నాయి. సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రస్తుతం వినియోగిస్తున్న ఫోటో వోల్టాయిక్ ఫలకాల నాణ్యతను పెంచి, ఉత్పత్తి ధరను తగ్గించేందుకు నవతరం ఫలకాల ఆవిష్కారానికి శాస్త్రీయ పరిశోధనలు ఉధృతం కావాలి. సౌర విద్యుత్ రంగంలో తగినంత శాస్త్రీయ పరిశోధనలు జరిగి, అటు పారిశ్రామిక, ఇటు గృహ వినియోగానికి సౌర విద్యుత్ విరివిగా, సులభంగా అందుబాటులోకి వచ్చినప్పుడే వినియోగదారులు సౌర విద్యుత్ వైపే మొగ్గు చూపుతారు.

# నగరానికి.. టూరిజం శోభ

## అంతర్జాతీయ పర్యాటక కేంద్రం దిశగా పర్యాటకులను ఆకట్టుకుంటున్న హైదరాబాద్



**విశ్వనగరం దిశగా అడుగులేస్తున్న హైదరాబాద్ ఇప్పుడు.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తోంది. దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ పర్యాటకం కొత్త శోభను సంతరించుకుంటోంది. విజయవంతంగా రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. నగరాన్ని అంతర్జాతీయ సమావేశాలకు, సదస్సులకు వేదిగా మార్చడంతో పాటు, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటేందుకు విదేశీ పర్యాటకులను సైతం ఆహ్వానిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నగర పర్యాటక స్థలాలను తీర్చిదిద్దుతోంది.**

నగరంలో చారిత్రక కట్టడాలతో పాటు, పలు పర్యాటక ప్రాంతాలున్నాయి. నిత్యం వేలాది మంది పర్యాటకులతో కళకళలాడే నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటకులకు అనువైన పలు ప్రత్యేక ప్యాకేజీలను, వసతులను కల్పిస్తోంది పర్యాటక అభివృద్ధి సంస్థ. తెలంగాణ ఏర్పాటు అనంతరం పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాల్లో విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టింది.

నగర అందాలను గగనతలం నుంచి వీక్షించేందుకు వీలుగా హెలీ టూర్‌ని నిర్వహించింది. హుస్సేన్ సాగర్‌లో కొత్త బోట్లను ప్రవేశ పెట్టడంతో పాటు పలు అంతర్జాతీయ టూరిజం మార్ట్స్ నిర్వహించింది. ఈ రెండున్నర సంవత్సరాల్లో నగర పర్యాటకం దినాదినాభివృద్ధినొందడంతో పాటు దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య విస్తృతంగా పెరిగింది.

**నగర అందాలు..**

నగరంలోని పలు చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు సందర్శించేందుకు వీలుగా కొత్తగా నగరంలో రెండు ఫ్లిప్ టాప్ బస్సులను ప్రవేశ పెట్టింది టీఎస్‌టీడీసీ. చార్మినార్, మక్కామసీదు, చౌమహల్లా ప్యాలెస్, తారామతి బారాదరి, గోల్కొండ ఫోర్ట్, సాలార్జంగ్ మ్యూజియం, జూ పార్క్ వంటి పలు పర్యాటక ప్రాంతాలు సందర్శించాలనుకునే వారు ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు. పర్యాటకులు తమకు నచ్చిన పర్యాటక ప్రాంతంలో నచ్చినంత సమయం వెచ్చించవచ్చు. తరువాత బస్సులో మరో పర్యాటక ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ ప్రయోగం ద్వారా నగర పర్యాటక ప్రాంతాలకు రద్దీగా బాగా పెరిగిందనే చెప్పవచ్చు.

**హెలీటూర్**

నగర అందాలను గగన తలం నుంచి వీక్షించడమంటే గొప్ప అనుభూతిని సొంతం చేసుకోవడమే. చారిత్రక ప్రాంతాలతో పాటు, అసెంబ్లీ, హైటెక్ సిటీ వంటి కట్టడాలను, బిర్లాటెంపుల్ వంటి ప్రాంతాలను ఆకాశంలోంచి వీక్షించేందుకు వీలుగా నగరంలో హెలీ టూర్‌ని ప్రవేశ పెట్టింది టీఎస్‌టీడీసీ. గత మార్చ్‌నెలలో జాయ్ రైడ్ పేరుతో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ హెలీటూర్‌కి అనూహ్యమైన స్పందన లభించింది. త్వరలోనే హెలీ టూర్‌ని పూర్తి స్థాయిలో నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేదిశలో ప్రభుత్వం యోచిస్తోంది.



**బోటింగ్**

హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు తదితర ప్రాంతాల్లో టీఎస్‌టీడీసీ పర్యాటకుల కోసం బోటింగ్ సదుపాయాల్ని కల్పిస్తోంది. హుస్సేన్ సాగర్‌లో బోటింగ్ యూనిట్‌లో అందుబాటులో ఉన్న బోట్‌లతో పాటు కొత్తగా 8 అత్యాధునిక స్పీడ్ బోట్‌లను ప్రవేశ పెట్టింది. హుస్సేన్ సాగర్‌లో నిర్వహిస్తున్న జల క్రీడలు సైతం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**ఫుడ్ ఫెస్టివల్స్**

తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో పర్యాటక శాఖ తెలంగాణ రుచులతో ఫుడ్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్స్ పర్యాటకులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ రుచులను సరికొత్తగా పరిచయం చేయడంపై ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

**పర్యాటక అభివృద్ధికి చేసిన కార్యక్రమాలు**

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విద్యార్థులు వరల్డ్ టూరిజం డే సెలబ్రేషన్స్‌లో భాగంగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌లో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగర చారిత్రక కట్టడాల నిర్మాణ కౌశలాన్ని గురించి వివరించారు.
- మార్చి 3 నుంచి 15 వరకు నగరంలో హెలీటూర్ నిర్వహించింది పర్యాటక శాఖ. నగరంలోని పర్యాటక ప్రాంతాలు బిర్లామందిర్, బుద్ధ విగ్రహం, చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, సాలార్జంగ్ మ్యూజియం, హైకోర్టు, పబ్లిక్ గార్డెన్, హైటెక్ సిటీ వంటి పర్యాటక ప్రాంతాలను గగనతలం నుంచి వీక్షించే సదుపాయం కల్పించింది నగర ప్రజలకు.
- 2015 జనవరిలో శిల్పకళావేదికలో అంతర్జాతీయ రష్యన్ డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించింది. రష్యన్ జానపద కళారూపాల్ని తెలంగాణ కళాభిమానులకు పరిచయం చేసింది.
- 2015 నవంబర్‌లో గ్రేటర్ హైదరాబాద్ అడ్వెంచర్ క్లబ్‌తో కలిసి రాకథాన్‌ని నిర్వహించింది. వందలాది మంది యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.
- 2016 నవంబర్‌లో జీహెచ్ఎంసీతో కలిసి ఫక్రుద్దీన్ గుట్ట పరిసరాల్లో రాకథాన్ నిర్వహించింది. ఈ సందర్భంగా పలు సాహస క్రీడలతోపాటు, పురాతన రాతి శిలాజాల పరిరక్షణపై యువతలో అవగాహన కార్యక్రమాల్ని చేపట్టింది.
- నగర శివారులో పర్యాటక శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన డిస్నీ ల్యాండ్ సైతం అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకుంటోంది.
- సంక్రాంతి సందర్భంగా శంషాబాద్‌లో నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో దేశ, విదేశాలకు చెందిన వారు పాల్గొన్నారు.
- బతుకమ్మ ఉత్సవం సందర్భంగా రష్యా, కజకిస్తాన్ తదితర పలు దేశాలకు చెందిన విదేశీ వనితలు నగరాన్ని సందర్శించి, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్‌పై టిసిపార్డులో వర్క్ షాప్






తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ నందు స్వచ్ఛ్ భారత్ పై ఒకరోజు వర్క్‌షాప్ ను పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. పి. సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా (ODF) రాష్ట్రంగా తీర్చిదిద్దవలసిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఈ దిశలో కరీంనగర్ జిల్లాలో బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా (ODF) గ్రామాలు తీర్చిదిద్దడం జరిగిందని, నూతన జిల్లాల విభజననంతరం బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా (ODF) అన్ని గ్రామ పంచాయతీలలో అమలు చేయాలని వివరించారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి కమీషనర్ శ్రీమతి నీతూ కుమారి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించుటలో డిఆర్‌డిఓ అధికారులు శ్రద్ధతో పనిచేయాలలని సమీకరించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మరగుదొడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో జాయింట్ డైరెక్టర్, టిసిపార్డు శ్రీ.బి. నరేంద్రనాథ్ రావు, స్వచ్ఛభారత్ మిషన్ అధికారి శ్రీ రామ మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సెంటర్ హెడ్ ఎ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ ఒకరోజు వర్క్‌షాపులో జిల్లాల నుండి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



# తొలిసారి సాగుకు 'సింగూరు' నీళ్ళు

సింగూరు ఆయకట్టు రైతుల 36 ఏండ్ల ఎదురుచూపులకు ఈ యాసంగితో తెరపడనున్నది. వారి కలలు త్వరలో నెరవేరనున్నాయి. దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని ఆయకట్టు భూములు తెలంగాణ ప్రభుత్వం చొరవతో పచ్చబడనున్నాయి. ఇన్నాళ్లూ హైదరాబాద్ తాగునీటి అవసరాలకే పరిమితమైన సింగూరు జలాలు పంట కాల్వల ద్వారా పొలాలకు చేరనున్నాయి.

40వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 1980 లో నిర్మించిన సింగూరు ప్రాజెక్టు ఇన్నేండ్లూ ఆయకట్టు రైతులకు కన్నీళ్లే మిగిలించింది. 36 ఏండ్లుగా పాలకులు ప్రాజెక్టు నుంచి నీటిని కేవలం హైదరాబా ద్ తాగునీటి అవసరాలకే తరలించుకుపోయి ఇక్కడి రైతుల పొలాలను ఎండబెట్టారు. స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం సింగూరు నుంచి సాగునీరందించడానికి ఏర్పాట్లు చేసింది. ఈ యాసంగిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ చరిత్రాత్మక నిర్ణయంతో టీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామంటున్నది సంగారెడ్డి జిల్లా రైతాంగం.

**దశాబ్దాల కల సాకారం..**

ఎలాంటి సాగునీటి వనరులు లేని ఉమ్మడి మెదక్ జిల్లాలోని (ప్రస్తుత సంగారెడ్డి జిల్లా) పుల్కల్‌లో 40 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 29.9 టీఎంసీల సామర్థ్యంతో సింగూరు ప్రాజెక్టు నిర్మాణానికి 1976లో పునాది వేశారు. 1980లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. కానీ కాల్వలు పూర్తి చేయ లేదు. ప్రాజెక్టు నిర్మాణంలో 40 గ్రామాల ప్రజలు భూములు, ఇండ్లు కోల్పోయారు. ప్రాజెక్టులోకి నీళ్లు రాగానే తమకు సాగునీళ్లొస్తాయని ఆయకట్టు రైతులు మురిసిపోయారు. గత ప్రభుత్వాలు ఇక్కడి రైతులకు అన్యాయం చేసి నీళ్లను హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితం చేశారు. సింగూరు జలాలను సాగుకే అందిస్తామనే నినాదం ఏండ్లుగా ఎన్నికల వాగ్దానంగానే మిగిలిపోయింది. గతంలో ఏటికేడు కాల్వల నిర్మాణ వ్యయం పెంచారు తప్ప పనులు మాత్రం పూర్తి చేయించలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముమ్మాటికీ సింగూ రు జలాలను సాగుకు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చి న హామీ మేరకు నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో సింగూరు కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేయించారు. 24 కిలోమీటర్ల మేర ప్రధా న ఎడమ కాల్వతోపాటు అనుబంధంగా మరో 24 కిలోమీటర్ల మేర పిల్ల కాల్వ పనులు పూర్తిచేశారు. మంత్రి హరీశ్‌రావు కాల్వ ద్వారా నీటిని విడుదల చేశారు.

ఈ కాల్వ ద్వారా సుమారు 50 వరకు చెరువులను నింపనున్నారు. 12 కిలోమీటర్లకు గాను కొంత మేర మిగిలిన కుడి కాల్వ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. మంత్రి హరీశ్ రావు ప్రత్యేక చొరవతో పనులు దాదాపుగా పూర్తయ్యాయి. సింగూరు ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలతోపాటు వర్షాలతో నిండిన 1,245 చెరువుల కింద 26,568 ఎకరాలు, నారాయణఖేడ్ సమీపంలోని నల్లవాగు ప్రాజెక్టు కింద 4,060 ఎకరాల ఆయకట్టు కు సాగునీరందించడానికి నీటి పారుదలశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సాగునీటిపై రెండుసార్లు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ యాసంగిలోనే జిల్లాలో మొత్తం 60,628 ఎకరాలకు సాగునీరందించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

| | |
|---|---|
| 30 | వేల ఎకరాలకు తొలిసారి ఈ యాసంగిలో సింగూరు నీరు |
| 4,060 | ఎకరాలకు.. నల్లవాగు ప్రాజెక్టు నీరు |
| 26,568 | ఎకరాలకు.. 1,245 చెరువుల నీరు |
| 60,628 | మొత్తం సంగారెడ్డి జిల్లాలో సాగునీరు అందనున్న భూమి |

# జీవ ఇంధనాలు వాడకంతో పర్యావరణ పరిరక్షణ

**జీ**వ వ్యర్థ పదార్థాలను నేరుగా మండించి గాని లేదా సూక్ష్మజీవుల సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురి చేయడం ద్వారా శక్తిని పొందే విధానాలను జీవ ఇంధనాలు అని పిలుస్తారు. భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం కావడం వల్ల ప్రపంచంలో అత్యధికంగా పశు సంపదను కలిగి ఉండడం లాంటి కారణాల వల్ల జీవ ఇంధనాల ఉత్పత్తికి ముడిపదార్థాలు సమృద్ధిగా లభ్యమవుతున్నాయి.

ఇవి కాలుష్యరహితమైన, పర్యావరణ హితమైన, తక్కువ ఖర్చుతో కూడిన సుస్థిరాభివృద్ధితో పెంపొందించిన ఇంధన వనరులు. వీటిని క్రింద తెలుపడమైనది.

**1. బయోగ్యాస్ :**



పశువుల పేడ, చెట్ల తాలూకూ వ్యర్థ పదార్థాలను ఆక్సిజన్ రహితంగా కుళ్లబెట్టడం ద్వారా చెట్ల వ్యర్థాలు, పట్టణ వ్యర్థాలు మొదలైన వాటిని మిథనో మోనాస్, మిథనోకోకస్ వంటి బ్యాక్టీరియాల సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురి చేయడం ద్వారా గాని బయోగ్యాస్‌ను తయారు చేస్తారు. బయోగ్యాస్ 60% మిథేన్ 40%, కార్బన్ డై ఆక్సైడ్ వాయువులను కలిగి ఉంటుంది. ఈ గ్యాస్ కాలుష్యరహితమైనది, చౌకైనది, దక్షత కల్గినదే కాకుండా దీనిని సహజవాయువు వలే కంప్రెస్ కూడా చేయవచ్చును. వంటగ్యాస్‌ను, ఎలక్రిసిటీ ఉత్పత్తిలో ఉపయోగించవచ్చును.

**2. బయోఇథనాల్:**




దీనిని చెరకు లేదా మొక్కజొన్న మొలాసిస్ నుండి తయారు చేయవచ్చును. మొలాసిస్‌కు సుక్రోజ్ మరియు ఇన్వర్టేజ్ అనే ఎంజైములను లేదా ఈస్ట్‌ను కలిపి కిణ్వన ప్రక్రియకు గురి చేస్తారు. కిణ్వనం ప్రారంభమైన 12-24 గంటల వ్యవధిలో ఇన్వర్టేజ్ అనే ఎంజైము మొలాసిస్‌ను గ్లూకోజ్ మరియు ఫ్రక్టోజ్‌లుగా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ మరియు ఫ్రక్టోజ్లను జైమేజ్ అనే ఎంజైము ఇథైల్ ఆల్కహాల్ మరియు కార్బన్ డై ఆక్సైడ్‌లుగా మారుస్తుంది. ఈ విధంగా ఏర్పడిన ఇథనాల్‌ను అంశిక స్వేదనం ద్వారా వేరు చేస్తారు. బ్రిటన్, అమెరికా, భారత్‌లలో ఇథనాల్ బ్లెండెడ్ (10% ఇథనాల్ం 90%పెట్రోలు) ను ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగిస్తున్నారు. దీనిని గ్యాసోహాల్ అని అంటారు.

**3. బయో హైడ్రోజన్ గ్యాస్:**




బయోమాస్‌ను హైడ్రోజోమోనాస్ బ్యాక్టీరియా సమక్షంలో కిణ్వన ప్రక్రియ గురి చేసినప్పుడు హైడ్రోజన్ గ్యాస్ విడుదలవుతుంది. ఇది కాలుష్యరహితమైనది. చౌకైనది. దీనిని రాకెట్ల యందు ఇంధనంగానూ, హైడ్రోజన్ బ్యాటరీలతో వాహనాలను నడిపించడానికి మరియు విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి ఉపయోగించవచ్చును.

**4. బయో బ్యుటనాల్:**

బయో ఇథనాల్ వలే చెరకు లేదా మొక్కజొన్న మొలాసిస్‌ను క్లాస్ట్రీడియం ఎసిటో బ్యుటరికం అనే బాక్టీరియా సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురి చేసినప్పుడు ఎసిడో బ్యుటనాల్ ఏర్పడుతుంది. ప్రస్తుతం దీనిని గృహ సంబంధ అవసరాలలో ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా బ్యుటనాల్ పొడవైన హైడ్రోకార్బన్ శృంఖలాలను కలిగి ఉన్నందున, దీనిని ఇంటర్నల్ ఇంజన్ కంబజన్‌లో వాడేందుకు ఉపయుక్తంగా ఉంటుంది.

**5. బయోడీజిల్ :**

జంతువుల క్రొవ్వు వెజిటేబుల్ ఆయిల్ మరియు మొక్క భాగాల నుండి గ్రహించిన ముడి నూనెలను ఆల్కహాల్‌తో చర్యనొందించిన ఎస్టర్స్ మరియు గ్లిసరాల్స్ ఏర్పడతాయి. ఈ ప్రక్రియను "ట్రాన్స్ ఎస్టరిఫికేషన్" అని అంటారు. ఈ ప్రక్రియలో ఏర్పడిన ఎస్టర్లనే 'బయోడీజిల్" అని అంటారు. ఈ బయోడీజిల్‌ను నేరుగా గాని లేదా

పెట్రోడీజిల్‌తో కలిపి గాని ఉపయోగించవచ్చును. ఇది పర్యావరణ స్నేహపూర్వక ఇంధనం. భారతదేశంలో గానుగ జెట్రోపా చెట్ల నుండి బయోడీజిల్‌ను తయారు చేస్తున్నారు.

**జీవ ఇంధనాల ఉపయోగాలు:**

1. జీవ ఇంధనాలు పునరుత్పత్తి చేయగల ఇంధన వనరులు
2. జీవ ఇంధనాలు పర్యావరణ స్నేహపూర్వక ఇంధనాలు. శిలాజ ఇంధనాలతో పోల్చినప్పుడు ఇవి చాలా తక్కువ కర్బన మరియు ఇతర ఉద్గారాలను వెలువరుస్తాయి.
3. శిలాజ ఇంధనాలతో పోలిస్తే జీవ ఇంధనాలు చాలా చౌకైనవి.
4. జీవ ఇంధనాలను ప్రాంతీయంగా లేదా దేశీయంగా ఉత్పత్తి చేసుకోవచ్చును. తద్వారా శిలాజ ఇంధనాలపై ఒక దేశం, మరొకదేశంపై ఆధారపడాల్సిన ఆవశ్యకత ఉండదు. అంతేకాకుండా రవాణా ఖర్చులను మరియు విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయవచ్చును.
5. జీవ ఇంధన తయారీకై కావల్సిన పంటలకు డిమాండ్ పెరిగి తద్వారా లక్షలాది మంది రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా జీవ ఇంధన తయారీ పరిశ్రమల్లో పెద్ద మొత్తంలో ఉద్యోగ కల్పన జరుగుతుంది.
6. జీవ ఇంధనాల తయారీలో వ్యవసాయ, పట్టణ వ్యర్థాలు మరియు ఇతర ఉత్పన్నాలను విరివిగా ఉపయోగిస్తారు. తద్వారా ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ జరిగి పర్యావరణం పరిరక్షించబడుతుంది.

**జీవ ఇంధనాలు – నష్టాలు :**


ప్రపంచంలో ఏ ఇంధనం కూడా పూర్తిగా లాభదాయకమైనది కాదు మరియు పూర్తి నష్టదాయకమైనది కూడా కాదు. ఈ మాదిరిగానే ఎన్నో విశేష ప్రయోజనాలను కలిగి ఉన్న జీవ ఇంధనాల వలన నష్టాలు కూడా లేకపోలేదు. అవి

1. జీవ ఇంధనాలు, శిలాజ ఇంధనాలంత దక్షతను కలిగి లేనందువల్ల డిమాండ్‌కు సరిపడా జీవ ఇంధనాల్ని తయారు చేయడానికై చాలా పెద్ద మొత్తంలో జీవ ఇంధన మొక్కల్ని పెంచాల్సి ఉంటుంది. దీనివలన ప్రపంచ వ్యాప్తంగా ఆహార పంటల విస్తీర్ణం తగ్గి, ఆహార భద్రతా సమస్య ఏర్పడి, ధరలు పెరిగిపోయే అవకాశం ఉంది.
2. పెద్ద మొత్తంలో జీవ ఇంధనాల్ని తయారు చేయడానికి భారీ ఎత్తున యంత్ర పరికరాలు (జీవ ఇంధన పంటల సాగుకు మరియు జీవ ఇంధనాల తయారీకి) అవసరమౌతాయి. ఇందుకోసం అత్యధిక మొత్తంలో పెట్టుబడులు అవసరం అగుటయే గాక ఆ యంత్రాల నుండి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు కూడా పెరుగుతాయి.
3. బయో ఇంధన మొక్కల సాగుకు మరియు బయో ఇంధనాల తయారీకి అత్యధిక మొత్తంలో నీరు అవసరమౌతుంది. తద్వారా స్థానిక జల వనరులపై ఒత్తిడి అధికమయ్యే అవకాశం ఉంది.
4. డిమాండ్‌ను అధిగమించేందుకై ఉత్పత్తి, ఉత్పాదకతల్ని పెంచే క్రమంలో ఎరువులను కూడా అధిక మొత్తంలో వినియోగించాల్సి ఉంటుంది. తద్వారా మృత్తిక జల కాలుష్యం ఏర్పడుతుంది.

మానవ జనాభా పెరిగే కొలది పెరుగుచున్న జనాభా అవసరాలు కొరకు అభివృద్ధి పేరుతో అనేక రసాయన వనరులు ఉపయోగించడం జరుగుతోంది. దీనితో వాతావరణం కాలుషితమయ్యి భూమ్మీద సమస్యలు తలెత్తుతున్నాయి. కాబట్టి మానవుని అవసరాలు తీర్చుకొనుటకు కొంతలో కొంత జీవ ఇంధనాలు వాడుకుంటే భవిష్యత్ తరాలు వారికి వనరులను మిగిల్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా కాపాడుకోగలుగుతాం.

**– సి. హెచ్.రేణుక, రిసర్చ్ స్కాలర్,**
**ప్రొ॥జయశంకర్ వ్యవసాయ కళాశాల**

**The Biodiesel Cycle**




© GreenerPro



# జెర్బరా పూలు.. లాభాలు బాగు..!

జెర్బరా పూలంటే మనందరికీ తెలియకపోవచ్చు. కానీ చూస్తే గుర్తు పడతారు. వీటిని వివాహాలు, పుట్టిన రోజులు, తదితర శు భాకార్యాల్లో స్టేజీలు, ఇతరాత్ర అలంకరణకు ఉపయోగిస్తారు. దశాబ్దాల కిందట మహారాష్ట్ర, కరా?టక, పూణె, ముంబై ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో తీసుకొచ్చి ఇక్కడ వినియోగించేవారు. ఎంతో ఖర్చు చేసి తీసుకురావడమెందుకని శామీర్‌పేట మండలం నాగిశెట్టిపల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి అనే రైతు ఈ పూల 500 చదరపు మిటర్ల విస్తీర?ంలో సాగు చేసి అధిక దిగుడి సాధించి రాబడి పొందాడు. అప్పుడు 25 శాతం ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వగా ప్రస్తుతం 75 శాతం వరకు ఇస్తుంది. ఈ పంటకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమని అధికారులు వెల్లడిస్తున్నారు.

సాగు ఎలా...

జెర్బరా పూల సాగు సులభతరంగా ఉంటుంది. ఈ పూల మొక్కలకు విత్తనాలుండవు. మహారాష్ట్ర, బెంగళూరులో ఈ మొక్కలను టిష్యుకల్చర్(టెస్ట్‌ట్యూబ్) విధానంతో ప్రవర్ధనం అవుతాయి. అక్కడి నుంచి మొక్కలను కొనుగోలు తీసుకురావాల్సి ఉంది. ఈ మొక్కలను పాలీ హౌజ్‌లలో మాత్రమే సాగు చేయాలి. ఒక్కో మొక్క రూ.30 -35 లకు కొనుగోలు చేసి తీసుకువచ్చి సాగు చేయాలి. ఎకరం విస్తీర?ంలో 24 వేల మొక్కల వరకు నాటగా మూడు నెలలకు పంట చేతికొస్తుంది. ఎకరం విస్తీర?ంలో వేసిన మొక్కలు రోజుకు 3 వేల పూల వరకు పంటనందిస్తాయి. ఈ పూలు ఒకటి రూ.4 ల నుంచి రూ.12 ల వరకు విక్రయించే అవకాశముంది. నాటిన మొక్క మూడు సంవత్సరాల పాటు పంట పండుతుంది.

**సబ్సిడీ విధానం...**

జెర్బరా సాగు చేయాలనుకునే రైతులు ఉద్యానవన శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే సబ్సిడీకి సంబంధించిన వివరాలు తెలియజేస్తారు. తన భూమికి సంబంధించని ధ్రువీకరణపత్రాలు, సాగు అవసరమయ్యే నీటి సౌకర్యం చూపిస్తే సరిపోతుంది. పాలీ హౌజ్‌ల నిర్మాణం మొదలు కుని పండించేందుకు అవసరమైన ఎరువులు, పరికరాలకు సబ్సిడీ అవకాశముంది.

- ఎకరం పాలీహౌజ్‌లు నిర్మించేందుకు రూ.33.76 లక్షలే ప్రభుత్వం రూ.25.32 లక్షల సబ్సిడీ ఇస్తుంది.
- పూల మొక్కల కొనుగోలు, ఎర్రమటి,పశువుల ఎరువు, బెడ్స్ తయారీకి రూ.10.60 లక్షల ఖర్చవుతుండగా ప్రభుత్వం రూ.8.10 లక్షల సబ్సిడీ ఇస్తుంది.

**మంజూరు.. సాగు చేస్తున్న వివరాలు..**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 800 ఎకరాల్లో పాలీహౌజ్‌లను నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదించి నిధులను మంజూరు చేయగా 500 వరకు నిర్మాణ దశలో ఉన్నాయి. 300 ఎకరాల్లో పంటలు పండుతున్నాయి.ప్రస్తుతంమేడ్చల్ జిల్లాలో 20 ఎకరాలలో జెర్బరీ పూలు పండుతున్నాయి.

**మేడ్చల్ జిల్లాలో 80 శాతం...**

మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతం 80 శాతం మంది రైతులు జెర్బరీ పంటను సాగు చేస్తున్నారు.కార్నివాల్, గులాబీ పంటలను సైతం ఈ పాలీహైజ్‌ల్లో పండించే అవకాశముంది. ఇందుకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ కల్పిస్తుంది. జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణం పూర్తయింది. వచ్చే జనవరిలోముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారు. ఇక్కడ పూలు, కూరగాయల పంటలపై రైతులకు శిక్షణనివ్వడంతో పాటు పంటలపై పరిశోధనలు చేస్తాం.

**-ఉద్యాన వన శాఖ ఏడీఈ వేణుగోపాల్**





# విశ్వనగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

**నగర బహుముఖ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. విశ్వనగరమే లక్ష్యంగా దాదాపు రూ.50వేల కోట్లకుపైగా నిధులతో ప్రణాళికలు రూపొందించినమున్సిపల్ కార్పొరేషన్ పలుచోట్ల ఇప్పటికే పనులను చేపట్టింది. స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా సుమారు రూ.21వేల కోట్లతోసిగ్నల్ ఫ్రీ రోడ్ల ఏర్పాటుకు మల్టీలెవల్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతేకాదు, స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నారు. తడి, పొడి చెత్తను విడివిడిగాచేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సంక్షేమ కార్యక్రమాల విస్తరణలో భాగంగా రూ. ఐదు భోజన కేంద్రాలను 20నుంచి 50కి విస్తరించారు. ఆన్‌లైన్ విధానాన్ని పెద్దఎత్తున చేపట్టారు. ముఖ్యంగా అవినీతికి ఆలవాలమైన టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళనచేసి ఆఫీసు మెట్లు ఎక్కకుండానే అనుమతులు లభించేలా ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు. డిసెంబర్ రెండో తేదీకి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కాలంలో జీహెచ్‌ఎంసీ సాధించిన అనేక విజయాలలో కొన్ని..**

ఉమ్మడిరాష్ట్రంలో మసకబారిన నగర కీర్తిని ఇనుమడింపజేస్తూ విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని సాకారం చేసే దిశగా జీహెచ్‌ఎంసీ చర్యలు చేపడుతోంది. వాటిలో ముఖ్యమైనవి..

* విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా సిగ్నల్ ఫ్రీ కారిడార్ల నిర్మాణానికి మొదటి దశ టెండర్ల ప్రక్రియ పూర్తి. అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో పనులు ప్రారంభం.
* దుర్గం చెరువుపై సుమారు రూ. 180కోట్ల వ్యయంతో సస్పెన్షన్ బ్రిడ్జీ నిర్మాణానికి టెండర్లు పూర్తి. వచ్చే ఏడాది జనవరిలో పనులు చేపట్టేందుకు చర్యలు
* మూసీనదిపై సుమారు 42కిలోమీటర్ల పొడవున ఈస్ట్-వెస్ట్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం. సమగ్ర కార్యప్రణాళికలు తయారీకి ఏర్పాట్లు
* అత్యంత సంక్లిష్టంగా మారిన ఇంటి నెంబర్లను సరళతరం చేసే కార్యక్రమానికి శ్రీకారం. జిప్పర్ కోడ్ ద్వారా సులువుగా ఇంటి నెంబర్లను గుర్తించేలా చర్యలు
* స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం. ఇందులో భాగంగా తడి-పొడి చెత్తను విడివిడిగా సేకరించేందుకు ఇంటింటికీ రెండు చెత్త బుట్టల పంపిణీ. ఇంటింటి చెత్త సేకరణకు ఆటో 2500ఆటోటిప్పర్లు. స్వచ్ఛ హైదరాబాద్ అవగాహనా కార్యక్రమాల్లో నగరానికి మూడో స్థానం.
* బహిరంగంగా వ్యర్థాలను పడేసే 1116కేంద్రాలను దశలవారీగా తొలగించేందుకు చర్యలు. చెత్త కేంద్రాలను తొలగించి వాటి స్థానంలో ముగ్గులు వేసే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి యావత్ దేశానికే నగరం ఆదర్శంగా నిలిచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా 15గార్బేజ్ కాంప్యాక్టర్స్‌ను కొనుగోలుచేశారు. ఆరు ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ఏర్పాటు. కొత్తగా చెత్త కుండీల కొనుగోలు.
* గతంలో 20వరకు ఉన్న రూ. ఐదు భోజన కేంద్రాలను ఈ ఏడాది 50కి విస్తరించారు. దీంతో రోజుకు 15000మందికి ఆకలి తీరుతోంది.
* 130కోట్లతో 200 మార్కెట్ల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన. మొదటి దశలో 167మార్కెట్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి. 119మార్కెట్ల పనులు మొదలయ్యాయి. పదిచోట్ల మార్కెట్ల పనులు తుదిదశకు చేరుకున్నాయి.
* రూ. 445.90కోట్లతో నగరమంతా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలోని 4.15లక్షల వీధి దీపాలన్నింటినీ ఎల్ఈడీలుగా మార్చనున్నారు. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ అనుబంధ ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు అప్పగించాలని నిర్ణయించారు.
* డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా 21వేల ఇళ్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు. గ్రేటర్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం
* నగరంలో బహిరంగ మూత్ర విసర్జనను నిర్మూలించేందుకు రోడ్ల వెంబడి దాదాపు 50కిపైగా టాయ్‌లెట్లను ఏర్పాటుచేశారు. వీటిని 100వరకు విస్తరించడంతోపాటు మహిళలకోసం కూడా ప్రత్యేకంగా మరో 100టాయ్‌టెట్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. వీటితోపాటు 100చోట్ల ఇప్పటికే ఏర్పాటుచేసిన ప్రీఫ్యాబ్రికేటెడ్ టాయ్‌లెట్లను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
* 85కోట్లతో శ్మశానాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఒక్కోదానికి రూ. 2.50కోట్ల చొప్పున 34శ్మశానాలను రూ. 85కోట్లతో అభివృద్ధి చేయాలని నిర?యించారు. ఇప్పటికే సగానికిపైగా శ్మశానాల అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైంది. ఇందులో ప్రైవేటు భాగస్వామ్యంతో పంజాగుట్ట, అంబర్‌పేట్, బన్సీలాల్‌పేట్, ఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో అత్యాధునిక శ్మశానాలను ఏర్పాటుచేసేందుకు ఏర్పాట్లు. ఇదివరకే బంజారాహిల్స్‌లో మహా

ప్రస్థానం పేరుతో అత్యాధునిక శ్మశానాన్ని పూర్తిచేశారు.

* నగర వీధుల అందాలను అనుమడింపజేయడంతోపాటు మూత్ర విసర్జన ద్వారా ఫుట్‌పాత్‌లు పాడుకాకుండా చూసేందుక సుమారు 1000కిలోమీటర్ల పొడవున ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌ల వెంబడి గ్రీన్ కర్టెన్ పేరుతో గోడలకు ఆనుకొని పూలమొక్కలు ఏర్పాటుచేసే సరికొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఏజీ ఆఫీసు, రవీంద్రభారతి, రాజ్‌భవన్‌రోడ్డు జీహెచ్‌ఎంసీ కార్యాలయం తదితర మార్గాల్లో ఏర్పాటుచేశారు.
* నగరంలోని 50రద్దీ ప్రాంతాల్లో అత్యాధునిక పాదచారుల వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసి టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టారు. మొదటిదశలో లంగర్‌హౌస్ టిప్పుసుల్తాన్ బ్రిడ్జీ సమీపంలోని 9బీటీ బ్యాట్రీ గేట్, మెహిదీపట్నంలోని సరోజినీదేవీ కంటి ఆసుపత్రి, మాసబ్‌ట్యాంక్‌లోని మహావీర్ హాస్పిటల్, బంజారాహిల్స్ రోడ్ నెం-1లోని కేర్ ఆసుపత్రి, గ్రీన్‌లాండ్స్ గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో వీటిని నిర్మించనున్నారు.
* నగరంలోని 138 చెరువులను కబ్జాలనుంచి కాపాడడంతోపాటు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే దాదాపు 10చెరువుల ప్రక్షాళన పనులు మొదలయ్యాయి. చెరువులను ప్రక్షాళనచేసి వాటిని మంచి విహార యాత్రలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. బోటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయడంతోపాటు వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు నిర్మించాలని నిశ్చయించారు. ముందుగా సర్కిల్‌కు రెండు చొప్పున చెరువులను అభివృద్ధి పనులు చేపట్టారు.
* ముంపు సమస్యకు ప్రధాన కారణంగా మారిన నాలాలను విస్తరించేందుకు పకడ్బందీ చర్యలకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా రెవిన్యూ, హెచ్‌ఎండీఏ తదితర శాఖలతో సంయుక్తంగా 390కిలోమీటర్ల పొడవున ప్రధాన నాలాల సర్వే మొదలు. కబ్జాల్లో ఉన్నవాటిని తొలగించాలని నిర్ణయం.
* యాచకరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు. మొదటిదశలో ఎల్బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లనుంచి సుమారు 50మంది యాచకులను చౌటుప్పల్ అమ్మానాన్న అనాథాశ్రమానికి తరలింపు.
* ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా పర్యావరణానికి హాని కలగని కాగితపు సంచుల వితరణ. మొదట గౌతం నగర్‌లో స్వఛరేద సంస్థ భాగస్వామ్యంతో పంపిణీ
* హుస్సేన్‌సాగర్‌కు పూర్వవైభవం తేవాలని నిర్ణయించి అవసరమైన చర్యలు ప్రారంభించారు. ముందుగా మురుగునీటిని బయటకు పంపే పనులు చేపట్టిన అధికారులు అవసరమైనప్పుడు సాగర్‌ను కావాల్సినంతమేరకు ఖాళీ చేసేందుకు వీలుగా గేట్‌ను ఏర్పాటుచేస్తున్నారు. అంతేకాకుండా మురుగునీరు కలవకుండా నాలా డైవర్షన్ పనులు చేపట్టారు.



* ఉస్మానియా ఆసుపత్రి వద్ద నిరుపయోగంగా మారిన అఫ్జల్‌పార్కుకు పూర్వవైభవం తేవాలనే లక్ష్యంతో పనులు చేపట్టారు. ఈ పురాతన పార్కును అందంగా తీర్చిదిద్దేందుకు ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారంతో పనులు చేపట్టారు.
* ఉపాధికోసం నగరానికి వచ్చి రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌లపై పడుకునేవారికోసం 12ప్రాంతాల్లో నైట్ షెల్టర్ల ఏర్పాటు. అవసరాలకు అనుగుణంగా మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటుకు సన్నాహాలు. ఇవికాకుండా వివిధ ప్రధాన ఆసుపత్రులకు వచ్చే రోగుల వెంట వచ్చే సహాయకుల సౌకర్యార్థం ఏడు ముఖ్యమైన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద నైట్ షెల్టర్లను ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి.
* ఒక్క రూపాయి కూడా పన్ను పెంచకుండానే బల్దియా ఆదాయం మొదటిసారి రూ. 1120కోట్లు దాటింది. క్రితం ఏడాది రూ. 1000కోట్లకు కాస్త అటుఇటుగా ఉన్న ఆదాయం ఏకంగా 1120కోట్లు దాటడం విశేషం.
* జీహెచ్‌ఎంసీ విధుల్లో పారదర్శకతను పెంపొందించడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తిచేసే ఉద్దేశంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ-ఆఫీసు(పేపర్‌లెస్) విధానాన్ని జీహెచ్ఎంసీలో ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తున్నారు. దీనికితోడు తాజాగా డెవలప్‌మెంట్ పర్మీషన్ మేనేజింగ్ సిస్టం(డీపీఎంఎస్) పేరుతో ఇంటి అనుమతులను సత్వరమే జారీచేసేందుకు ఆన్‌లైన్ విధానాన్ని చేపట్టారు.
* అక్రమ భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని చేపట్టి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ పథకం అమలవుతుండగా, బీపీఎస్ మాత్రం కోర్టు కేసు కారణంగా ఇంకా పెండింగులో ఉంది.
* రోడ్లపై పడే గుంతలను వెనువెంటనే పూడ్చివేసేందుకు రోడ్ డాక్టర్ పేరుతో అత్యాధునిక యంత్రాన్ని తెప్పించారు. ఇది అత్యంత ట్రాఫిక్ రద్దీలో సైతం నిముషాల వ్యవధిలోనే గుంతను పూడ్చివేస్తుంది. అలాగే, చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు కూడా వీడ్ హార్వెస్టర్ పేరుతో అత్యాధునిక యంత్రాన్ని తెప్పించారు. వీటిద్వారా సమయం కలిసిరావడమే కాకుండా పనులు సైతం అత్యంత వేగవంతంగా పూర్తయ్యే అవకాశం కలిగింది.
* పాతనోట్లతో బిల్లులు, ఫీజుల వసూలులో గడచిన పక్షంరోజుల్లో సుమారు రూ. 250కోట్లు సాధించి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది.

# గ్రామీణులకు వరం
# జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం
# (యన్.ఆర్.హెచ్.ఎమ్)

NATIONAL RURAL HEALTH MISSION
राष्ट्रीय ग्रामीण स्वास्थ्य मिशन



ఆరోగ్యమే మహాభాగ్యం – ఇది అతి పురాతన కాలంనుండి వింటున్న సందేశం. మనిషి ఆరోగ్యంగా వుంటే ఏమైనా సాధించవచ్చు. అలాగే అనారోగ్యంతో దాపురించే అనర్థాలు అన్నిఇన్నికావు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని అనారోగ్యం సమస్యలు గ్రామీణులపై తీవ్రమైన ఆర్థిక ప్రభావాన్ని చూపుతూ వున్నాయి. కూలీనాలి చేసుకునేవారు, సన్న,చిన్నకారు రైతులు, మధ్యతరగతి కుటుంబీకులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ఆర్థికంగా చిన్నాభిన్నమైన పరిస్థితులు కోకొల్లలు. ఇదిగమనించిన కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 2005వ సం॥లో గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎన్నోవెసులుబాట్లతో జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని (యన్.ఆర్.హెచ్.ఎమ్) ప్రవేశపెట్టడం జరిగింది.

**ఇందులోని ముఖ్యమైన అంశాలు ఒకసారి పరిశీలిద్దాం:**

**పథకం లక్ష్యం :**

1. నాణ్యమైన వైద్య సేవలను అందరూ వినియోగించుకునేలా చేయడం.
2. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థలను కూడా ప్రజారోగ్య కార్యక్రమాలు,పథకాల్లో భాగస్వాములను చేయడం.
3. ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంతో పాటు మౌలిక సదుపాయల విషయంలో పంచాయితీరాజ్ సంస్థలు,స్థానిక సమాజాన్ని ఒకే వేదికపై తీసుకురావడం.
4. స్థానికంగా ప్రజారోగ్య కార్యక్రమాలను అమలుచేయడంలో ప్రభుత్వానికి,స్థానిక ప్రజానీకానికి అనువైన యంత్రాంగాన్ని,వాతావరణాన్ని కల్పించడం.
5. ఆరోగ్యపరిరక్షణా కార్యక్రమాలను విస్తృతపరచడంలో వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించే కార్యచరణ ప్రణాళికను తయారు చేయడం.

**పథకం ఉద్దేశ్యాలు:**

1. శిశుమరణాల రేటును,ప్రసూతి మరణాల రేటును గణనీయంగా తగ్గించడం.
2. సమీకృత మరియు సమగ్ర ప్రాథమిక ఆరోగ్యపరిరక్షణ కార్యక్రమాలు,పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడటం.
3. అంటువ్యాధులను నిరోధించడం,అరికట్టడం మరియు అంటువ్యాధులు కాని రోగాలు,స్థానికంగా తలెత్తే ఆరోగ్య సమస్యలను అరికట్టడం మరియు నియంత్రించడం.
4. జనాభా స్థిరీకరణ,స్త్రీ,పురుష నిష్పత్తిలో సమతుల్యత సాధించడం.
5. స్థానిక మరియు సంప్రదాయ వైద్యం,ఆరోగ్యపరిరక్షణా పద్దతులను తిరిగి బలోపేతం చేయడం. నిఆయుష్నుప్రధాన ఆరోగ్య పరిరక్షణా విధానంగా రూపుదిద్దడం.

**ఎం.ఎం.ఆర్.కింద అమలవుతున్న ముఖ్యమైన కార్యక్రమాలు.**

**1.ప్రసూతి ఆరోగ్య పరిరక్షణా సేవలు.**

గర్భిణి స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం మెటర్నల్ హెల్త్‌కేర్ సర్వీసెస్‌ను అందుబాటులోకి తీసుకొస్తూ ఈక్రింది పథకాలను, విధానాలను వారికోసం అమలు చేయడం జరుగుతోంది.

**ఎ)మహిళా ఆరోగ్య కార్యకర్తలు(అక్రెడిటెడ్ సొషల్ హెల్త్ యాక్టివిస్ట్(ఆషా)**

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం,ఆరోగ్య పరిరక్షణ గురించి తెలిసిన ఒక వ్యక్తి అందరికి అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఈపథకాన్ని 2005-06లో ప్రారంభించడం జరిగింది. 21916 గ్రామాల్లో (67561జనావాస ప్రాంతాల్లో )ప్రస్తుతం దీన్ని అమలు చేయడం జరుగుతోంది.

గ్రామపంచాయితీ ఆరోగ్య కమిటీల ద్వారా మన రాష్ట్ర వ్యాప్తంగా 55400 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలను గుర్తించడం జరిగింది. ఈకార్యకర్తలే హెల్త్ రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేస్తారు. వీరిలో 51,900 మందికి తగు శిక్షణ ఇవ్వడంతో పాటు 31.3.2007 నాటికి నియమకాలు జరపడం కూడా పూర్తైంది. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణి స్త్రీలకు,శిశువులకు,అర్హులైన దంపతులకు వీరు సేవలందించడం జరుగుతోంది.

**బి) సమగ్ర అత్యవసర ప్రసూతి,నవజాత శిశురక్షణ ( మొదటిప్రక్రియ కేంద్రాలు (ఎఫ్.ఆర్.యులు)**

2005-06లో ఈపథకాన్ని ప్రారంభించడం జరిగింది.అత్యవసర పరిస్థితుల్లో మాతా శిశువుల ప్రాణాలు కాపాడామే ఈపథకం ప్రధన లక్ష్యం.(సిజేరియన్ ఆపరేషన్లు,అప్పుడే పుట్టిన బిడ్డలకు అత్యవసర వైద్యసేవలు మొదలైనవి ఈపథకంలో ఉంటాయి)

సెమాంక్ సేవలతో యఫ్ ఆర్‌యులు (సమగ్ర అత్యవసర మాతాశిశు సంరక్షణా కేంద్రాలు ) బలోపితం చేయబడ్డాయి.ప్రతి సెమాంక్ కేంద్రంలోను కనీసం నలుగురు ప్రసూతి వైద్య నిపుణులు,ఇద్దరు చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉంటారు. అలాగే,ఒక అనస్థెటిస్ట్,బ్లడ్‌బ్యాంక్ లేదా రక్తం నిల్వ కేంద్రాన్ని అందుబాటులో ఉంచడం జరుగుతుంది.వీటికి అదనంగా మందులు,ప్రతి కేసుకు అవసరమైన ఇతర వస్తువుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కూడా ఇవ్వడం జరుగుతుంది.

ఇప్పటి వరకు 148 సెమాంక్ లను నెలకొల్పడం జరిగింది. సుమారు 59 మంది ప్రసూతి వైద్యనిపుణులు,59 మంది ఎంబిబిఎస్ మహిళా మెడికల్ ఆఫీసర్లను వీటిలో నియమించడం జరిగింది.

**సి)బ్లడ్‌బ్యాంక్ అండ్ బ్లడ్ స్టోరేజ్:**

సిజేరియన్ సర్జరీ కేసులకు అప్పటికప్పుడు అవసరమైతే రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు ఈపథకాన్ని 2005-06 సంవత్సరం నుండి ప్రారంభించడం జరిగింది.సెమాంక్ సెంటర్లలో 16కొత్త బ్లడ్‌బ్యాంకులను 89రక్త నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిఉంది.2006-07 ఏడాదిలో 40 కొత్త బ్లడ్ స్టోరేజీ సెంటర్ల ఏర్పాటుకు సెమాంక్ సెంటర్లలో బ్లడ్‌బ్యాంకులు,రక్తనిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయడం కోసం రాష్ట్రస్థాయిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటిని నోడల్ ఏజెన్సీగా నియమించారు.

**డి) నిరంతర ఎంసిహెచ్‌కేంద్రాలు:**

సహజ కాన్పులు చేయించడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న కేసులను గుర్తించి వాటిని ఎఫ్‌ఆర్‌యులకు పంపడం కోసం ఇరవైనాలుగుగంటలూ సేవలందించే లక్ష్యంతో ఈపథకాన్ని 1997-98 సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది.520ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటల ఎంసిహెచ్‌లుగా పనిచేస్తున్నాయి. అలాగే 280ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 2007-08 సంవత్సరంలో 24 గంటల ఎంసిహెచ్ కేంద్రాలుగా మార్చడం జరిగింది.

**ఇ) జననీ సురక్ష యోజన (జెఎస్‌వై)**

ప్రభుత్వ లేదా ప్రయివేటు వైద్య సంస్థలు లేదా ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోడంలో గర్భిణీ స్త్రీలను ప్రోత్సహించడం కోసం ఈపథకాన్ని 2005-06 లో ప్రారంభించడం జరిగింది. ప్రసూతి మరణాలు,శిశుమరణాలు అరికట్టడమే దీని లక్ష్యం.ఈపథకం క్రింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు రూ॥1000 చొప్పున చెల్లించడం జరుగుతుంది.ఇందులో జనని సురక్ష పథకం కింద కేంద్రప్రభుత్వం రూ.700 సుఖీభవ పథకం కింద రాష్ట్రప్రభుత్వం రూ॥300 ఇవ్వడం జరుగుతోంది.2006 ఏప్రిల్1 నుంచి పట్టణ ప్రాంతాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు కూడా ఈపథకాన్ని వర్తింపజేస్తున్నారు.

**ఎఫ్) ఉచిత బస్సు పాసులు.**

కాన్పుకోసం ఆతర్వాత శిశువును ఆసుపత్రిలో చూపించడం కోసం గ్రామీణ ప్రాంతాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలవారికి రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ బస్సులో ఉచిత ప్రయాణం చేసేందుకు వీలుకల్పించడం జరిగింది.వీటితో పాటు,దగ్గర్లోని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్యసేవలను వినియోగించుకోడానికి కూడా ఆర్టీసీ నిరుపేదలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది.2006-07 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 8లక్షల మంది లబ్దిదారులకు ఏపిఎస్‌ఆర్టీసీ ఉచిత బస్సుపాసులు జారీ చేసింది.

**జి) గ్రామీణ అత్యవసర ఆరోగ్య రవాణా పథకం (రూరల్ ఎమర్జెన్సీ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ స్కీమ్)**

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణీ స్త్రీలు,శిశువులు,చిన్నపిల్లలతో పాటు అత్యవసర వైద్య సహాయం అవసరమైన ఇతరులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించడం కోసం ఈపథకాన్ని 2006-07 సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది.ఈవిధంగా మహబూబ్‌నగర్,నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈఅంబులెన్సుల నిర్వహణను ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు అప్పగించడం జరిగింది.ఈసంస్థను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం గుర్తించడం జరిగింది రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఈఅంబులెన్సు సౌకర్యాన్ని అన్ని రకాల అత్యవసర వైద్య చికిత్స కోసం పూర్తస్థాయిలో ఉచితంగా వినియోగించుకుంటున్నారు.

**2.శిశు ఆరోగ్య పరిరక్షణ సేవలు:**

ఈక్రింది పద్ధతులు మరియు విధానాలను ఉపయోగిస్తూ శిశు పరిరక్షణ సేవలు అందించడం జరుగుతోంది.

-నవజాత శిశువుల కోసం ఇన్టెన్సివ్ కేర్ యూనిట్లు

-నవజాత శిశువుల సంరక్షణ పరికరాలు

-నవజాత శిశురక్షణ కోసం ప్రచార, చైతన్య కార్యక్రమాలు.

**ఎ) నవజాత శిశుసంరక్షణ యూనిట్లు (ఎన్‌ఐసియుఎస్)**

ఈపథకాన్ని 2006-07 సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది.పసిపిల్లలకు,అప్పుడే పుట్టిన శిశువులకు అత్యవసర వైద్యసేవలు అందించడం ద్వారా శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించడం ఈపథకం ముఖ్యోద్దేశం.అలాగే సుదూర గ్రామీన ప్రాంతాలు,గిరిజన గూడేలతో పాటు పట్టణ ప్రాంతాల్లో శిశుసంరక్షణా సేవలు అందించడం కూడా ఈపథకం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి.

**బి) నవజాత శిశుసంరక్షణా కిట్లు:**

శరీర ఉష్ణోగ్రతా మాంద్యం వల్ల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికంటే తక్కువగా ఉన్న కారణంగా (చల్లబడిపోవడం) ఎదురయ్యే శిశుమరణాలను,భాహ్య ఇన్ఫెక్షన్ల కారణంగా సంభవించే మరణాలను అరికట్టడం కోసం ఈనవజాత శిశు సంరక్షణా కిట్లను సమకూర్చడం జరుగుతోంది.2006-07 సంవత్సరంలో ఈపథకం అమలు మొదలైంది.ఈపథకం కింద తక్కువ బరువుతో ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన(ఎస్‌సి-ఎస్‌టి-దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు



చెందిన) శిశువుల కోసం అందజేయడం జరుగుతుంది.

నవజాత శిశుసంరక్షణా కిట్లలో రెండు బేబీ మ్యాట్రెస్‌లు,నాలుగు బేబీ జాకెట్లు, మూడుక్యాప్‌లు, మూడుజతల గ్లవ్స్, 12బేబీ దయపర్లు మరో ఎనిమిది బేబీ బ్లాంకెట్లు ఉంటాయి. ఈకిట్లను సూక్ష్మ జీవరహితంగా ఉండడంతో పాటు పిల్లలను వెచ్చగా ఉంచుతూ వారిని ఉష్ణోగ్రతా మాంద్యం,వెలుపలి ఇన్ఫెక్షన్ల నుంచి ప్రాణాపాయం లేకుండా చూస్తాయి.

**సి) నవజాత శిశురక్షణ కోసం ప్రచార, చైతన్య కార్యక్రమాలు:**

వివాహం చేసుకోవాల్సిన వయసుతో పాటు నవజాతశిశువులు,పనిపిల్లల్లో ప్రమాదకర ఆనారోగ్య లక్షణాలపై తల్లిదండ్రుల్లో అవగాహన,చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ ప్రచార కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగింది. శిశుమరణాలు అత్యధికంగా ఉన్నట్లు 2005-06 సంవత్సరంలో గుర్తించిన జిల్లాలలో ఈప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతూవుంది.

**3.కుటుంబనియంత్రణ భీమా పథకం:**

కుటుంబనియంత్రణ విధానాలకు అంగీకరించిన వారికి భీమా సదుపాయం కల్పించడం కోసం 2005 లో ఈపథకాన్ని ప్రారంభించడం జరిగింది.ఈపథకం పూర్తి వివరాలు:

**4.గిరిజన ఆరోగ్య సేవలు:**

| క్ర.సం | వర్తించే అంశాలు | భీమా పరిమితి |
|---|---|---|
| 1. | కుటుంబనియంత్రణ శస్త్రచికిత్స జరుగుతున్న సమయంలో ఆసుపత్రిలోనే మరణం సంభవించినా లేదా ఆపరేషన్ జరిగి డిశ్చార్జి అయిన 7 రోజుల్లోగా మరణం సంభవించినా... | రూ॥ 2,00,000 |
| 2. | కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న తర్వాత 8 నుంచి 30 రోజుల్లోగా మరణం సంభవిస్తే | రూ॥ 50,000 |
| 3. | కుటుంబనియంత్రణ ఆపరేషన్ విఫలమైతే (ఒకసారి చెల్లింపు మాత్రమే) | రూ॥25,000 |
| 4. | కుటుంబనియంత్రణ ఆపరేషన్ తర్వాత ఏవైనా.ఆరోగ్య సమస్యలు తలెత్తితే వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులు (ఆపరేషన్ జరిగిన 60 రోజుల లోపు) | చికిత్సకు వాస్తవంగా అయిన ఖర్చు రూ॥ 25,000(గరిష్టంగా) |

గిరిజన ప్రాంతాల్లో ఈక్రింద పేర్కొన్న అదనపు ఆరోగ్య సేవలను అమలు చేయడం జరుగుతోంది.

- సంత మార్కెట్ల స్థాయిలో ప్రతి సంతకు వారంలో ఒకరోజు ఆర్‌సిహెచ్ వైద్య శిబిరాలతో సహా ఆర్‌సిహెచ్ వైద్య సేవల ప్యాకేజి అమలు చేయడం జరుగుతోంది.
- అత్యవసర ఆరోగ్య రవాణా వాహనాలు గిరిజన ప్రాంతాల్లో ఉచితంగా సేవలందిస్తున్నాయి.
- రాష్ట్రంలో ఉన్న అన్ని గిరిజన ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ యూనిట్లు గిరిజనులకు వారి ఇళ్ల దగ్గరే వైద్య సేవలు అందిస్తున్నాయి.
- ప్రసూతి గృహాల ఏర్పాటు: మారుమూల గిరిజన తండాలు,గూడేలలోని గర్భిణీ మహిళల కోసం ఇవి ఏర్పాటు చేయబడ్డాయి.వైద్యులు అటూ ఇటుగా నిర్ణయించిన ప్రసవ సమయానికి రెండు మూడు రోజులు ముందుగానే అక్కడికి చేరుకుని వైద్యులు లేదా ఆరోగ్యకార్యకర్తలు సేవలందిస్తారు. ప్రసూతి గృహాల్లో గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవల కారణంగా,ప్రసవ సమయంలో సమస్యలు ఎదురుకాకుండా చూడడం జరుగుతుంది.

**5. సబ్ సెంటర్ అన్‌టైడ్ ఫండ్(నిధులు) :**

సబ్‌సెంటర్ స్థాయిలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య కార్యక్రమాల అమలుతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు అవసరమైన నిధులను గ్రామపంచాయితీకి సమకూర్చేందుకు ఉద్దేశించిన ఈపథకాన్ని 2005-06 ప్రారంభించడం జరిగింది. ఏడాది ఒక్కో సబ్ సెంటర్‌కు రూ॥ 10,000 చొప్పున విడుదల చేయడం జరుగుతుంది. ఈమొత్తాన్ని వినియోగించేందుకు గ్రామ సర్పంచ్, ఏఎన్ఎంల జాయింట్ అకౌంట్‌లో జమచేయడం జరుగుతుంది.

**6.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు:**

2006-07 లో ఈపథకాన్ని మొదలు పెట్టడం జరిగింది.

**ఈపథకం ముఖ్య ఉద్దేశాలు:**

- కేంద్రంలో చిన్న చిన్న రిపేర్లు చేయడానికి

- క్రమం తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి
- సైంటిఫిక్,బయో మెడికల్ వ్యర్థాలను తొలగించే ఏర్పాట్లు చేయడానికి.
- ఎంసిహెచ్ఏ(ఎంఅడ్ఎఫ్)మరియు ఆషా కార్యకర్తలతో ఎన్ఆర్హెచ్ఎం సమీక్ష కార్యక్రమాలకు అయ్యే ఖర్చును భరించడం కోసం.
- కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సిఫారసు చేసిన ప్రయాణమరియు రవాణ ఖర్చులు భరించడానికి వీటి కోసం ఒక్కో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రూ॥ 90,000చొప్పున బడ్జెట్ కేటాయించడం జరిగింది.

**7.కమ్యూనిటి ఆరోగ్యకేంద్రాల నిర్వహణకు నిధులు:**

**ఈపథకాన్ని 2006-07 లో ప్రారంభించడం జరిగింది.**

**ఈపథకం లక్ష్యాలు:**

- కమ్యూనిటి ఆరోగ్యం కేంద్రాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం
- కమ్యూనిటి ఆరోగ్యం కేంద్రాలను పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచడం
- సైంటిఫిక్,బయోమెడికల్ వ్యర్థాలను తొలగించే ఏర్పాట్లు చేయడం
- క్షేత్రస్థాయి సిబ్బందితో ఎన్ఆర్హెచ్ఎం సమీక్షా సమావేశాలకయ్యే ఖర్చును భరించడం
- కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సిఫారసు చేసిన ప్రయాణ మరియు రవాణ ఖర్చులు భరించడానికి.

**8. ఆసుపత్రుల అభివృద్ధి సంఘాలు (రోగి కళ్యాణ సమితి)**

ఈపథకాన్ని 2006-07లో ప్రారంభించడం జరిగింది.కొన్ని విస్తృత ప్రయోజనాలను ఆశించి ఈపథకాన్ని రూపకల్పన చేయడం జరిగింది. ఆ లక్ష్యాలు : 1.ఆరోగ్య సంస్థలు మరియు ఆసుపత్రులను బాగుపరచు పరికరాల స్థాయినిపెంచి సేవలను ఆధునీకరించడం 2.క్రమశిక్షణను పాటింపచేస్తూ సిబ్బంది కార్యకలాపాలను పర్యవేక్షించడం 3.ఆసుపత్రి భవనాలను విస్తరించే నిర్మాణ కార్యక్రమాలను చేపట్టడం 4.ఆసుపత్రి స్థలాలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగించుకోవడం 5.ఆరోగ్యసంస్థలు,ఆసుపత్రులను నడపడంలో కమిటీలకు భాగస్వామ్యం కల్పించడం 6.సైంటిఫిక్,బయోమెడికల్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చేయడం 7. వైద్యులకు,సిబ్బందికి తగు శిక్షణ అందేలా చర్యలు తీసుకోవడం 8.రాయితీ కల్పించిన ఆహారం, మందులు రోగులకు వారి సహాయకులకు అందేలా చూడడం.9.జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సరిగ్గా అమలయ్యేలా చర్యలు తీసుకోవడం మరియు 10.వైద్యసంస్థలు లేదా ఆసుపత్రులు-యంత్రసామాగ్రి,వైద్య పరికరాల సరైన వినయోగం,సమయానుగుణ నిర్వహణ,ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మత్తులు చేయించడం.

ఎన్ఆర్హెచ్ఎం క్రింద ఒకసారి కార్పస్ గ్రాంటుగా భారత ప్రభుత్వం ఆసుపత్రుల అభివృద్ధి సంఘాలకు నిధులు అందిస్తోంది.జిల్లా ఆసుపత్రులకు రూ. 5లక్షలు,ఏరియా ఆసుపత్రులు లేదా సిహెచ్సిలు లేదా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఒక్కోదానికి రూ॥ఒకలక్షచొప్పున గ్రాంటు ఇస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ఆసుపత్రులు,ఏరియా ఆసుపత్రులు,కమ్యూనిటి హెల్త్ సెంటర్లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆసుపత్రి అభివృద్ధి సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది.

**9.గ్రామస్థాయి పారిశుధ్య కమిటీలు:**

గ్రామాల్లో వైద్యసేవలను పరిపూర్ణంగా వినయోగపడేలా చూడ్డం కోసం ఈపథకాన్ని 2006-07లో మొదలుపెట్టడం జరిగింది. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయడం కోసం గ్రామస్థాయిలో పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడడంతోపాటు గ్రామల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని కాపాడడం ఈకమిటీల బాధ్యత.

గ్రామ పారిశుధ్య మరియు ఆరోగ్య కమిటీలు గ్రామ పాంచాయితీ సర్పంచ్ అధ్యక్షుడుగా వార్డుమెంబర్లు,అంగన్వాడీ కార్యకర్తలు,ఏన్ఎంలు ఇంకా మహిళలు,ఆరోగ్య కార్యక్తలు,ఎంపిహెచ్ఏలు(ఎం)ఎంపిహెచ్ఏలు(ఎఫ్)లు సభ్య కన్వీర్లుగా ఏర్పాటు చేయబడ్డాయి.

**10.ఈ పథకం నుండి ఆశించే పలితాలు:**

1. ఓఈపథకం అమలు ద్వారా గ్రామీణ ప్రాంతలలో మహిళల ప్రసూతి మరణాల రేటును మరియు శిశుమరణాల రేటును క్రింది విధంగా గణనీయంగా తగ్గించడం.

| క్ర.సం | అంశం | ప్రస్తుతపరిస్థితి | | 2017 నాటికి రాష్ట్ర లక్ష్యం |
|---|---|---|---|---|
| | | దేశ వ్యాప్తంగా | రాష్ట్ర వ్యాప్తంగా | |
| 1 | ప్రసూతి మరణాల రేటు (యం.యం.అర్) ప్రతి వేయి (1000) మందికి | 126 | 78 | 57 |
| 2 | శిశు మరణాల రేటు (ఐ.యం.అర్) ప్రతి వేయి(1000) మందికి | 39 | 29 | 18 |

2. వివిధ ఆరోగ్య సేవల ద్వారా మరియు పారిశుధ్యం పెంపొందించే చర్యల ద్వారా గ్రామీణులను వివిధ అంటువ్యాధుల బారినుండి మరియు ఆనారోగ్య రుక్మదలనుండి కాపాడటం.
3. మిలినియం అభివృద్ధి/ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడం.

పైవిధంగా జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రభుత్వం కల్పించిన వివిధ వెసులుబాట్లను ఉపయోగించకోవడం ద్వారా ఆరోగ్యపరంగా ప్రభుత్వ లక్ష్యాలను సాధిద్దాం.

**- జి.జయపాలరెడ్డి, సి.ఇ.ఓ జడ్పి (విశ్రాంత),**
**సలహాదారుడు,సి.ఎన్.ఆర్.ఎమ్.టి.సిపార్డ్**

Printed & Published by: Neetukumari Prasad, Chief Executive Officer, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Neetukumari Prasad